నామిని
గత వారంలో మీలొ పై మీ ఆశాన్ని

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

21-5-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 110 పేజీలు: 10+4 వెల: 6.50

మోడీ, అమిత్‌షా దేశద్రోహులు: రాహుల్ 5

ఇటలీ, భారత్ వాణిజ్యం 20 బిలియన్ యూరోలు 7


## ప్రధాని మోడీకి ఇటలీలో అరుదైన గౌరవం



### ఎఫ్ఎఒ ప్రతిష్టాత్మక 'అగ్రికోలా మెడల్ 2026' ప్రదానం

**రోమ్, మే 20:** ప్రధాని మోడీకి ఇటలీ పర్యటనలోఅరుదైన గౌరవం దక్కింది. మోడీకి ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎవో) అత్యున్నత గౌరవమైన "అగ్రికోలా మెడల్ 2026"తో సత్కరించింది. ఇటలీరాజధాని రోమ్‌లోని ఎఫ్ఎవో ప్రధాన కార్యాలయంలో >>2

## కులగణన సమంజసమే




### వ్యతిరేకించిన పిల్‌ను కొట్టివేసిన సుప్రీం కోర్టు

### ప్రజలను గుర్తించే హక్కు ప్రభుత్వానికి ఉన్నదని వ్యాఖ్య

**న్యూఢిల్లీ, మే 20:** జనాభా లెక్కలలో కుల గణనను తొలగించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్)ను సుప్రీంకోర్టు బుధవారం తిరస్కరించింది. జాతీయ జనాభా గణనలో భాగంగా ప్రస్తుత ప్రభుత్వం కుల గణనను చేపట్టడంలో, నిర్ధారించడంలో ఎలాంటి తప్పులేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. "ఏ ప్రభుత్వమైనా ఎంతమంది >>2



బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌తో భేటీ అయిన డి.సిఎం భట్టి

## 5 వేల కోట్లివ్వండి

### మూలధన పెట్టుబడులకు సాయం చేయండి

### కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్‌ను కోరిన డి.సిఎం భట్టి

### ఎఫ్ఆర్‌బిఎం నుండి మినహాయింపునకు వినతి

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** రాష్ట్రాల మూలధన పెట్టుబడులకు ప్రత్యేక సహాయపథకం (ఎస్ఎఎస్‌సిఐ) కింద తెలంగాణకు అదనంగా రూ.5 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారమన్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. ఈ మేరకు ఢిల్లీలో బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, విద్యా మౌలిక వసతులు, మూలధన వ్యయాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ప్రధానంగా విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న భారీ పెట్టుబడులు, సంక్షేమ కార్యక్రమాలను >>2

# జిల్లాల్లోను జిసిసిలు

### హైదరాబాద్ వెలుపల కూడా ఏర్పాటుకు ప్రణాళిక

### ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో ప్రత్యేక పెట్టుబడుల సెల్

### ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు జర్నలిస్టులకు 500 ఎకరాలు

### బుల్లెట్ రైలు కోసం భూసేకరణ: పరిశ్రమల సమీక్షలో సిఎం రేవంత్



బుధవారం పరిశ్రమల సమీక్షలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే20:** తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరానికే కాదు జిల్లాలకూ ఐటీ వెలుగులు విస్తరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. హైదరాబాద్ అవతల కూడా గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) ఏర్పాటు చేసేలా ప్రత్యేక పాలసీ తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్,విజయవాడ రోడ్ల హైవేల వెంట జీసీసీలు, డేటా సెంటర్లు ఏర్పాటు చేసే కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని సూచించారు. ఈమేరకు ప్రభుత్వ భూములు గుర్తించాలి..ద్వితీయ శ్రేణి నగరాలల్లో జీసీసీ, ఏర్పాటు పైన దృష్టి పెట్టేలా పాలసీ రూపకల్పన చేయాలని చెకప్పారు..మూడు నెలల్లో ప్రభుత్వ కార్యాలయాలు టీ ఫైబర్ కు కనెక్ట్ కావాల్సిందేనని స్పష్టం చేశారు. బుధవారం ఐటీ, పరిశ్రమల శాఖలపై ఎంసీహెచ్ఆర్‌డిలోని బోధి పెవిలియన్‌లో పరిశ్రమల శాఖపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణారావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(టీజీఐఐసీ) వైస్‌చైర్మన్, ఎండీ కె. శశాంక, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఐటీ, ఇతర ఉద్యోగ అవకాశాలు హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. 'బియాండ్ క్యూర్' (కోర్ అర్బన్ రీజియన్) ప్రాంతాలను గుర్తించి అక్కడ ఐటీ, డేటా సెంటర్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. >>2

### పోలీస్ శాఖలో రెస్పాన్సిబిలిటీ

## పెరగాలి

రెండేళ్ల పాటు ఇతర విభాగాల్లో పని చేయాలి

ఆహారకల్తీపై ఉక్కుపాదం, ప్రత్యేక చట్టం

డ్రగ్స్ బాధితుల కోసం డీఅడిక్షన్ సెంటర్లు ఏర్పాటు

స్కిల్స్ వర్సిటీలో సైబర్ క్రైమ్‌పై ప్రత్యేక కోర్సు

పోలీస్ అధికారులతో సిఎం రేవంత్ సమావేశం

8



## మెట్రో ఫేజ్ 2కి రెడీ

### డిపిఆర్ అందగానే నిర్ణయం

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు రెండో దశ పనుల్లో రాష్ట్ర ప్రభుత్వంతో 50:50 వ్యయ భాగస్వామ్య ప్రాతిపదికన పాల్గొనేందుకు కేంద్రం సూత్రప్రాయంగా సిద్ధంగా ఉందని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి బుధవారం తెలిపారు. ఢిల్లీలో బుధవారం కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్‌తో కలిసి హైదరాబాద్‌లోని కీలక అభివృద్ధి ప్రాజెక్టులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో మెట్రో 162 కిలోమీటర్ల రెండో దశకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను కేంద్రం >>2

## ఎండ మంటలు

### 45$^{\circ}$ దాటిన ఉష్ణోగ్రతలు

### మరో అయిదు రోజులు రెడ్ అలర్ట్

### ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్న సిఎం రేవంత్

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. ఆకాశం నుంచి నిప్పులు కురుస్తున్నాయా అన్నట్లుగా ఉష్ణోగ్రతలు రోజురోజుకూ రికార్డు స్థాయికి చేరుకుంటున్నాయి. తెలంగాణలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ రాబోయే ఐదు రోజుల పాటు రెడ్ అలర్ట్ జారీ చేసింది. కొన్ని ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు ఏకంగా 45 డిగ్రీల సెల్సియస్ దాటే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని సూచిస్తున్నారు. ఎండతీవ్రతకు తెలంగాణ నిప్పుల



కొలిమిలా మారుతోంది. ఉదయం 10 గంటలకే ఇంటినుంచి బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. రానున్న అయిదు రోజులపాటు ఎండతీవ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45డిగ్రీలపైనే నమోదయ్యేఅవకాశం ఉందని హెచ్చరిస్తూఆయా జిల్లాలకు >>2



కాళేశ్వరం వద్ద గోదావరి తీరంలో సరస్వతి నది అంత్యపుష్కరాల ఏర్పాట్ల దృశ్యం

## 'సరస్వతి' అంత్యపుష్కరాలు

### నేడు కంచి స్వామి విజయేంద్ర సరస్వతి, గవర్నర్ శివప్రతాప్ శుక్లా తొలి పుష్కర స్నానం

### దాదాపు 40 లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం

### కాళేశ్వరం వద్ద భారీ ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే20:** కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లను చేసింది. పుష్కర స్నానాలు గురువారం(మే 21 వ తేదీ) నుండి 12 రోజుల పాటు (జూన్1 వరకు) జరగనున్నాయి. ఈ పుష్కరాలకు 30 నుండి 40 లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం భారీ ఎత్తునఏర్పాట్లు చేసింది. గత సంవత్సరం >>2

### రేపు ప్రజాపాలన

## జిల్లాస్థాయి సదస్సులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే20:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం 99 రోజుల యాక్షన్ ప్లాన్ పై అన్ని జిల్లాల్లో శుక్రవారం(ఈనెల 22న) జిల్లాస్థాయి సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం గత మార్చి 6వ తేదీ నుండి జూన్ 12 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను అమలు చేసేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించింది. అందులో భాగంగా ఈ నెల 22వ తేదీన అన్ని జిల్లా కేంద్రాలలో జిల్లా స్థాయి సదస్సులు నిర్వహించాలని ఆదేశించింది. ఈ సదస్సుల్లో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ సదస్సులలో సిఎం సందేశం, 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలు, వెల్లడించాలని ప్రభుత్వ ఉత్తర్వుల్లో సూచించారు.

### గ్లోబల్ టెక్ - ట్రావెల్ క్లస్టర్‌గా

## హైదరాబాద్ అభివృద్ధి

### రెడీ టు వర్క్ ఫోర్స్ తయారీ: మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్, మే 20 ప్రభాతవార్త:** గ్లోబల్ టెక్-ట్రావెల్‌క్లస్టర్‌గా హైదరాబాద్‌ను తీర్చి దిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా ఈ రంగ దిగ్గజ కంపెనీలను ఆకర్షించేలా ఒక పటిష్ఠమైన ఎకో సిస్టంను అభివృద్ధి చేస్తున్నామన్నారు. బుధవారం హైటెక్ సిటీలో అమెరికాకు చెందిన ప్రముఖ ఎయిర్ లైన్స్ సంస్థ సౌత్ వెస్ట్ ఎయిర్ లైన్స్ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ విమానయానం, స్పేస్‌టెక్, డిఫెన్స్, డీప్‌టెక్ తదితర రంగాల్లో హైదరాబాద్ ఒక వ్యూహాత్మక కేంద్రంగా ఎదుగుతోందని వివరించారు. గత రెండేళ్ల వ్యవధిలో వ్యాన్‌గార్డ్, మారియట్ ఇంటర్నేషనల్, హెచ్‌సీఏ హెల్త్ కేర్, హార్ట్ ఫోర్డ్, బిఏఎస్ఎఫ్ తదితర ఎన్నో దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌ను తమ గమ్యస్థానంగా ఎంచుకున్నాయన్నారు. తాజాగా ఈ జాబితాలో సౌత్ వెస్ట్ ఎయిర్స్ లైన్స్ సైతం చేరడం మనకు గర్వకారణమన్నారు. హైదరాబాద్ ఇన్నోవేషన్ ఎకో సిస్టంను మరింత బలోపేతం చేసేలా నేటి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రెడీ టూ వర్క్ ఫోర్స్ తయారీపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ఆర్ అండ్ డి, స్కిల్లింగ్, ఇన్నోవేషన్ తదితర అంశాల్లో దిగ్గజ సంస్థలతో కలిసి పని >>2



బుధవారం హైదరాబాద్‌లో మూతపడిన మెడికల్ షాపులు

## మెడికల్ షాపుల బంద్

### తెలంగాణలో 30వేలు దాకా మూత పడిన దుకాణాలు

### రోజువారీ మందుల కోసం రోగుల ఇక్కట్లు

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** ఆన్‌లైన్ ఫార్మసిల (ఈ-ఫార్మసి) అమ్మకాలను వ్యతిరేకిస్తూ ఫార్మసి వ్యాపార సంఘాల (ఎఐఒసిడి, టిటిసిడిఎ) పిలుపు మేరకు బుధవారం దేశవ్యాప్తంగా ఔషధ దుకాణాలుబంద్ పాటించాయి. ఈ బంద్ ప్రభావం తెలుగు రాష్ట్రాల్లో స్పష్టమైన ప్రభావం చూపింది.ఆన్‌లైన్ మందుల అమ్మకాలను వ్యతిరేకిస్తూ, కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యాన్ని నిరసిస్తూ ఈనెల20న దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్‌కు ఆల్ ఇండియా >>2

## వేగంగా మక్కల కొనుగోళ్లు

### ఇప్పటి దాకా 11.54లక్షల మె.ట సేకరణ

### ముందంజలో ఖమ్మం జిల్లా



**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యాసంగి మొక్కజొన్న కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. యాసంగి పంటకు సంబంధించి రాష్ట్రంలో మొక్కజొన్న అంచనా ఉత్పత్తి 43.18 లక్షల మెట్రిక్ టన్నులుగా అంచనా వేసినట్లు తెలిపింది. ఇందులో 21.59 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయాలన్న అంచనాకు వచ్చినట్లు పేర్కొంది. జిల్లాల వారీగా మొత్తం 14.89 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్లు వెల్లడించింది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 336 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని, బుధవారం నాటికి మొత్తం 11.54 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు పూర్తయిందని వెల్లడించింది. కొనుగోలు చేసిన మొక్కజొన్నలో 9.53 లక్షల మెట్రిక్ టన్నులు గోదాములకు తరలించామని, ఇంకా 2.01 లక్షల మెట్రిక్ టన్నులు గోదాములకు తరలించాల్సి ఉందని తెలిపింది. కొనుగోళ్లలో ఖమ్మం జిల్లా ముందంజలో ఉందని, జిల్లాలో ఇప్పటివరకు 2.54 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు ప్రభుత్వం వివరించింది. తర్వాతి స్థానాల్లో నాగర్‌కర్నూల్ 1.55 లక్షల మెట్రిక్ టన్నులు, వరంగల్ 1.11లక్షల మెట్రిక్ టన్నులు, నిర్మల్ 1.05 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని చెప్పింది. మొక్కజొన్న నిల్వకు మొత్తం 15.53 >>2




బుధవారం రోమ్‌లో ఇటలీ ప్రధాని మెలోనీకి మెలోడీ చాక్లెట్ గిఫ్ట్ ఇస్తున్న ప్రధాని మోడీ

# ఇటలీ ప్రధాని మెలోనీకి ప్రధాని మోడీ 'మెలోడీ' గిఫ్ట్

## రోమ్‌లో కారులో ప్రయాణించిన ఇద్దరు అధినేతలు

**రోమ్, మే 20:** భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనిల మధ్య ఉన్న ఫ్రెండ్‌షిప్‌ను నెటిజన్లు సరదాగా మెలోడి అని పిలుస్తుంటారు. దీనిపై సోషల్ మీడియాలో ఎన్నో మీమ్స్ కూడా వచ్చాయి. అయితే ఈక్రేజ్‌ను మోడీ భలే వాడుకున్నారు. తన ఇటలీ పర్యటనలో భాగంగా మెలోనికి సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చి అందరినీ నవ్వించారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా రోమ్ చేరుకున్నారు మోదీ. ఈ సందర్భంగా మెలోనిని కలిసిన ఆయన భారత్‌లో ఎంతో పాప్యులర్ అయిన పార్లే మెలోడీ చాక్లెట్ ప్యాకెట్‌ను బహుమతిగా ఇచ్చారు. ఇద్దరు నేతల పేర్లను కలిపి ఇంటర్నెట్‌లో నడుస్తున్న ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని మోడీ ఈ సరదా గిఫ్ట్ ప్లాన్ చేశారు. ఈ చాక్లెట్ ప్యాకెట్‌ను అందుకున్న మెలోని ప్రధాని మోదీతో కలిసి దిగిన ఒక చిన్న వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. బహుమతికి చాలా థాంక్స్ అని ఆమె రాశారు. మెలోని మాట్లాడుతూ ప్రధాని మోడీ నాకోసం చాలా మంచి టోఫీలు తెచ్చారు అనగానే, పక్కనే ఉన్న మోడీ నవ్వుతూ మెలోడీ అని అన్నారు. నెట్టింట వైరల్ అయిన విడియోకు గంట వ్యవధిలో లక్షకు పైగా లైక్స్, దాదాపు 9వేల కామెంట్స్, 25 వేలకు పైగా షేర్స్ వచ్చాయి. రోమ్ చేరుకున్న మోడీకి మెలోనీ ఘన స్వాగతం పలికారు. ఇద్దరూ కలిసి కార్‌లో ప్రయాణిస్తూ నగర వీధుల్లో సందడి చేశారు.

## కోలోస్సియంను సందర్శించిన మోడీ

**రోమ్, మే 20:** ప్రధాని మోడీ యూరోప్ పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఆయన ఇటలీ వెళ్లారు. ఆ దేశ ప్రధాని జార్జియా మెలోనీ ఆయనకు స్వాగతం పలికారు. రోమ్‌లో ఆ ఇద్దరూ కలిసి కొన్ని ప్రదేశాలకు వెళ్లారు. ప్రత్యేకంగా తన వాహనంలో మోడీని ఆమె తీసుకెళ్లారు. మోడీ సాదర స్వాగతం లభించింది. మోడీకి వెల్కం చెబుతూ మెలోనీ తన ఎక్స్ అకౌంట్‌లో కొన్ని ఫోటోలు పోస్టు చేశారు. వాటితో పాటు రెండు దేశాలకు చెందిన జాతీయ జెండాలతో కూడిన ఎమోజీలను ఆమె పోస్టు చేశారు. మోడీ, మెలోని రూమ్‌లో ఉన్న కొలోస్సియంను విజిట్ చేశారు. అతి ప్రాచీనమైన ఆ స్టేడియాన్ని ఫ్లావియన్ ఆంఫీథియేటర్‌గా పిలుస్తారు. రోమ్ నగరం మధ్యలో ఈ కట్టడం ఉంటుంది. కొలోస్సియం వద్ద మోదీ, మెలోనీ దిగిన ఫోటోకు మిలియన్ల సంఖ్యలో ఫాలో అయ్యారు. 60 వేల లైక్స్ వచ్చాయి. వీరి స్నేహంపై సుమారు రెండు వేల మంది కామెంట్ చేశారు. ఇక మెలోనీతో కలిసి డిన్నర్ చేసిన ఫోటోలను మోడీ పోస్టు చేశారు.

# కులగణన సమంజసమే

>> వెనుకబడిన వారు ఉన్నారో, ఎంతమందికి సంక్షేమ పథకాలు అవసరమో తెలుసుకోవాలి. ఇది ఒక విధానపరమైన అంశం" అని త్రిసభ్య ధర్మాసనానికి నేతృత్వం వహించిన భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. "జనాభా లెక్కలు కుల ఆధారితంగా ఉండాలా వద్దా అనేది ఒక విధానపరమైన నిర్ణయం. ఎంతమంది వెనుకబడిన తరగతికి చెందినవారు ఉన్నారో ప్రభుత్వం తెలుసుకోవాలి" అని సిజెఐ వ్యాఖ్యానించారు. ఈ అంశం ప్రభుత్వ విధాన పరిధిలోకి వస్తుందని, ఇందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చీ, విపుల్ పంచోలీలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ అంశం ప్రభుత్వ విధాన పరిధిలోకి వస్తుందని పేర్కొంటూ, 2027 జనాభా గణన నుండి కుల సమాచార సేకరణను తొలగించాలని కోరుతూ దాఖలైన ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) సుప్రీం కోర్టు కొట్టివేసింది. పిటిషనర్‌గా స్వయంగా హాజరైన సుధాకర్ గుమ్ముల, 2027 జనాభా లెక్కలలో కుల గణనను చేర్చవద్దని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు.

# మెట్రో ఫేజ్ 2కి రెడీ

>> సానుకూలంగా పరిశీలిస్తుందని తనకు హామీ ఇచ్చారని తెలిపారు. అయితే తెలంగాణ ప్రభుత్వం నుంచి వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్)తో పాటు, ఇతర సాంకేతిక వివరాలు అందిన తర్వాతే కేంద్రం తుది నిర్ణయం తీసుకుంటుందని మనోహర్ లాల్ రెడ్డికి తెలిపారు. హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాలు, ప్రాథమిక సౌకర్యాలను మెరుగుపరిచేందుకు కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తోందని మనోహర్ లాల్ కూడా చెప్పినట్లు తెలిపారు. అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ 2.0 (అమృత్) పథకం కింద మూసీ నదిని శుభ్రపరిచేందుకు కేంద్రం రూ. 3,975 కోట్లతో 39 మురుగునీటి శుద్ధి కర్మాగారాలను మంజూరు చేసిందని చెప్పారు. దేశవ్యాప్తంగా చట్టబద్ధమైన పట్టణాల్లోని అన్ని గృహాలకు పనిచేసే కుళాయి నీటి కనెక్షన్లను అందించడానికి, అమృత్ మొదటి దశ కింద చేర్చబడిన 500 నగరాల్లో మురుగునీటి, సెప్టేజ్ నిర్వహణ కవరేజీని అందించడానికి ఈ కార్యక్రమం 2021లో ప్రారంభించబడిందని వెల్లడించారు.

## వేగంగా మక్కల కొనుగోళ్లు

>> లక్షల మెట్రిక్ టన్నుల స్టోరేజ్ అవసరం కాగా ప్రస్తుతం 12.75 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ స్థలం అందుబాటులో ఉందని వెల్లడించింది. సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లు అదనంగా 27 వేల మెట్రిక్ టన్నుల నిల్వకు సరిపడా స్థలాన్ని గుర్తించారని తెలిపింది. ఇంకా రాష్ట్రవ్యాప్తంగా 2.48 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ స్థలాన్ని గుర్తించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొంది. మొక్క జొన్న కొనుగోళ్లకు మొత్తం 3.10 కోట్ల గన్నీ బ్యాగులు అవసరమైన నేపథ్యంలో ఇప్పటివరకు 2.42 కోట్ల బ్యాగులు సరఫరా చేశామని చెప్పింది. ఇంకా 67.84 లక్షల గన్నీ బ్యాగులు సర్దుబాటు చేయనున్నట్లు తెలిపింది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి, ఖమ్మం, కుమురం భీం ఆసిఫాబాద్, మహబూబ్‌నగర్, నిర్మల్ జిల్లాల్లో హమాలీల కొరత, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో రవాణా సమస్యలతో కొనుగోళ్లు నిదానంగా సాగుతున్నాయని తెలిపింది.

# 5 వేల కోట్లివ్వండి

>> కేంద్ర ఆర్థిక మంత్రికి వివరించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాలకు సంబంధించి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ సహా విద్యా రంగంలో చేపడుతున్న భారీ పెట్టుబడులకు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అఫైర్స్ (డిఇఎ) ఆమోదించిన విదేశీ ద్రవ్య సహకార (ఈఏపీ) ప్రాజెక్టులకు ఫిజికల్ రెస్పాన్సిబిలిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఆర్‌బిఎం) పరిమితుల నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2025-26 ఆర్థికంలో తెలంగాణకు ఇప్పటికే రూ.4,208 కోట్లు మంజూరైన విషయాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు అవసరమని వివరించారు. తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, 2014 నుంచి 2023 మధ్య ప్రత్యేక ప్రయోజన సంస్థల ద్వారా చేపట్టిన అప్పుల భారం, వాటి చెల్లింపుల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందన్నారు. అయినప్పటికీ విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో పెట్టుబడులు కొనసాగిస్తోందని వివరించారు. ప్రత్యేకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాల ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా కొత్త మెడికల్ కళాశాలలు, గ్రామీణ ఆరోగ్య సేవల విస్తరణ, విద్యా మౌలిక వసతుల బలోపేతం వంటి కార్యక్రమాలు సామాజిక సమానత్వంతో కూడిన సుస్థిర అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. అదేవిధంగా, విద్యా రంగంలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న భారీ పెట్టుబడులకు సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రికి మరో వినతిపత్రం సమర్పించారు. ఈ క్రమంలో ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ సహకారంతో రూ.4,049.11 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రాజెక్ట్, ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ సహకారంతో రూ.4,903.44 కోట్ల వ్యయంతో తెలంగాణ ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అప్‌గ్రేడేషన్ మిషన్ ప్రాజెక్టులకు ఆమోదం లభించిందన్నారు. వికసిత భారత్-2047 లక్ష్య సాధనలో తమ ప్రభుత్వం చేపడుతున్న విద్యా, మౌలిక వసతుల పెట్టుబడులు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన మద్దతు లభిస్తే రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని తెలిపారు. ఈ భేటీలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ డిపార్ట్మెంట్ సెక్రటరీ డాక్టర్ గౌరవ ఉప్పల్ ఉన్నారు.

## వారం - వర్జ్యం

21-05-2026, అధికజ్యేష్ఠ గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
పంచమి ఉ.8.29
పుష్యమి రా.2.51
వర్జ్యం : ఉ.11.46-మ.1.16
దు.ఉ.9.54-ఉ.10.46, మ.3.06-3.58
శుభసమయం: ఉ.6.30-7.30
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** దీర్ఘకాలిక సమస్యలకు తగిన చర్యలు తీసుకుంటారు. ఇందువల్ల కుటుంబంలో విభేదాలు వస్తాయి.

**వృషభం:** నూతన పురోగతి బాగుంటుంది. వాళ్ళకు మంచి అవకాశాలు వస్తాయి. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

**మిథునం:** జీవిత భాగస్వామి, స్త్రీల ఆరోగ్యం గురించి శ్రద్ధ వహించాల్సి ఉంటుంది. విదేశాల నుండి అరుదైన ఆహ్వానాలు.

**కర్కాటకం:** ప్రైవేటు వ్యక్తుల నుండి ఆర్థిక పరమైన ఒత్తిడి రావచ్చు. రాజకీయ యత్నాలు, చర్చలు ఫలిస్తాయి.

**సింహం:** మీరు అమితంగా ప్రేమించే వ్యక్తులు కీలక సమయంలో ఆదుకుంటారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. వస్త్రలాభం.

**కన్య :** అభివృద్ధి పథానికి మరొక మెట్టును మీరు నిర్మించుకోగలుగుతారు. సామాజిక కార్య క్రమాలలో పాల్గొంటారు. వాహన సౌఖ్యం.

**తుల:** ఒకరి జీవితానికి ఆధారం కల్పించి మనశ్శాంతి పొందుతారు. పోటీపరీక్షలలో విజయం వల్ల ఇంట్లో ఆనందం కలుగుతుంది.

**వృశ్చికం:** అమ్మకాలలో తగిన రేటు రాకపోవచ్చు. అయినా లాభాలకు ఇబ్బంది లేదు. కొత్త పరిచయాలు కలుగుతాయి.

**ధనుస్సు:** అనుకోని ఆదాయం వచ్చే మార్గాలు అందుకు సంబంధించిన వ్యక్తులు అనుకూలం అవుతారు. వ్యాపారం అభివృద్ధి.

**మకరం:** ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైలు మీద అధికార ఆమోద ముద్రలు పడ తాయి. ఊహించని ఈ పరిణామం సంతోషం కలిగిస్తాయి.

**కుంభం:** స్థాయి లేని వ్యక్తులకు సారథ్యం చేయాల్సి వస్తుంది. వాళ్ళ సలహాలు సంప్రదింపులు నిత్యం అవసరమవుతాయి.

**మీనం:** విలువైన వస్త్ర సామాగ్రి కొనుగోలు చేస్తారు. రాజకీయ వరంగా జరిగే మార్పులు కొంత ఊరట కలిగిస్తాయి.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# జిల్లాల్లోను జిసిసిలు

>> హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఐటీ విస్తరణ పెద్దగా లేని చోట్ల కూడా డేటా సెంటర్ల ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీ (బీఎఫ్‌సీ)లో ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో పాటు పర్యావరణహిత నెట్‌జీరో విధానాలు అమలు చేయాలని సీఎం ఆదేశించారు. ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఇండస్ట్రియల్ కారిడార్ పనులు వేగవంతం చేయాలని అధికారులను చెప్పారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ లో ప్రకటించిన ఐదు ప్రాంతీయ వైద్య పర్యాటక కేంద్రాల్లో ఒకటి ఫ్యూచర్ సిటీలోని హెల్త్ సిటీలో ఏర్పాటుకై కేంద్రంతో చర్చలు జరపాలని ఆదేశించారు. అవసరమైతే ప్రధాన మంత్రి నరేంద్రమోడీతో మాట్లాడుతానన్నారు. ఫ్యూచర్ సిటీ పారిశ్రామిక వాడలో వివిధ కంపెనీలకు సంబంధించిన ప్రాంగణాల్లో త్వరలో భూమి పూజ చేసేట్లు, అవసరమైన పనులు చేపట్టాలన్నారు. ఫ్యూచర్ సిటీలో స్థాపించే కంపెనీలన్నీ నైపుణ్యాభివృద్ధి కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తో ఒప్పందాలు కుదుర్చుకునేలా చూడాలన్నారురాష్ట్రానికి భారీ పెట్టుబడులు రప్పించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక ఏజెన్సీ ఏర్పాటు చేయాలని సీఎం చెప్పారు. కాగా, ఎనర్జీ, ఫైనాన్స్ వంటి శాఖల అధికారులు ఇన్వెస్ట్ తెలంగాణలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఉండనున్నారు. ఈ ఏజెన్సీని ఏర్పాటు చేయడంలో ఇతర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న ఉత్తమ విధానాలను అవలంభించాలన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులతో వచ్చే కంపెనీలకు సంపూర్ణంగా తోడ్పాటునందిస్తూ సహకరించే విధంగా ఇన్వెస్ట్ తెలంగాణ పని చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మూడు నెలల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు టీ-ఫైబర్ ఇంటర్నెట్ వినియోగంలోకి రావాలని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటికే టీ-ఫైబర్‌కు మారిన ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.54 కోట్ల ఆర్డర్లు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ల్యాండ్ అలాట్మెంట్, పరిశ్రమల ఏర్పాటుపైన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ...నెట్ జీరో సిటీ తరహా లోనే డిజైన్స్ ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు.

మౌలిక వసతుల కల్పన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలి ..ఇందులో రాజీ పడొద్దు అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలి అని చెప్పారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు చేయాలి..అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని సూచించారు. ఫ్యూచర్ సిటీ లో ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్ట్‌లకు 500 ఎకరాలు కేటాయిస్తామన్నారు. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను ఫ్యూచర్ సిటీ వచ్చేలా చర్య లు తీసుకోవాలి.. అవసరం అయితే ప్రధాని మోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామన్నారు. జూన్‌లో ఫ్యూచర్ సిటీ ఇండ్రస్టియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకు స్థాపన జరిగేలా చూడాలని చెప్పారు..భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమలు నిర్మాణం మొదలు పెట్టేలా నిబంధన విధించాలని చెప్పారు.

ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ఆకర్షణీయమైన లోగో, వెబ్ సైట్ రూపొందించాలి, ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలని చెప్పారు. రాష్ట్రం లో పెట్టుబడులు పెట్టే వారికోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థని రూపొందించాలని చెప్పారు. గ్రూప్ 1 స్థాయి అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్ గా నియమించే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు.. తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలి, 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలి..డేటా సిటీ నీటి అవసరాల కోసం ఎస్‌టీపీ లను వినియోగించాలని చెప్పారు.

# మెడికల్ షాపులు బంద్

>> ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఎఐఒసిడి ఇచ్చిన బంద్ పిలుపుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ల మద్దతు తెలపడంతో బుధవారం తెల్లవారుజాము నుంచే ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లో మెడికల్ షాపులు బంద్ కొనసాగింది. మెడికల్ షాపుల 24 గంటల సమ్మెకు దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 12.40 లక్షలకు పైగా ఫార్మసిస్ట్, డ్రగ్ డిస్ట్రిబ్యూటర్లు మద్దతు ప్రకటించారు. ఫలితంగా ఎపి, తెలంగాణతోపాటు దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న 12.40 లక్షలకు పైగా మెడికల్ దుకాణాలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, రిటైల్ మందుల దుకాణాలు మూతపడ్డాయి. తెలంగాణలో ఉన్న 30 వేలకు పైగా మెడికల్ ఫార్మసీలు ఈ బంద్‌లో పాల్గొన్నాయి. ఒక్క హైదరాబాద్‌లోనే 16 వేలకుపైగా మెడికల్ షాప్‌లు బంద్ పాటించాయి. ఇక ఎపిలో రాష్ట్ర వ్యాప్తంగా 45వేల మెడికల్ షాపులు బంద్ పాటించాయి. బంద్ కారణంగా బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు మెడికలన షాపులు మూతపడ్డాయి.

కరోనా మహమ్మారి సమయంలో మందుల హోమ్ డెలివరీ కోసం కేంద్రం తాత్కాలికంగా తీసుకువచ్చిన జిఎస్ఆర్ 220(ఇ), జిఎస్ఆర్ 817(ఇ) మినహాయింపు నోటిఫికేషన్లను ఇప్పటికీ కొనసాగించడంపై ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నోటిఫికేషన్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మందుల మార్జిన్లు ఫిక్స్ అయినప్పటికీ కార్పొరేట్ ఈ- ఫార్మసీలు 20శాతం నుండి 50శాతం వరకు భారీ డిస్కౌంట్లు ఇస్తూ ప్రిడేటరీ ప్రైసింగ్‌తో చిన్న వ్యాపారుల పొట్టకొడుతున్నాయని మండిపడ్డారు. ఎలాంటి పర్యవేక్షణ లేకుండా ఆన్‌లైన్ ఫార్మసీలు మెడిసిన్ విక్రయిస్తుండటం వల్ల నకిలీ మందుల అమ్మకాలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు.

మెడికల్ షాపుల బంద్ నేపథ్యంలో రోగులు, వృద్ధులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డిసిఎ) తో పాటు వివిధ రాష్ట్రాల అధికార యంత్రాంగాలు ముందస్తు ప్రజా సూచనలు జారీ చేయడంతో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు అనుబంధంగా ఉండే మెడికల్ షాపులు, అలాగే ప్రభుత్వ ఖిజన ఔషధి కేంద్రాలుఖి, అమృత్ ఫార్మసీలు యథావిధిగా తెరిచి ఉంచారు. అపోలో, మెడ్‌ప్లస్ వంటి పెద్ద కార్పొరేట్ ఫార్మసీలు తమ స్టోర్లను తెరిచి ఉంచాయి. తెలంగాణలో అత్యవసర ఔషధాల లభ్యత, ఫిర్యాదుల కోసం డీసీఏ ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 6969ను అందుబాటులో ఉంచింది.

అయితే మెడికల్ షాపులు మూతపడటంతో తెలుగు రాష్ట్రాల్లోని రోగులు అత్యవసర మందుల కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిన్న, పెద్ద పట్టణాల్లో సాధారణ రోగులు మందులు దొరక్క అల్లాడిపోయారు. రోజువారి మందుల కోసం (బీపీ, షుగర్ తదితర) ప్రజలు ఒక షాపు మూతపడడంతో మరోషాపుకు తిరగడం, అక్కడ కూడా బంద్ కావడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వచ్చింది. అత్యవసర చికిత్సలు, ఆపరేషన్లు , ఇతర అత్యవసర సమయాల్లో మందులు దొరక్క రోగుల కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మెడికల్ దుకాణాలు మూతపడడంతో ఆరోగ్య సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

**ఆన్‌లైన్ ఫార్మసి ఔషద విక్రయానలు నిలిపివేయాల్సిందే...**

ఆన్‌లైన్ ఫార్మసీల ద్వారా జరుగుతున్న అనియంత్రిత ఔషధాల విక్రయాలను నిలిపివేయాలి. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నిర్వహించిన మెడికల్ షాపుల బంద్ విజయవంతంగా ముగిసింది. కొవిడ్ సమయంలో తీసుకొచ్చిన తాత్కాలిక నోటిఫికేషన్‌ను ఆసరాగా చేసుకొని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి. వెంటనే ఆ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవడంతోపాటు ఈఫార్మసీలకు సంబంధించిన జిఎస్ఆర్ 817(ఇ) ను కూడా రద్దు చేయాలి. ఇది కేవలం మెడికల్ షాపుల వ్యాపారుల సమస్య మాత్రమే కాకుండా ప్రజారోగ్య భద్రతకు సంబంధించిన అంశం. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఆన్‌లైన్ ఫార్మసీలపై తగిన నియంత్రణలు తీసుకువస్తుందని ఆశిస్తున్నాం. బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించిన ప్రతి ఒక్క మెడికల్ షాప్ యాజమాన్యానికి, కెమిస్ట్‌లకు ప్రజలకు కృతజ్ఞతలు.



సాయుధ మిలిటెంట్లు అపహరించారని అనుమానిస్తున్న ఆరుగురు నాగా పౌరులను సురక్షితంగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మణిపూర్‌లోని ఇంఫాల్ వెస్ట్ జిల్లాలో నిరసన ప్రదర్శన జరిపిన మహిళలు

# ప్రధాని మోడీకి ఇటలీలో అరుదైన గౌరవం

>> జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ క్యూ డాంగ్యూ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని ప్రధాని మోడీకి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ క్యూ డాంగ్యూ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం మోడీ చేసిన కృషికి గుర్తింపుగానే ఈ అవార్డును అందిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, ఆహార భద్రత బలోపేతం, రైతుల సంక్షేమం కోసం మోడీ ప్రభుత్వం అమలు చేసిన పలు పథకాలను ప్రశంసించారు. అలాగే ఆకలి, పేదరిక నిర్మూలన, ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రత సాధనలో ఎఫ్ఎవో లక్ష్యాలకు భారత్ అందిస్తున్న మద్దతును కొనియాడారు. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో మోడీ చేస్తున్న కృషిని కూడా ఎఫ్‌యేవో డీజీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ముఖ్యంగా భారత జీ20 అధ్యక్షత్వ కాలంలో వ్యవసాయాన్ని అంతర్జాతీయ అజెండాలో కీలక అంశంగా నిలిపిన విధానాన్ని అభినందించారు. భారత వ్యవసాయ రంగంలో రైతు కేంద్రిత సంస్కరణలు, వినూత్న విధానాలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం ద్వారా మోడీ చూపిన నాయకత్వాన్ని నీతివీ ప్రశంసించింది. మోడీ నాయకత్వంలో అమలైన భారీ ఆహార భద్రత పథకాలు, కోట్లాది రైతులకు నేరుగా ఆర్థిక సాయం అందించడం, సహజ వ్యవసాయం ప్రోత్సాహం, చిరుధాన్యాల ప్రాచుర్యం వంటి కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచాయని పేర్కొంది.

అగ్రికోలా పతకం అందుకున్న తర్వాత మోడీ మాట్లాడుతూ మా అద్భుతమైన స్వాగతానికి, నాకు అగ్రికోలా పతకంతో గౌరవించినందుకు ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్‌యేవో) డైరెక్టర్‌కు నేను హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. భారతదేశం పట్ల ఆయన స్నేహపూర్వక మాటలకు, నీతివీకు ఆయన చేసిన సంవత్సరాల సేవలకు నేను ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఇది కేవలం నాకు మాత్రమే కాకుండా భారతదేశంలోని కోట్లాది మంది రైతులకు, పశుపోషకులకు, మత్స్య పెంపకందారులకు, వ్యవసాయ శాస్త్రవేత్తలకు, మన కార్మికులకు లభించిన గౌరవం. మానవ సంక్షేమం, ఆహార భద్రత, సుస్థిర అభివృద్ధిని కేంద్రంగా చేసుకున్న భారతదేశ నిబద్ధతకు కూడా ఇది ఒక గౌరవం. నేను ఈ పతకాన్ని అత్యంత వినయంతో స్వీకరిస్తూ.. భారతదేశ అన్నదాతకు అంకితం చేస్తున్నానని మోడీ తెలిపారు.

## గ్లోబల్ టెక్ - ట్రావెల్ క్లస్టర్‌గా హైదరాబాద్ అభివృద్ధి

>> చేసేందుకు ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్ ను సిద్ధం చేస్తున్నామన్నారు. తాజాగా ప్రారంభమైన ఈ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ సౌత్ వెస్ట్ ఎయిర్ లైన్స్‌కు ఒక స్ట్రాటెజిక్ హాబ్‌గా పని చేయనుంది. కంపెనీ గ్లోబల్ నెట్ వర్క్, సపోర్టింగ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఎంటర్ ప్రైజ్ కేపబిలిటీస్ తదితర అంశాల్లో కీలక సేవలు అందించనుంది. డీప్ టెక్, ఏఐ/ఎంఎల్, డేటా సైన్స్, డేటా అనలిటిక్స్, డిజిటల్ ఇంజినీరింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్ ప్రైజ్ ప్లాట్ ఫామ్స్ తదితర విభాగాల్లో నిపుణులైన వేయి మందికి ఇక్కడ కొత్తగా ఉపాధి లభించనుంది. విమానయాన రంగంలో హైదరాబాద్ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం కానుందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో సౌత్ వెస్ట్ ఎయిర్ లైన్స్ వైస్ ప్రెసిడెంట్ అండ్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ లారెన్ వుడ్స్, వైస్ ప్రెసిడెంట్ అండ్‌గ్లోబల్ హెడ్ ఆఫ్ ఇన్నోవేషన్, ఇండియా కృష్ణకల్లెపల్లి, ఐటీఅడ్వైజర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

## 'సరస్వతి' అంత్యపుష్కరాలు

>> జరిగిన సరస్వతీ ఆది పుష్కరాల సందర్భంగా జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ అంత్య పుష్కరాలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలను చేపట్టింది. ప్రస్తుత వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పుష్కర ఘాట్ వద్ద కాయర్ మ్యాట్లు, చలువ పందిళ్లు, ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పుష్కర ఘాట్ పరిసరాల్లోని 23 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్, బీ.టి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఈ పుష్కరాల పనుల కోసం ప్రభుత్వం రూ.30.63 కోట్ల నిధులను కేటాయించింది. కంచి స్వామి విజయేంద్ర సరస్వతీ, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా లచే తొలి పుష్కర స్నానం పుష్కరాల తొలిరోజైన 21 వ తేదీ తెల్లవారు జామున 5.43 గంటలకు కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాలు పుష్కర స్నానం చేసి అంత్య పుష్కరాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. 21 వ తేదీ నుండి జూన్ 1 వతేదీ వరకు ప్రతీ రోజూ ఒక ప్రముఖ పీఠం స్వామిజీ ఈ పుష్కారాల్లో పాల్గొని పుణ్య స్నానం చేస్తారు. ప్రతీరోజూ ఉదయం హోమాల నిర్వహణ, సాయంత్రం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పుష్కర స్నానాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం 90 షటిల్ బస్సులను ఏర్పాటు చేశారు. రెస్క్యూ బృందాలతోపాటు ప్రత్యేక శిక్షణ పొందిన 100 మంది గజ ఈతగాళ్లను సరస్వతీ ఘాట్, నదీ ప్రాంతంలో నియమించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.1.20కోట్లలతో ప్రత్యేకంగా మ్యూజియాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి నాగేంద్ర స్వామి ఆలయాన్ని 30 లక్షలతో పునర్నిర్మాణం చేశారు. పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ నిర్వహించే హారతి, హోమాలు, తెప్పోత్సవం లకు పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేపట్టారు. పుష్కరాలకు హాజరయ్యే వారి సౌకర్యార్థం పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పించారు. దాదాపు 500 టాయిలెట్లు ప్రత్యేకగా ఏర్పాటు చేయడంతోపాటు తాగునీటి కోసం రెండు ఓ.హెచ్.ఆర్.సి లను నిర్మించారు. వాహనాల కోసం ఏర్పాటు చేసిన 23 పార్కింగ్ కేంద్రాలలోనూ తాగునీటి సౌకర్యంతో పాటు టాయిలెట్లను కూడా ఏర్పాటు చేశారు. కాళేశ్వరం పుష్కర ఘాట్ లోని 23 జోన్లలో ప్రత్యేక మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ఇందుకుగాను 300 మంది వైద్యాధికారులు, పారా మెడికల సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. అన్ని ప్రధాన ప్రాంతాల్లో అంబులెన్సులు నియమించారు. మహాదేవ పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రెఫరల్ ఆసుపత్రిగా ఏర్పాటు చేశారు.

# ఎండ మంటలు

>> రెడ్‌అలర్ట్ జారీ చేసింది. నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో భారీగా ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయని తెలిపింది. వడగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే గరిష్టంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం నిర్మల్ జిల్లాలో 46.5 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కాగా.. హనుమకొండ, కరింనగర్, పెద్దపల్లిలో 46.4 డిగ్రీలు, జగిత్యాల, జనగామ, ఖమ్మం, కుమరంభీం ఆసీఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్‌లో 46.3డిగ్రీల మేంఆదిలాబాద్, భద్రాద్రి , మహబూబాబాద్, సిద్ధిపేట, సూర్యాపేటలో 46.2డిగ్రీలు, ములుగు, రాజన్నసిరిసిల్ల, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో 46 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తీవ్రమైన వేడిగాలుల నుంచి తట్టుకునేందుకు ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతున్నారు. ఎండల తీవ్రతకు ఏసీలు, కూలర్లు పనిచేయడం లేదు. దీంతో ఇండ్లు, వ్యాపార సముదాయాల ముందు పచ్చని పరదాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మరోవైపు చిరు వ్యాపారులు తమ బైక్ లను కాపాడుకునేందుకు గోనె సంచులు, బెడ్ షీట్లు కప్పుతున్నారు. చికెన్ వ్యాపారులు గంటకోసారి బాయిలర్ కోళ్లకు నీళ్ల చల్లుతూ ఎండ నుంచి ఉపశమనం కలిగిస్తున్నారు. కాగా వడదెబ్బతో హుజురాబాద్ పట్టణంలో ఓ దివ్యాంగుడు మృతి చెందాడు. గాజర్ల వెంకటయ్య, సుగుణమ్మ దంపతుల కుమారుడైన సతీష్ (దివ్యాంగుడు) వడదెబ్బకు గురై ప్రాణాలు విడిచాడు. తెలంగాణలో రోజురోజుకూ ముదురుతున్న ఎండల తీవ్రత, వడగాడ్పులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రజలను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్న వాతావరణ శాఖ (ఐఎండి) హెచ్చరికల నేపథ్యంలో సీఎం స్పందించారు. ఆయా జిల్లాల్లో మారుతున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, జిల్లా కలెక్టర్లకు తగిన దిశానిర్దేశం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకి ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ ఎండల తీవ్రతను తట్టుకునేందుకు వీలుగా ప్రజల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి జిల్లా ఆసుపత్రుల వరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను భారీగా అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. వేసవి దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలు జిల్లా ఆసుపత్రుల వరకు వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. వడదెబ్బతో ఎవరైనా ఆసుపత్రుల్లో చేరితే బాధితులకు తక్షణమే మెరుగైన వైద్యం అందించేలా సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. తీవ్రమైన ఎండల కారణంగా ప్రజలు సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు చేయకుండా సురక్షితంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఎసిబికి చిక్కిన జలమండలి జిఎంకు రిమాండు

# చంచల్‌గూడ జైలుకు తరలింపు

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో ఎసిబికి పట్టుబడ్డ వాటర్ వర్క్స్ బోర్డు ప్రాజెక్టు విభాగం ఇంజినీరింగ్ జనరల్ మేనేజర్ సగ్గం అనంత లక్ష్మీకుమార్ (58)ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. మంగళవారం అనంత లక్ష్మీ కుమార్‌ను ఎసిబి అధికారులు అరెస్టు చేయడం తెలిసిందే. ఆయన ఇంట్లో భారీగా నగదు, బంగారు, వెండి నగలతో పాటు స్థిర, చరాస్తులు లభ్యమవడం విదితమే. వీటి విలువ వందకోట్ల వరకు వుంటుందని అధికారులు చెబుతున్నారు.కాగా అనంత లక్ష్మీ కుమార్‌ను ఎసిబి అధికారులు బుధవారం ఉదయం నాంపల్లి ఎసిబి కోర్టుల న్యాయమూర్తి ఇంట్లో హాజరుపరచగా ఈ కేసును విచారించిన మెజిస్ట్రేట్ నిందితుడికి రెండు వారాల రిమాండు విధించారు. అనంతరం ఎనిమిది గంటల సమయంలో ఎసిబి అధికారులు చంచల్ గూడ జైలుకు తరలించారు.

# కులగణనపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం: మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** కులగణన నిర్వహణకు సుప్రీంకోరు పచ్చ జెండా ఊపడంపై రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి హర్షం వ్యక్తం చేశారు. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సామాజిక న్యాయానికి కొండంత అండ అని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు కులగణన అవసరమని సుప్రీంకోర్టు పేర్కొనడం ఎంతోకీలకమని పేర్కొన్నారు. ఈ విషయమై బుధ వారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వెనుకబడిన వర్గాల అసలు జనాభా, వారి ఆర్థిక-సామాజిక పరిస్థితులు తెలిసినప్పుడే ప్రభుత్వాలు సరైన విధానాలు రూపొందిం చగలవని తెలిపారు. సమాజంలోని బలహీన వర్గాలకు న్యాయం చేయా లంటే కచ్చితమైన గణాంకాలు అవసరమని, అదే లక్ష్యంతో కులగణనచేపట్టాలని దేశవ్యాప్తంగా డిమాండ్ వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పు వెనుకబడిన వర్గాల ప్రజల్లో నూతన ఆశలు కలిగించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తోందని, సమాజంలోని ప్రతీ వర్గానికి న్యాయం జరిగేలా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమకార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు.

# ఎసిబి వలలో మహిళా ఎస్సై నందిత

రూ.30వేలు లంచం తీసుకొంటూ చిక్కిన వైనం



ఎసిబికి చిక్కిన ఎస్ఐ నందిత

**కంటోన్మెంట్, మే 20 ప్రభాత వార్త:** సికింద్రాబాద్ బోయి నపల్లి పోలీస్ స్టేషన్లో లంచం తీసుకుంటూ ఓ మహిళ ఎస్సై ఏసీబీ అధికారుల కు పట్టుబడింది. ఓ బాదితుడిని కేసు విషయంలో లంచం ఇస్తేనే, స్టేషన్లో ఉన్నతాధికా రులకు కూడా నచ్చ చెబుతా నంటూ, డబ్బులు డిమాండ్ చేసింది. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు నేరుగా ఏసీబీ అధికారు లకు ఫిర్యాదు చేశాడు. లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు మహిళా ఎస్సై నందితను పట్టుకు న్నారు. సీఐతో పాటు మరికొంత మంది సిబ్బందిని విచారించిన ఏసీబీ అధికారులు, వారి ప్రమేయం లేదని తెలియడంతో నందిత క్యాబిన్‌తో పాటు ఇతర పత్రాలను తనిఖీ చేస్తున్నారు. ప్రేమ వివాహం చేసుకున్న బాధితుడు, ప్రేమించిన అమ్మాయితో ఉండడానికి పోలీసులు ఆశ్రయించగా. అబ్బాయి తల్లి దండ్రులు ఒప్పుకోవడం లేదంటూ ఎస్ఐ నందిత, అబ్బాయిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించింది. టేబుల్ పైన డబ్బులు పెడితేనే కేసులు పరిష్కరిస్తా నంటూ బాధితుడు అభిషేక్‌ను బెదిరించింది. డబ్బులు ఇవ్వనంటూ అభిషేక్ వెళ్లిపోవడంతో. అబ్బాయికి అమ్మాయికి మధ్య గొడవ పెట్టించి, అమ్మాయిని కొట్టాడంటూ అభిషేకంపై కేసు నమోదు చేసి జైలుకు పంపించింది. జైలు నుంచి వచ్చిన తర్వాత కూడా డబ్బులు ఇవ్వా లంటూ పిలిచి బెదిరించడంతో. వెంటనే ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడు అభిషేక్ రూ. 30 వేల రూపాయలు లంచంగా ఇస్తుండగా, ఎస్సై నందితను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. చేతులకు టెస్ట్ చేయగా పాజి టివ్ రావడంతో అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## రూ.23.05కోట్ల హైడ్రోపోనిక్ గంజాయి స్వాధీనం



**రంగారెడ్డి అర్బన్, మే 20,ప్రభాతవార్త:** శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు భారీగా హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ఇద్దరు భారతీయ ప్రయాణికులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి కోట్ల విలువైన మత్తు పదార్థాన్ని స్వాధీనం పట్టుకున్నారు. పక్కా సమాచారంతో డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు విమానాశ్రయంలో బ్యాంకాక్ నుంచి వచ్చిన ఇద్దరు భారతీయ ప్రయాణికులను అడ్డుకొని తనిఖీచేయగా, 24నల్లటి ప్యాకెట్లలో ఆకుపచ్చని గడ్డలు గడ్డలుగా ఉన్న పదార్థాన్ని గుర్తించారు. ఈ ప్యాకెట్లను ఇన్సులేటెడ్ వాటర్ బాటిళ్లు, పొటాటో స్నాక్‌టిన్‌లు, ఫుడ్‌టిన్ బాక్సులు, ప్లాస్టిక్ మరియు కార్డ్‌బోర్డ్ బాక్సులలో అత్యంత చాక చక్యంగా దాచిపెట్టినట్లు అధికారులు తెలిపారు.స్వాధీనం చేసుకున్న పదార్థం మొత్తం 8.705 కిలోల బరువు ఉండగా, నార్కోటిక్ డ్రగ్ డిటెక్షన్ కిట్ ద్వారా పరీక్షించగా అది హైడ్రో పోనిక్ గంజాయి అని నిర్ధా రణ అయింది. అంతర్జాతీయ అక్రమ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ. 23.05 కోట్లుగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు.ఈ కేసులో ఇద్దరు ప్రయాణికులను అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఆవును 'జాతీయ జంతువు'గా ప్రకటించాలి



దాంతోనే విద్వేష రాజకీయాలకు ముగింపు

జమియత్ అధినేత అర్షద్ మదాని డిమాండ్

**న్యూఢిల్లీ, మే 20:** ఆవును 'జాతీయ జంతువు'గా ప్రకటిస్తే అది ఎంతో సంతోషించదగ్గ విషయమని జమియత్ ఉలేమాఎహింద్ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ అర్షద్ మదానీ డిమాండ్ చేశారు. ఈ పవిత్ర జంతువు చుట్టూ తిరుగుతున్న విభజన రాజకీయాలే మైనారిటీ వర్గంపై ద్వేషపూరిత వ్యాఖ్యలు, దాడులు జరగడానికి "మూల కారణం" అని ఆయన పేర్కొన్నారు. "ద్వేష రాజకీయాలు", ఆవు రక్షణ పేరుతో ఏర్పడిన మూకల చేతిలో ముస్లింలపై పెరుగుతున్న మూక దాడుల పట్ల మదానీ ఆందోళన వ్యక్తం చేశారు. పవిత్రమైన ఆవును "జాతీయ జంతువు"గా ప్రకటించడం ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు "శ్రీ"లో పోస్టు చేశారు. ఆవును జాతీయ జంతువుగా ప్రకటించడానికి ప్రభుత్వాన్ని ఏది అడ్డుకుంటోందని ప్రశ్నించారు. మెజారిటీ వర్గం ఆవును కేవలం పవిత్రంగానే కాకుండా తమ తల్లిగా కూడా భావిస్తుందని ఆయన పేర్కొన్నారు. 'ఆవు పేరుతో జరిగే మూకదాడులు, అమాయక ప్రజల హత్యలు, ద్వేష రాజకీయాలు, ముస్లింలను అప్రతిష్టపాలు చేసే ఈ కుట్రపూరిత ఆట ఇకనైనా ముగియాలి' అని ఆయన డిమాండ్ చేశారు. మతం పేరుతో జరిగే రాజకీయాల వల్ల ఏ ఒక్క మానవ ప్రాణమూ బలికాకూడదని ఆయన అన్నారు. మతపరమైన విభజనలు, ద్వేష రాజకీయాలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన గట్టిగా కోరారు. ఆవుకు "జాతీయ జంతువు" హోదా కల్పించాలని ఆయన సూచించారు. తద్వారా ఈ సమస్యలన్నింటికీ ఒక్కసారే, శాశ్వతంగా ముగింపు లభిస్తుందని ఆయన తన వాదనను వినిపించారు. "ఈ ఉద్దేశంతో ఏ చట్టం రూపొందించబడినా, అది దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ ఎటువంటి వివక్ష లేకుండా ఏకరీతిగా అమలు చేయబడాలి" అని మదానీ డిమాండ్ చేశారు.

భారత్-యూరప్ నైపుణ్య భాగస్వామ్యంతో

# టామ్‌కామ్ బలోపేతం

## తెలంగాణ యువతకు నైపుణ్య శిక్షణ సిద్ధం: మంత్రి వివేక్ వెంకటస్వామి




బుధవారం జరిగిన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్, మే 20 ప్రభాతవార్త: తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు. టామ్‌కామ్‌ను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఇందుకోసం బడ్జెట్‌లో రూ.90 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.బుధవారం హైదరాబాద్‌లో విదేశాంగ మంత్రిత్వ శాఖ, యూరోపియన్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇండియా- ఈయూ మైగ్రేషన్ అండ్ మొబిలిటీ ప్రాజెక్ట్ ఫేజ్-2లో భాగంగా టామ్‌కామ్ సహకారంతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ప్రభుత్వం యువతను గ్లోబల్ కెరీర్లకు సిద్ధం చేసే దిశగా చర్యలు ప్రారంభించిందన్నారు. టామ్‌కామ్ యువతకు విదేశీ ఉపాధి అవకాశాలపై మార్గనిర్దేశం చేయడంలో, శిక్షణ అందించడంలో కీలక సంస్థగా ఎదిగిందని మంత్రి వివరించారు. టామ్‌కామ్ ద్వారా శిక్షణ పొందిన పలువురు యువత ఇప్పటికే విదేశాల్లో విజయవంతంగా ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా జర్మన్ భాష సహా విదేశీ భాషల్లో శిక్షణ పొందిన వారికి యూరప్ దేశాల్లో భారీ డిమాండ్ ఉందన్నారు.అక్రమ మార్గాల ద్వారా విదేశాలకు వెళ్లడం వల్ల కలిగే ప్రమాదాలపై కూడా ప్రభుత్వం యువతలో అవగాహన కల్పిస్తోందని, సురక్షితమైన, చట్టబద్ధమైన మార్గాల ద్వారా మాత్రమే విదేశీ ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ ఉద్యోగ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా, రాష్ట్రవ్యాప్తంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ కేంద్రాల ద్వారా పరిశ్రమలకు అనుగుణమైన, అంతర్జాతీయ ప్రమాణాల శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో సంప్ర దాయ ఉద్యోగ విధానాలు మారుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకున్న యువతకు అంతర్జాతీయ అవకాశాలు మరింత విస్తరించనున్నాయని తెలిపారు.

ఈ వర్క్‌షాప్ ద్వారా తెలంగాణ యువతకు యూరప్ దేశాల్లో ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకా శాలపై అవగాహన పెరుగుతోందని మంత్రి అన్నారు. గ్లోబల్ ఎడ్యుకేషన్, ఇంటర్నేషనల్ స్కిల్ మొబిలిటీకి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇటీవల జర్మనీ పర్యటన సందర్భంగా ఆరోగ్య, తయారీ, సాంకేతిక, సేవా రంగాల్లో నైపుణ్యవంతులైన మానవ వనరులకు భారీ డిమాండ్ ఉన్నట్లు ప్రత్యక్షంగా గమనించామని మంత్రి తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా భాషా శిక్షణపై పైలట్ ప్రాజెక్టులు అమలు చేస్తూ యువతకు సురక్షితమైన, వృత్తిపరంగా మార్గనిర్దేశం చేసిన విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో విదేశాంగ మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరీ ఆదర్శ్ కుమార్ మెహ్రా, ఎల్ఈటీఎఫ్ కార్యదర్శి దాసరి హరిచందన, ఉపాధి మరియు శిక్షణ విభాగం డైరెక్టర్ కాంతి వెస్లీ , రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి జే. స్నేహజ , ఐసీడబ్ల్యూఏ జాయింట్ సెక్రటరీ అభిజిత్ చక్రబోర్తి తదితరులు హాజరయ్యారు.

ఉపాధి హామీలో కఠిన నిబంధనలు

# పనులకు వెళ్లడం దండగంటున్న కూలీలు

**ఆరేళ్లలో ఏడు లక్షల జాబ్‌కార్డులు రద్దు**

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:**ఉపాధి హామీ పథకం ఉద్దేశ్యం, లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం మార్చి కొత్త నిబంధనలను తీసుకురావడంతో లక్షలాది మంది జాబ్ కార్డులు రద్దవుతున్నాయి. ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో జాబ్ కార్డులు, లక్షల సంఖ్యలో కుటుంబసభ్యులను పేర్లను అధికారులు జాబితా నుంచి తీసివేస్తున్నారు. పథకం అమలులో కఠిన నిబంధనలు, తక్కువ వేతనాలు, పనులకు వెళ్లినా గిట్టుబాటు కాక పోవడం, గ్రామాలు పట్టణాలుగా మారుతుండడంతో ఆరేళ్ల (2019-20 నుంచి 2024-25) వ్యవధిలో తెలంగాణలో ఏకంగా ఏడు లక్షలకు పైగా జాబ్ కార్డులతోపాటు 22.28 లక్షల మంది కూలీల పేర్లను జాబితా నుంచి గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తొలగించడం గమనార్హం. 2022-23 ఆర్థిక సంవత్సరంలోనే ఏకంగా 5.10 లక్షల కార్డులను తొలగించారు. గతంలో ఎన్నడూ కూడా ఇంత పెద్ద సంఖ్యలో కార్డులను తొలగించలేదని గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు చెబుతున్నారు.

రాష్ట్రంలో ప్రస్తుతం 52.22 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 1.07కోట్ల మంది సభ్యులుగా నమోదై ఉన్నారు. అయితే 30.59 లక్షల జాబ్ కార్డుదారుల్లోని 49.99 లక్షల మంది సభ్యులు మాత్రమే పనులకు వెళుతున్నారని గ్రామీణాభివృద్ధిశాఖ ప్రక టించింది. ఆసక్తి లేక కొందరు, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కఠిన నిబంధనలు, షరతుల తోపాటు తక్కువ వేతనాలు వస్తుండడంతో ఉపాధి హామీ పనుల కంటే వేరే పనులకు వెళ్లడం లాభమనే ఉద్దేశంతో చాలా మంది జాబ్ కార్డులను ఉపయోగించడం లేదని అధికారులు గుర్తించారు. ముఖ్యంగా ఉదయంఒకసారి, మధ్యాహ్నా భోజ నం తర్వాత మరోసారి పని ప్రదేశంలో కచ్చితంగా ఫొటో తీయాలనే నిబంధన ఉపాధి పనులకు కూలీలనుదూరం చేస్తున్నదనే విమర్శలు ఉన్నాయి.

అదే సమయంలో బయట పెరుగుతున్న కూలీ రేట్లకు అనుగుణంగా ఉపాధి హామీలో కూలీ రేట్లు పెరగకపోవడం మరో కారణంగా తెలుస్తోంది.వీటికితోడు గ్రామాలనుంచి పట్టణాలకు వలసలు, కూలీలు చనిపోవడం, గ్రామాలు పట్టణాలుగా మారడం,సమీప మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం కావడం వల్ల కూడా జాబ్ కార్డుల సంఖ్యతగ్గుతూ వస్తోందని అధికారులు విశ్లేషిస్తున్నారు. ఫలితంగా ఉపాధిహామీ పథకం లక్ష్యం క్రమక్రమంగా నీరుగారుతోంది.

ఘోస్ట్ సిం కార్డుల నెట్‌వర్క్‌పై సైబర్ క్రైం పోలీసుల ఆపరేషన ఆక్టోపస్ 3

# 13 రాష్ట్రాలలో దాడులు, 66 మంది నేరగాళ్ల అరెస్టు




మీడియాతో మాట్లాడుతున్న కొత్వాల్ సజ్జనార్

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల ఏరివేతకు వరుసగా ప్రత్యేక దాడులు చేస్తున్న సిటీ సైబర్ క్రైం పోలీసులు తాజాగా ఘోస్ట్ సిం కార్డుల నెట్‌వర్క్‌పై ఆపరేషన్ ఆక్టోపస్ 3 నిర్వహించింది. ఇప్పటి వరకు సైబర్ నేరగాళ్లు, మ్యూల్ ఖాతాదారులను పట్టుకున్న సైబర్ క్రైం పోలీసులు తాజాగా దేశ వ్యాప్తంగా వారం రోజుల పాటు 13 రాష్ట్రాలలో దాడులు నిర్వహించి కేవలం అక్రమ సిం కార్డుల నెట్‌వర్క్ నిర్వహిస్తున్న నేరగాళ్ల భరతం పట్టారు.

సిటీ కొత్వాల్ సజ్జన్నర్ ఆదేశాల మేరకు సైబర్ క్రైం డిసిపి అరవింద బాబు ఆయన బృందం ఈ దాడులు నిర్వ హించాయి. జంట నగరాలలో ఇటీవల పట్టుబడ్డ సైబర్ నేరగాళ్ల వద్ద లభ్యమైన 1194 ఘోస్ట్ సిం కార్డుల నేపథ్యంలో వీరికి ఈ సిం కార్డు లు ఎలా వచ్చాయి ? ఎవరు ఇచ్చారు? వీరి వెనుక వున్న వారు ఎవరు ? అనే దానిని ఛేదించేందుకు జరిగిన దాడుల్లో 18 ప్రత్యేక బృందాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మొత్తం 66 మంది నేరగాళ్లను అరెస్టు చేశారు. వీరంతా ఘోస్ట్ సిం కార్డుల నెట్‌వర్క్‌లో వున్నవారుగా తేలింది. వీరి వద్ద 544 సిం కార్డులు లభ్యమవగా ఇందులో 432 సీల్డ్ కవర్లోనూ, 112 ఓపెన్ గా వున్నాయి. అరెస్టయిన వారిలో 44 మంది ఘోస్ట్ సిం కార్డుల వినియోగదారులు 20 మంది వీటిని అమ్మే వ్యాపారులు, ఇద్దరు సరఫరా దారులు వున్నారు. వీరం తా దేశ వ్యాప్తంగా వెలుగు చూసిన 76 సైబర్ నేరాలలో నిందితులుగా వున్నారు.

ఈ నేరాల ద్వారా సామాన్యులు పోగొట్టు కున్న నగదు 101.87 కోట్ల రూపాయలుగా తేలింది. అరెస్టయిన వారిలో వోడాఫోన్ ఐడియా కంపెనీకి చెందిన వారు 10 మంది ఎయిర్‌టెల్‌కు చెందిన వారు ఏడుగురు, జియో కంపెనీకి చెందిన వారు ముగ్గురు వుండగా తెలంగాణ, ఎపి, కర్నాటక, మహారాష్ట్ర యుపి, బెంగాల్, ఢిల్లీ, హరియాణా, గుజరాత్, మధ్య ప్రదేశ్, తమిళనాడు, ఒడిషా, పంజాబ్ రాష్ట్రాల్లో ఈ దాడులు జరిగాయి. సిం కార్డుల కోసం వచ్చే వినియోగదారులకు తెలియకుండానే వారి కెవైసిని వాడి నేరగాళ్లు కొత్త సిం కార్డులను సేకరిస్తున్నట్లు తేలింది.

దీంతో పాటు మారుమూల గ్రామాల్లో క్యాంప్‌లు ఏర్పాటు చేసి అక్కడి అమాయకులను టోకరా వేసి వారికి తెలియకుండా ఒకటికి మించి సిం కార్డులు తీసుకుంటూ వాటిని సైబర్ నేరగాళ్లకు ఈ నేరగాళ్లు విక్రయిస్తున్నట్లు తేలింది.

ఇందులో అనేక సిం కార్డులు విదేశాల్లో వుండే నేరగాళ్లకు చేరినట్లు తేలింది. తాజా ఘటనల నేపథ్యంలో సెల్‌ఫోన్‌ల కంపెనీ అధికారులతో సమావేశం కావాలని కొత్వాల్ సజ్జన్నర్ నిర్ణయించారు. ఈ సమావేశంలో సిం కార్డుల విక్రయాలపై ఆయన మార్గదర్శకాలు జారీ చేయనున్నారు.

సిఎం, మంత్రుల పేర్లతో దందా నిర్వహిస్తున్న నకిలీ పిఎ గుట్టురట్టు

# రియల్టర్లను బెదరించి వసూళ్లు

## కిలాడీ సంతోష్ గుప్తాను అరెస్టు చేసిన పోలీసులు



మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎసిపి శంకర్ రెడ్డి

**మేడ్చల్, మే 20. ప్రభాతవార్త:** రాజకీయ పలుకుబడి ఉందంటూ నమ్మబలుకుతూ వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేస్తూ, సీఎం, మంత్రుల పేర్లు వాడుకుంటూ భారీ వసూళ్లకు పాల్పడుతున్న ఒక కేటుగాడిని సైబరాబాద్ పోలీసులు అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఏసీపీ శంకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా శివంపేటకు చెందిన సంతోష్ గుప్తా అనే వ్యక్తి సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో కొత్త అవతారం ఎత్తాడు. నేను సీఎం రేవంత్ రెడ్డి మనిషికని చెప్పి మేడ్చల్ మండల పరిధి గుండ్లపోచంపల్లి డివిజన్‌లోని మునీరాబాద్ ప్రాంతానికి చెందిన ఆర్ఆర్ రియల్ ఎస్టేట్ వ్యాపారిని సంతోష్ గుప్తా గత కొంతకాలంగా టార్గెట్ చేశాడు. తను సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత ఆప్తుడినని, ఆయన పీఏనని చెప్పి, మీ భూమిపై ప్రభుత్వ స్థాయిలో తీవ్రమైన ఫిర్యాదులు ఉన్నాయని, వెంటనే వచ్చి తననుకలవకపోతే ఇబ్బందులు తప్పవంటూ ఫోన్ చేసి వ్యాపారిపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చాడు. సమస్యను తానే పెద్దమనుషిగా ఉండి పరిష్కరిస్తానని నమ్మబలుకుతూ, అందుకు బదులుగా భారీ మొత్తంలో ఐదు విల్లాలను అమ్మి వచ్చిన డబ్బును ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అతని మాటలు విన్న సదరు రియల్టర్‌కు అనుమానం వచ్చి మంగళవారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని పట్టుకునేందుకు వెంటనే ఒక ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేశారు. సంతోష్ గుప్తా కదలికలపై నిఘా పెట్టి పోలీసులు మధ్య రాత్రి అతడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు.

**విచారణలో షాకింగ్ నిజాలు:** పోలీసుల విచారణలో సంతోష్ గుప్తాకు సంబంధించిన సంచలన విషయాలు బయటపడ్డాయి. తాను సీఎం పీఏనని, పీసీసీ మెంబర్ నని చెప్పు కుంటూ కేవలం ఒకరిద్దరిని మాత్రమే కాకుండా, పలువురు వ్యాపారవేత్తలను,రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన ప్రముకులను ఇతడు టార్గెట్ చేసినట్లు తేలింది. అతను ప్రభుత్వ అధికారు లతో, మంత్రులతో దిగిన ఫోటోలు చూపించి వారితో పరిచయాలు ఉన్నాయంటూ భయపెట్టి పెద్ద ఎత్తున డబ్బుల వసూళ్లకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం సంతోష్ గుప్తాను రిమాండ్‌కు తరలించారు.

# సరస్వతీ అంత్య పుష్కరాలను వైభవంగా జరుపుకోవాలి

## ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం ఎ.రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే20:** సరస్వతీ అంత్య పుష్కరాలను భక్తి శ్రద్దలతో వైభవంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం(మే 21)నుంచి జూన్ 1 వరకు కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. పుష్కరస్నానాలు ఆచరించేందుకు తరలి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. భక్తుల రాకపోకలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చేయాలని చెప్పారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున భక్తులు ఆరోగ్యం కాపాడుకు నేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పుష్కరాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా జరగాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ పుష్కర శుభాకాంక్షలు తెలిపారు.

# బండి భగీరథ్‌పై మరో సెక్షన్ జోడింపు

## సెల్‌ఫోన్‌లో సమాచారం, ఆధారాలు ధ్వంసం చేసినందుకు బిఎన్ఎస్ 238 చేర్చిన వైనం

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి ఫోక్సో కేసులో అరెస్టయి జైల్లో వున్న బండి భగీరథ్ ఉదంతం లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. భగీరథ్‌పై నమోదైన ఫోక్సో కేసును విచారిస్తున్న సిట్ అధికారులు తాజాగా సెల్‌ఫోన్‌లో వుండా ల్సిన సమాచారం, ఆధారాలను ధ్వంసం చేసినందుకు బిఎన్ఎస్ 238 సెక్షన్‌ను (గతంలో ఐపిసి 201) జోడించారు. ఈ నెల ఎనిమిదవ తేదీ న మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినందుకు పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో భగీరథ్‌పై బిఎన్ఎస్ 74, 75 సెక్షన్లతో పాటు ఫోక్సో సెక్షన్ కింద కేసు నమోదు చేయడం తెలిసిందే. మొదట కేవలం అసభ్య ప్రవర్తన కింద మాత్రమే కేసు నమోదు చేయగా మరుసటి రోజున బా లిక వాంగ్మూలం, ఆమె తల్లి పిర్యాదు మేరకు అత్యాచారం కింద మరో సెక్షన్‌ను జోడించారు. దీని తరువాత భగీరథ్‌పై నమోదైన కేసు నాన్ బెయిలబుల్‌గా మారింది. దీని తరువాత భగీరథ్‌ను గత శనివారం రాత్రి సిట్ అధికారులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ కేసులో మ రింత సమాచారం కోసం సోమవారం నాడు సిట్ అధికారులు భగీరథ్ స్నేహితులను విచారించారు. వారిచ్చిన సమాచారం మేరకు బాధిత బాలికపై భగీరథ్ అనేకమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చి అతనిపై నమోదైన ఫోక్సో కేసులో బిఎన్ఎస్ లోని 64 (2) (ఎం) సెక్ష న్‌ను అదనంగా జోడించారు. మద్యం మత్తులో మైనర్ బాలికపై పైచాశికంగా లైంగిక దాడికి పాల్పడినందుకు నిందితుడిపై నమోదైన ఫోక్సో కే సులో ఈ సెక్షన్‌ను అదనంగా జోడించారు. కాగా తాజాగా భగీరథ్‌పై సాక్షాలు, ఆధారాలు ధ్వంసం చేసినందుకు బిఎన్ఎస్ 238 సెక్షన్‌ను జో డించారు. భగీరథ్ అరెస్టయ్యాక అతని ఐ ఫోన్‌ను పోలీసులు జప్తు చేయడం తెలిసిందే. భగీరథ్ ఫోన్‌లో బాధిత బాలికతో చాటింగ్ చేసినం దుకు సంబంధించి వుండాల్సిన సమాచారం కనిపించలేదు. దీంతో పాటు కీలక డాటా, వీడియోలు కూడా భగీరథ్ డిలీట్ చేశాడు. సోషల్ మీ డియా ఖాతాలను కూడా ధ్వంసం చేశాడు. సెల్‌ఫోన్‌లో సిం కార్డు కూడా లేకుండా వుండడంతో పోలీసులు దీనిపై భగీరథ్‌ను విచారించగా పొ ంతనలేని సమాధానాలు ఇచ్చాడు. దీంతో ఫోరెన్సిక్ లాబ్ నిపుణులు సెలైబ్రైట్ వంటి అంతర్జాతీయ స్థాయి సాఫ్ట్‌వేర్‌ను వాడి డిలీట్ అయిన స మాచారాన్ని తిరిగి పునరుద్దరించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

# కొనసాగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ

## బాధితుడుగా ఉన్న కాంగ్రెస్ నేత వాంగ్మూలం తీసుకున్న సిట్ అధికారులు

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో అప్పట్లో బాధి తులుగా వున్న వారిని వరుసగా విచారిస్తున్న సిట్ అధికారులు తాజాగా బుధవారం నాడు కాంగ్రెస్ నేత గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మ న్ మధుసూదన్ రెడ్డిని సిట్ అధికారులు విచారించారు. బషీర్‌బాగ్‌లోని సిట్ కార్యాలయంలో జరిగిన ఈ విచారణ నాలుగు గంటల పాటు సా గింది. అప్పట్లో మధుసూదన్ రెడ్డి ఫోన్‌ను ఎస్ఐబి అధికారులు ట్యాపింగ్ చేసినట్లు సిట్ అధికారులు గుర్తించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల కు ముందు ఈ ట్యాపింగ్ జరిగిందని, అప్పట్లో ట్యాపింగ్‌కు గురైన ఫోన్లలో మధుసూదన్ రెడ్డి ఫోన్ కూడా వుందని తేలడంతో నాటి ఘటన లపై ఆయన నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. విచారణ అనంతరం మీడియాతో మాట్లాడిన మధుసూదన్ రెడ్డి తన ఫోన్ ట్యాపింగ్‌కు గురైన విషయాన్ని సిట్ అధికారులు ఆధారాలతో సహా చూపించారని తెలిపారు. ఇది పెద్ద నేరంగా ఆయన అభివర్ణించారు. అప్పట్లో ఎన్నికల సమయ ంలోల కాంగ్రెస్ నేతల ఫోన్‌లను ట్యాపింగ్ చేశారని, ఇదంతా నాటి ఎస్ఐబి బాస్ ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో జరిగిందని ఆయన తెలిపారు. అధికారం నిలుపుకునేందుకు కెసిఆర్ ఆయన తనయుడు కెటిఆర్ ఎంతకైనా తెగించారనడానికి ఈ ఉదంతం ఒక ఉదాహరణగా ఆయన తెలిపారు. సిట్ అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు జవాబులు చెప్పానని ఆయన వెల్లడించారు. వారు చెప్పే వరకు తన ఫోన్ ట్యాపింగ్‌కు గురైన వి షయం తనకు తెలియదని మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ కేసులో నిందితులందరికి కచ్చితంగా శిక్షలు పడతాయని ఆయన తెలిపారు. కాగా ఇదే కేసుకు సంబంధించి మూడు రోజుల క్రితం ఒక ఛానల్ విలేఖరితో పాటు మరో పత్రిక ఫోటోగ్రాఫర్‌ను సిట్ విచారించింది. వీని ఫోన్‌లు కూడా ట్యాప్ అయినట్లు సిట్ విచారణలో తేలింది. దీంతో పాటు అప్పట్లో అరెస్టయిన ఓ అదనపు ఎస్‌పి ఉదంతం తాలూకు సమాచారం వీరి కి ముందుగానే తెలియడంపై సిట్ విచారించింది. వీరి విచారణ ముగియగానే బుధవారం నాడు కాంగ్రెస్ నేత గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ మధుసూదన్ రెడ్డిని సిట్ విచారించింది.

తెలంగాణ ప్రభుత్వం
ప్రజా ఆరోగ్యం మరియు పురపాలక ఇంజనీరింగ్ శాఖ
కొటేషన్ నోటీసు
రిఫరెన్స్ : కొటేషన్ ప్రకటన నం: 777/DB/D2/TUFIDC/లిఫ్ట్, ఫర్నిచర్ మరియు నాన్-SoR ఐటమ్‌లు/2026-27, తేదీ: 20.05.2026
I. కొటేషన్ ప్రకటనలు (1నం.) : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, P.H.డివిజన్, రంగారెడ్డి వారు C&DMA కార్యాలయంలో పిన్నర్లర్ తయారీ లిఫ్ట్‌ల సరఫరా మరియు స్థాపన. RERA & DTCP కార్యాలయాలకు నిర్దేశిత ఫర్నీచర్ సరఫరా మరియు ఈ కార్యాలయం చేపట్టే పనులకు నిర్దేశించబడిన నాన్-SoR ఐటమ్‌ల సరఫరా నిమిత్తం కొటేషన్లు కోరుతున్నారు. కొటేషన్ల దాఖలుకు చివరి తేదీ: 23.05.2026 సా.4.00గం. వరకు. II. తదుపరి ఏవైనా వివరాలు మరియు స్పష్టతలు అవసరమయితే దయచేసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (PH) కార్యాలయం, రంగారెడ్డి, 5వ అంతస్తు, O/o. ENC (PH) ఆఫీస్ కాంప్లెక్స్, AC గార్డ్స్, హైదరాబాద్-500004 కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చును. ఫోన్: 8008889332, ఇ-మెయిల్: eephhyd@yahoo.com.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, P.H.డివిజన్, రంగారెడ్డి.
DIPR.NO. 2676-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 20.05.2026

PUBLIC NOTICE

**M/s. Rajkumar Theatres Pvt Ltd.**, Chennai - 600 018 is the absolute owner of the Telugu Remake Rights (the said Rights) of the film "Drishyam 3", starring Mohanlal, Meena, etc., directed by Jeethu Joseph (the said Film).

M/s. Rajkumar Theatres Pvt Ltd., have filed a suit, vide C.S. (COMM DIV) No.144 of 2026, before the Hon'ble High Court, Madras, against M.J.Antony, of Aashirvad Cinemas, Mr. Jeethu Joseph, M/s.Panorama Studio and M/s. Pen Studios, for a permanent injunction restraining them, their servants, agents, employees, assignees, licensees and every one claiming under or through them from infringing the exclusive Copyright of M/s. Rajkumar Theatres Pvt Ltd., by remaking and exploiting the said Film "Drishyam 3" in Telugu language, anywhere in the World.

The Hon'ble High Court Madras, heard the suit on 20.05.2026 and was pleased to order notice returnable by 3 weeks.

In the meanwhile, anyone who may enter into any arrangement/agreement/contract with respect to the said Film, Dhrishyam 3 for Telugu language or exhibiting the same shall be doing so at their own risk and the same will be subject to the outcome of the said Suit.

CS. 144/2026.
A.No. 448/2026

R. AYSHWARYA
Counsel for Plaintiff

వార్త

విద్య లేకపోయినప్పటికీ గర్వించేవాడు, దరిద్రుడైనప్పటికీ పెద్ద ఎత్తులు వేసేవాడు, పనులు చేయనప్పటికీ ధనాన్ని ఆశించే వాడు మూర్ఖుడు.

- లావోసు

# ఇంకెంతకాలం ఈ వాచావాత్సల్యం?

అదునెరిగి సేద్యం చేయాలి. అందులోనూ పదునెరిగి విత్తనం విత్తాలి. ఈ సూత్రాన్ని ఆచరించాలంటే అందుకు అవసరమైన వనరులు ముందుగానే సమకూర్చుకోవాలి. ఈ విషయం తెలియని రైతులు ఉండరు. అధికారులకు కూడా తెలియంది కాదు. వ్యవసాయ సీజన్ ఆరంభానికి ముందస్తుగానే వనరులు సమకూర్చుకోవడంలో రైతులు ముమ్మరం అవుతారు. అయితే ఎందుకోఏమోకానీ అధికార యంత్రాంగం మాత్రం సకాలంలో రైతులకు అవసరమైన రుణాలు, విత్తనాలు, ఎరువులు అందివ్వడంలో విఫలమవుతూనే ఉంటారు. రుణప్రణాళిక ఎప్పుడో తయారు చేశాం, అవసరం, అర్హతమేరకు అందిస్తాం, ఎరువులు పుష్కలంగా ఉన్నాయి. విత్తనాల కొరత లేదంటూ ప్రకటనల మీద ప్రకటనలు గుప్పిస్తూనే ఉంటారు. కానీ క్షేత్రస్థాయిలో చేస్తే పరిస్థితులు విరుద్ధంగా ఉంటాయి. ఈ సమస్యలు గత రెండు, మూడు దశాబ్దాలుగా అన్నదాతలను వేధిస్తూనే ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ మరో వారంలో రోజుల్లో ఈ నెల ఇరవై ఐదున రోహిణికార్తె ప్రవేశంతో ఆరంభం కాబోతున్నది. రైతులు ఖరీఫ్ సాగుకు కావాల్సిన వనరులు సమకూర్చుకోవడంలో నిమగ్నమైఉన్నారు. మరోపక్కపాలనా యంత్రాంగం కూడా బ్యాంకర్లతో సంయుక్త సమావేశాలు పెట్టి ఏమేరకు రుణాలు ఇవ్వబోయేది ఎంతోముందుగానే నిర్ణయిస్తారు. ఇదంతా యేటా జరిగే తంతే. కానీ చాలా మంది రైతులకు ఇది అర్థంకాదు. ఇదేదో అంకెల గారడీగా కన్పిస్తుంది. ప్రకటిస్తున్న వేలాది కోట్లరూపాయల రుణాలు, సబ్సిడీలు, ఎరువులు ఏమవుతున్నాయో వారికి అర్థం కాదు. ఈసారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మొన్న యాసంగిలో పండిన ధాన్యాన్ని ఇంకా తెలంగాణలో సగం మంది రైతులు అమ్ముకోలేకపోతున్నారు. రోడ్లపై ధాన్యాన్ని కుప్పలుగాపోసి రాత్రింబవళ్లు కాపలా ఉంటున్నారు. ఎప్పుడు కొంటారో? ఎప్పుడో కాంటా పెడతారో? లారీలకు మరెప్పుడు ఎక్కిస్తారో? అంతా అగమ్యగోచరంగానే ఉంది. మరోకపక్క రోడ్లపై కుప్పలు పోసిన వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు అన్నదాతలను బెదరిస్తూనే ఉన్నారు. అందుకు వారికి ఉన్న ఇబ్బందులు వారికి ఉన్నాయి. ముఖ్యంగా రాత్రివేళ్లల్లో వాహనాలకు కుప్పలు సరిగ్గా కనపడకపోవడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో పోలీసులు తప్పనిసరి పరిస్థితుల్లో ధాన్యపు కుప్పలను ఖాళీ చేయించేందుకు రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. కుప్పల వద్ద కాపలా ఉండాలా? అటు సీజన్ ముంచుకొస్తుండ డంతో సాగు సమాయత్తం కావాలా అర్థం కావడం లేదు. ధాన్యం అమ్మిన తర్వాత ఆడబ్బు వస్తే తప్ప మళ్లీ పెట్టుబడి పెట్టలేని పరిస్థితి. ఎందుకోఏమోకానీ యాసంగి ధాన్యం కొనుగోళ్లు ఒక ప్రహసనంగా మారిపోయింది. వరి కోతలు పూర్తయి ఇప్పటికీ దాదాపు నెలరోజులు గడుస్తున్నా కొనుగోళు ప్రక్రియ సగం కూడా కాలేదని చెప్పొచ్చు. తూకం అయిన పదిహేను రోజులకు కూడా లోడింగ్ కాకపోవడంతో రైతుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మార్కెట్ యార్డులకు ధాన్యం తీసుకొచ్చి నెల రోజులు గడుస్తున్నా కొనేవారు కరవయ్యారని రైతులు వాపోతున్నారు. ఒకపక్క రోడ్లెక్కి నిరసనలు, ధర్నాలు చేస్తున్నారు. మరోకపక్క ఎప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుందో తెచ్చిన ధాన్యం తడిసి ముద్ద అవుతాయోనని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని పగలనక, రాత్రనక ధాన్యం రాసుల వద్దనేకాపలా కాయాల్సి వస్తుంది. వివిధశాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం కూడా ఇందుకు కారణమవుతున్నాయనే విమర్శలున్నాయి. మొన్న ముఖ్యమంత్రి ఈ విషయంలోప్రత్యేకంగా జోక్యం చేసుకొని సమీక్షించిన ఆదేశాలు ఇచ్చిన తర్వాత కొంతలో కొంత కదలిక వచ్చిందనే చెప్పొచ్చు. అయితే కొందరు దళారులు లోపాయికారీగా సృష్టిస్తున్న సమస్యలతో కొనుగోళ్లు అంతా సాఫీగా జరగడం లేదని చెప్తున్నారు. ఏదిఏమైనా ఇలాగే కొనుగోళ్లు కొనసాగితే రైతులు పండించిన ధాన్యంలో చివరి గింజ వరకు కొనుగోలు చేయడానికి మరో రెండు, మూడువారాలు పడుతుందని మార్కెట్ వర్గాలే అంచనా వేస్తున్నాయి. కాలం కాని కాలంలో ముంచెత్తుతున్న వానలతో ధాన్యంతోసహా మొక్కజొన్న, పొగాకు తదితర పంటలు తడిసి ముద్దయిపోతున్నాయి. చేతికి వచ్చిన పంట వర్షార్పణం అవుతుండడంతో రైతుల వేదన వర్ణనాతీతంగా ఉన్నది. కష్టమంతా నీటిపాలై మళ్లీ పెట్టుబడి ప్రశ్నార్థకమై రోదిస్తున్న అన్నదాతలను ఆదుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. మొన్న రబీ సీజన్‌లోఎరువుల పంపిణీ దుర్భరంగా ఉన్నది. ఎవరి ఆలోచన ఏమోకానీ 'యాప్' పేరిట కొత్త విధానాన్ని ప్రవేశపెట్టారు. దీనివల్ల అమాయక రైతులు పడిన ఇబ్బందులు అన్నీఇన్నీకావు. అసలు వ్యవసాయశాఖ ప్రైవేట్ కంపెనీల ఆధీనంలో పనిచేస్తున్నదేమో అనే అనుమానాలు కలుగుతాయి. ఎరువులేమో అవసరానికి మించి పుష్కలంగా నిల్వ ఉన్నాయని అధికారులు పదేపదే సెలవిచ్చారు. నిబంధనల ప్రకారం నిర్ణీత ధరకంటే ఎక్కువ ఎక్కడైనాఅమ్ముతున్నట్లు తమ దృష్టికి వస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరిస్తూనే ఉంటారు. అంతేకాదు రైతులకు ఇష్టంలేని, అవసరం లేని ఎరువులు బలవంతంగా అంటగడితే చర్యలు తప్పవని ప్రకటిస్తుంటారు. వాస్తవంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న విషయాలు అధికారులకు తెలియదా? తెలిసినా తెలియనట్టే నటిస్తుంటారా? ఇందులో అంతరార్థం ఏమైనా ఉందా? తెలుగురాష్ట్రాల్లో ఏమూలకు వెళ్లినా రైతులు పడుతున్న అవస్థలు తెలుస్తాయి. ఉన్నతస్థాయిలో సమీక్షలు చేస్తున్నారు, ఆదేశాలు ఇస్తున్నారు. అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. కనీసం ఆరంభం కాబోతున్న ఖరీఫ్ సీజన్‌కైనా విత్తనాలు, ఎరువులు వీటన్నింటి మించిన రుణసహాయం సకాలంలో అందించాలి. అన్నదాతలపై నేతలు మాటల్లో ఒలకబోస్తున్న ప్రేమలో పదోవంతు ఆచరణలో చూపిస్తే చాలు. వారి కష్టాలు కొంతమేరకైనా తీరుతాయి.

విజయం సాధించగలమనే విశ్వాసం ఉన్న వాళ్లు విజయం సాధించి తీరుతారు.



డబ్ల్యు.ఎమర్సన్

శత్రువుల నుంచి కాపాడుకోవాలంటే వాళ్లని మిత్రులుగా మార్చుకోవడమే ఉత్తమమైన మార్గం.



స్వామి వివేకానంద

## ప్రజావాక్కు

### మత్తులో యువత

భారతదేశ భవిష్యత్తుకు వెన్నెముకగా నిలవాల్సిన యువత నేడుమాదకద్రవ్యాల మత్తులో చిక్కుకుని దిశానిర్దేశం కోల్పోవడం అత్యంత ఆందోళనకరమైన విషయం. దేశవ్యాప్తంగా డ్రగ్స్, మద్యం, ఇతర మత్తు పదార్థాల వినియోగం పెరగడం వల్ల యువశక్తి నిర్వీర్యమవుతోంది. కేవలం క్షణికానందం కోసంలేదా ఒత్తిడి నుండి ఉపశమనం పొందడానికని అలవాటు చేసుకుంటున్న ఈ అలవాట్లు, కాలక్రమేణా ప్రాణాంతక వ్యసనాలుగా మారుతున్నాయి. ఇది వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా, కుటుంబ వ్యవస్థకు, దేశ ఆర్థికాభివృద్ధికి పెద్ద అడ్డంకిగా పరిణమించింది. సామాజిక మాధ్యమాల ప్రభావం, పాశ్చాత్య సంస్కృతి అనుకరణ, స్నేహితుల ప్రోద్బలంవల్ల విద్యార్థులు చిన్న వయస్సులోనే ఈ విషవలయంలో చిక్కుకుంటున్నారు. దీని వల్ల నేరాలు పెరగడం, మానసిక రుగ్మతలు సంభవించడం, ఆత్మహత్యల వంటిదారుణాలు చోటుచేసుకుంటున్నాయి. మత్తుపదార్థాలఅక్రమరవాణాను అరికట్టడంలో ప్రభుత్వాలుకఠినమైననిఘాఉంచాలి. విద్యాసంస్థల సమీపంలో మాదకద్రవ్యాల విక్రయాలపై ఉక్కుపాదం మోపాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సామాజిక మాధ్యమాల ప్రభావం

నేడు సమాజంలో యువత సెల్‌ఫోన్ భారినపడి ఆరోగ్యాన్నిపాడు చేసుకుంటున్నారు. వీటన్నింటికి కారణం సామాజిక మాధ్యమాలైనా వాట్సాప్, ఇన్స్టాగ్రామ్, స్నాప్చర్ట్‌లో మీ ఇంట్లో మీ పిల్లలు ఏం చేస్తున్నారో గమనించండి. ఓ తల్లిదండ్రులారా మీపక్కనే ఉంటూ మిమ్మల్ని వదిలి వెళ్ళేలా ప్రేరేపిస్తున్న సామాజిక మాధ్యమాలను సోషల్ మీడియా వాడకాన్ని జర అదుపులో పెట్టండి. అసలు ఎవరు కోసం ఈ తరం పిల్లలు చనిపోతున్నారు ఆలోచించండి. తల్లిదండ్రులార మీ పిల్లల బాధ్యత మీదే.

- ఎం. శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ఎఐ అంటే భయమా?

అమెరికా కంటేఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంటేనే భయం చాలా పెరిగిపోతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులు, తెలివైన వాళ్ళు, మోసగాళ్లు, అగ్రవర్ణాలు ఉన్న అద్భుతమైన ప్రదేశమే అమెరికా. స్వేచ్ఛా విహంగాల పతంగం అక్కడే బాగా ఎగురుతుంది. అలాంటి ఆస్వేచ్ఛ వాతావరణంలో నిర్భయత్వానికి చోటు చాలాతక్కువ. ఎప్పుడు ఎవడు ఏ ఆయుధంతో ఎటాక్ చేస్తాడో అనే భయం.

- పి.నాగరాజు, హైదరాబాద్

### ఉపాధ్యాయుల సమస్యలు పట్టించుకోండి

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేయుచున్న ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులతో పెట్టుకున్న రాజకీయ పార్టీలు వాటి మనుగడ ఏమైందో చరిత్ర రుజువు చేస్తూనే ఉంది. నిజానికి ప్రజల్లో ప్రభుత్వ పాఠశాలలో పనిచేయుచున్న ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు పట్ల తీవ్రమైన అసూయ ఉన్నది. ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు నచ్చినా, నచ్చకపోయినా కొన్ని ఖచ్చితంగా అమలవుతాయి. మొదటిది జీతాలు భారీగా పెరిగే అవకాశాలుతగ్గుతాయి. ముప్పై మూడు సంవత్సరాల సర్వీసు లేదా అరవై రెండు సంవత్సరాలు ఏది ముందు నిండితే వారిని తక్షణమే పదవీ విరమణ చేయిస్తారు. ఇంగ్లీష్ మీడియం లో పాఠశాలలు కళాశాలలు కొనసాగుతాయి. కేజీ టు పీజీ పాఠశాలలు పుట్టుకొస్తాయి. కేవలం ప్రభుత్వపాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులే కాదు అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి కూడా వారి ఉద్యోగం ఎక్కడ ఉందో అక్కడే శాశ్వతంగా ఉండేలా చట్టాలు వస్తాయి. కేంద్ర ఎన్నికలు రాష్ట్రాల ఎన్నికలు ఇకపై ఐదేళ్ల కాకుండా పదేళ్ల కాలపరిమితి అయ్యే అవకాశం ఉన్నది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### ప్రాణాలు తీస్తున్న శబ్ద కాలుష్యం

ఆధునిక నాగరికత వేగంగా ముందుకు సాగుతున్న కొద్దీ మన జీవితాల్లో శబ్దకాలుష్యం ప్రమాదకరమైన సమస్యగా నిశ్శబ్దంగా పెరుగుతోంది. నగరాల విస్తరణ, పెరుగుతున్న ట్రాఫిక్, నిరంతరం వినిపించే హారన్లు, లౌడ్‌స్పీకర్లు, పరిశ్రమల శబ్దాలు కలిసి మన జీవనశైలిని ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిస్థితి మన ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని కేంద్ర మంత్రి వెల్లడించడం ఆందోళన కలిగించే విషయం. సుదీర్ఘ కాలం పాటు అధిక శబ్దానికి గురైతే నిద్రలేమి, మానసిక అసహనం, ఒత్తిడి, రక్తపోటు, హృదయ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు కూడా చెబుతున్నారు.

- సి. రాజేష్, హైదరాబాద్

### పెండింగ్ కేసులను పరిష్కరించాలి

తెలంగాణా రాష్ట్రంలో ఉన్న ఎస్సి, ఎస్టీ కోర్టులు పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారం చేయాలి. ఎస్సి, ఎస్టీ ప్రజల ఇండ్ల స్థలం కబ్జాలు గురించి పోలీస్ స్టేషన్‌లలో పెండింగ్ లోఉన్న దరఖాస్తులు వెంటనే పరిష్కారం చేయాలి. జూన్ 2 తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎస్సి, ఎస్టీ. దరఖాస్తులు పరిష్కారం చేయాలి. ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ చట్టం 1989పై అవగాహనా కలిపించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# మంచినీటి వ్యవస్థల సంరక్షణ అత్యవసరం

**మంచినీటి జీవ వైవిధ్యం కేవలం పర్యావరణ సంపద మాత్రమే కాదు, అది ఆహార భద్రత, ఆర్థికాభివృద్ధి, మానవ ఆరోగ్యానికి కూడా అత్యంత కీలకమైనది. అందువల్ల మంచినీటి జీవావరణ వ్యవస్థల సంరక్షణ అత్యవసరంగా మారింది. చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, కాలుష్య నియంత్రణ, జీవ వైవిధ్య పర్యవేక్షణ, స్థిరమైన మత్స్య నిర్వహణ అటవీకరణ వంటి చర్యలు వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించడంలో సహాయపడతాయి. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన నీటి వనరులు ఆరోగ్యకరమైన జీవ వైవిధ్యాన్ని అందించాలంటే ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులుప్రజలు సమిష్టిగా పనిచేయాలి. ప్రకృతిని కాపాడటం అంటే మన భవిష్యత్తును కాపాడటమే అనే అవగాహన సమాజంలో మరింత పెరగాల్సిన అవసరం ఉంది.**

డాక్టర్. వంగ.రజని

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మానవాళి ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన పర్యావరణ సమస్యల్లో వాతావరణ మార్పులు ప్రధానమైనవి. పారిశ్రామికీకరణ, అటవీ నిర్మూలనం, వాహనాల పెరుగుదల, బొగ్గు, పెట్రోలియం ఇంధనాల అధిక వినియోగం కారణంగా గ్రీన్హౌస్ వాయువుల ఉద్గారాలు విపరీతంగా పెరిగాయి. దీని ఫలితంగా భూమి ఉపరితల ఉష్ణోగ్రత క్రమంగా పెరుగుతూ ప్రపంచ వాతావరణ సమతౌల్యాన్ని దెబ్బతీస్తోంది. ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పులపై అంతర ప్రభుత్వ ప్యానెల్ నివేదికల ప్రకారం గత కొన్ని దశాబ్దాల్లో ప్రపంచ సగటు ఉష్ణోగ్రత గణనీయంగా పెరిగింది. దీని ప్రభావం సముద్రాలు, అటవీ ప్రాంతాలు, వ్యవసాయ రంగంపైనే కాకుండా మంచినీటి జీవావరణ వ్యవస్థలపై కూడా తీవ్రంగా కనిపిస్తోంది. మంచినీటి జీవావరణ వ్యవస్థలు అనగా నదులు, సరస్సులు, చెరువులు, వాగులు, జలాశయాలు తడిబయళ్ళు వంటి తీయని నీటి వనరులు. భూమిపై లభ్యమయ్యే మొత్తం నీటిలో మంచినీటి శాతం చాలా తక్కువ అయినప్పటికీ ప్రపంచ జీవ వైవిధ్యంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. చేపలు, వృక్షప్లాంక్టన్, జంతు ప్లాంక్టన్, ఉభయచరాలు, జల కీటకాలు, జల వృక్షాలు అనేక సూక్ష్మ జీవులు తమ మనుగడ కోసం ఈ జీవావరణ వ్యవస్థలపై ఆధారపడి ఉంటాయి. ఈ జీవ వ్యవస్థలు ఆహార శృంఖలాలు, పోషక చక్రాలు, ఆమ్లజని ఉత్పత్తి, జీవ సమతౌల్య నిర్వహణలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. ప్రపంచ స్థాయిలో వాతావరణ మార్పుల ప్రభావం వల్ల అనేక దేశాల్లో మంచి నీటి వనరులు క్షీణిస్తున్నాయి. ఆర్కిటిక్ ప్రాంతాల్లో మంచు కరుగుదల పెరగడం, హిమనదులు తగ్గిపోవడం, అసాధారణ వర్షపాతం, దీర్ఘకాల కరువులు, ఆకస్మిక వరదలు, వేడి తరంగాలు నదీ వ్యవస్థల సహజ ప్రవాహాలను ప్రభావితం చేస్తున్నాయి. యూరప్, ఆఫ్రికా, ఆసియా దేశాల్లోని అనేక సరస్సులు గతంతో పోలిస్తే నీటి మట్టాన్ని గణనీయంగా కోల్పోతున్నాయి. కొన్ని నదులలో ఋతుపరమైన నీటి ప్రవాహం మారిపోవడంతో చేపల వలసలు, సంతానోత్పత్తి చక్రాలు దెబ్బతింటున్నాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా నీటిలో కరిగిన ఆమ్లజని స్థాయిలు తగ్గిపోవడం వల్ల చేపలు ఇతర జలజీవుల మనుగడకు ముప్పు ఏర్పడుతోంది. వాతావరణ మార్పులు నీటి భౌతిక, రసాయన, జీవ లక్షణాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. ఉష్ణోగ్రత పెరుగుదల వల్ల నీటిలో ఆవిరీభవనం అధికమై నీటి మట్టాలు తగ్గుతున్నాయి. దీని కారణంగా నైట్రేట్లు, ఫాస్ఫేట్లు, ఇతర కాలుష్య పదార్థాల సాంద్రత పెరుగుతోంది. అధిక పోషక పదార్థాల సమృద్ధి వల్ల యూట్రోఫికేషన్ ప్రక్రియ వేగవంతమై నీలి ఆకుపచ్చ శైవలాల విస్తరణలు పెరుగుతున్నాయి. ఈ శైవలాలు నీటిలో ఆమ్లజని స్థాయిలను తగ్గించి చేపల మరణాలకు దారితీస్తున్నాయి. ప్రపంచంలోని అనేక సరస్సులు జలాశయాల్లో ఈ పరిస్థితులు ప్రస్తుతం తీవ్రమవుతున్నాయి. భారతదేశం ప్రపంచంలో అత్యధిక జీవ వైవిధ్యం కలిగిన దేశాల్లో ఒకటి. గంగా, బ్రహ్మపుత్ర, గోదావరి, కృష్ణా వంటి నదీ వ్యవస్థలు కోట్లాది ప్రజలకు తాగునీరు, వ్యవసాయం, మత్స్య సంపద, జీవనోపాధిని అందిస్తున్నాయి. భారతదేశంలో మంచినీటి జీవ వైవిధ్యం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యఆధారం. అయితే గత కొన్ని సంవత్సరాలుగా వాతావరణ మార్పుల ప్రభావం భారతదేశ మంచినీటి



జీవావరణ వ్యవస్థలపై స్పష్టంగా కనిపిస్తోంది. అసమాన వర్షపాతం, తీవ్రమైన ఎండలు, ఆకస్మిక వరదలు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు నదులు, సరస్సులు, చెరువుల సహజ సమతౌల్యాన్ని దెబ్బతీస్తున్నాయి. భారతదేశంలోని అనేక మంచినీటి వనరుల్లో కాలుష్యం, పోషక పదార్థాల అధిక సమృద్ధి దురాక్రమణ జీవజాతుల సమస్యలు పెరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో స్వదేశీ చేపల జాతుల సంఖ్య తగ్గిపోతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో చేపల సంతానోత్పత్తి విధానాల్లో మార్పులు నమోదవుతున్నాయి. గంగా, యమునా నదుల్లో నీటి నాణ్యత క్షీణించడం వల్ల చేపల వైవిధ్యం గణనీయంగా తగ్గిపోయినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. దీని ప్రభావం మత్స్యకారుల జీవనోపాధిపై కూడా తీవ్రంగా పడుతోంది. తెలంగాణ రాష్ట్రంలో చెరువుల సంస్కృతి ఎంతో పురాతనమైనది. కాకతీయుల కాలం నుంచే వేలాది చెరువులు నిర్మించబడి వ్యవసాయం, తాగునీరు, మత్స్య సంపదకు ప్రధాన వనరులుగా ఉపయోగపడుతున్నాయి. అయితే ప్రస్తుతం తెలంగాణలో వాతావరణ మార్పుల ప్రభావంతో చెరువుల జీవ సమతౌల్యం క్రమంగా దెబ్బతింటోంది. వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం, వర్షపాతం అస్థిరత, నీటి కొరత, పట్టణ కాలుష్యం వంటి అంశాలు మంచినీటి జీవ వైవిధ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. తెలంగాణలోని అనేక సరస్సులుచెరువుల్లో వృక్ష ప్లాంక్టన్ జంతు ప్లాంక్టన్ వైవిధ్యంలో ఋతుపరమైన మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు పోషక పదార్థాల అధిక సమృద్ధి కారణంగా సయానోఫైసీ వంటి నీలిఆకుపచ్చ శైవలాలు అధికంగా పెరిగి హానికరమైన శైవల విస్తరణలు ఏర్పడుతున్నాయి. ఇవి నీటిలో డిసాల్వ్ ఆక్సిజన్‌ను తగ్గించి చేపల మరణాలకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలకు సమీపంలోని సరస్సుల్లో గృహ మురుగు నీరు, వ్యవసాయ ప్రవాహాల వల్ల నీటి నాణ్యత వేగంగా క్షీణిస్తోంది. వృక్ష ప్లాంక్టన్ జీవులు మంచి నీటి జీవావరణ వ్యవస్థల్లో ప్రాథమిక ఉత్పత్తిదారులుగా పనిచేస్తాయి. ఇవి ఆమ్లజనిని ఉత్పత్తి చేయడమే కాకుండా జల ఆహార శృంఖలకు పునాది వంటివి. జంతు ప్లాంక్టన్ జీవులు చేప పిల్లలకు ముఖ్యమైన ఆహార వనరులుగా ఉంటాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో ప్లాంక్టన్ సముదాయాల నిర్మాణం మారిపోతే మొత్తం జల జీవావరణ వ్యవస్థ అసమతౌల్యానికి గురవుతుంది. తెలంగాణ ప్రాంతంలోని కొన్ని అధ్యయనాలు వేసవి కాలంలో జీవ జాతుల వైవిధ్యం తగ్గడం, వర్షాకాలంలో జీవ వైవిధ్యం పెరగడం వంటి ఋతుపరమైన హెచ్చుతగ్గులను గుర్తించాయి. నీటి భౌతికరసాయన లక్షణాలైన ఉష్ణోగ్రత, ఆమ్లజని, నైట్రేట్లు ఫాస్ఫేట్లు వంటి అంశాలు వాతావరణ మార్పుల ప్రభావంతో మారుతున్నాయి. ముఖ్యంగా అధిక ఉష్ణోగ్రతల వల్ల ఆవిర్భవనం పెరిగి నీటి మట్టం తగ్గుతోంది. దీని ప్రభావం చేపల ఉత్పాదకత జల జీవుల జీవక్రియలపై పడుతోంది. మత్స్య రంగంపై దీని ప్రభావం ఆర్థికంగా కూడా తీవ్రంగా ఉంటుంది. మంచినీటి జీవ వైవిధ్యం కేవలం పర్యావరణ సంపద మాత్రమే కాదు, అది ఆహార భద్రత, ఆర్థికాభివృద్ధి, మానవ ఆరోగ్యానికి కూడా అత్యంత కీలకమైనది. అందువల్ల మంచినీటి జీవావరణ వ్యవస్థల సంరక్షణ అత్యవసరంగా మారింది. చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, కాలుష్య నియంత్రణ, జీవ వైవిధ్య పర్యవేక్షణ, స్థిరమైన మత్స్య నిర్వహణ అటవీకరణ వంటి చర్యలు వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించడంలో సహాయపడతాయి. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన నీటి వనరులు ఆరోగ్యకరమైన జీవ వైవిధ్యాన్ని అందించాలంటే ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులుప్రజలు సమిష్టిగా పనిచేయాలి. ప్రకృతిని కాపాడటం అంటే మన భవిష్యత్తును కాపాడటమే అనే అవగాహన సమాజం లో మరింత పెరగాల్సిన అవసరం ఉంది. ●

(రచయిత: జంతుశాస్త్ర పరిశోధకురాలు)

# స్మార్ట్‌యుగంలో ట్రాక్ తప్పుతున్న యువత!

నల్ల రవి కుమార్

విజయనగరం జిల్లా రాజాం పట్టణంలో ఇటీవల జరిగిన ఆ దారుణ సంఘటన యావత్ సమాజాన్నిఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. ఇది కేవలం ఒక క్రైమ్ వార్త కాదు, స్మార్ట్ యుగంలో ట్రాక్ తప్పుతున్న టీనేజ్ ఎమోషన్స్కు, క్షీణిస్తున్న నైతిక విలువలకు ఇదో నిలువెత్తు నిదర్శనం. పదో తరగతిలో 525కు పైగా మార్కులు సాధించి, భవిష్యత్తుపై ఎన్నో ఆశలు రేకెత్తించాల్సిన ఒక విద్యార్థి, కన్న తల్లిని అంతమొందించే స్థాయికి దిగజారడం వెనుక ఉన్న సామాజిక, మానసిక పరిస్థితులను లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నేటి స్మార్ట్ సమాజంలో మార్కులకు ఉన్న విలువ మనుషులకు, బంధాలకు లేకుండా పోతోంది. కార్పొరేట్ విద్యాసంస్థలు కేవలం ర్యాంకుల వేటలోనే విద్యార్థులను ఉంచుతున్నాయి తప్ప, వారికి భావోద్వేగాలను అదుపులో ఉంచుకునే మానసిక స్థైర్యాన్ని, నైతిక విలువలను నేర్పించలేకపోతున్నాయి. ఒక బాలికకు ప్రేమలేఖ రాయడం, దానికి తల్లిదండ్రులు, యాజమాన్యం మందలించడాన్ని సదరు బాలుడు ఒక అవమానంగా భావించాడు తప్ప, తన తప్పును తెలుసుకునే విచక్షణను కోల్పోయాడు. టీనేజ్లో సహజంగా వచ్చే ఆకర్షణలను, భావోద్వేగాలను సరైన రీతిలో మళ్లించలేకపోవడం వల్లే ఇలాంటి విపరీత బుద్ధులు పుడుతున్నాయి. సమాజంలో పెరుగుతున్న అసహనం, క్షణికావేశాలు నేటి యువతను ఎంతటి దారుణాలకైనా ఒడిగట్టేలా చేస్తున్నాయి. 'ముంబయి వెళ్లి మాఫియా డాన్ కావాలనుకున్నా' అని ఆ బాలుడు పోలీసుల ఎదుట చెప్పిన మాటలు వింటే నేటితరం ఆలోచనలు ఎంతటి ఘోరమైన ట్రాక్ తప్పుతున్నాయో అర్థమవుతుంది. పట్టుమని పదిహేనేళ్లు లేని వయసులో క్రూరత్వాన్ని ఒక రోల్ మోడల్గా మార్చుకోవడం తీవ్రమైన మానసిక వికారానికి నిదర్శనం. తాతగారి ఇంట్లో ఉన్న తల్లిని 'ఆకలేస్తోంది' అని నమ్మించి పిలిపించి, బాత్రూమ్లో కాళ్లు కడుక్కుంటుండగా మాటు వేసి గొంతు నులిమి




చంపడం పక్కా నేరపూరిత మనస్తత్వాన్ని సూచిస్తోంది. కన్నతల్లి ప్రాణం కంటే ఇంట్లోని బంగారం, డబ్బుముఖ్యం అనుకోవడం భావోద్వేగాల పతనానికి పరాకాష్ట. ఈవికృత మనస్తత్వానికి నేటి చలనచిత్రాలు, వెబ్ సిరీస్లు, సోషల్ మీడియా మాయాజాలం కూడా ఒక ముఖ్య కారణం. అవి నేరాన్ని, హింసను గ్లోరిఫై చేసి చూపిస్తున్నాయి. 'డాన్‌ఖీ', 'గ్యాంగ్స్టర్' పాత్రలను హీరోలుగా ప్రొజెక్ట్ చేయడం వల్ల బాలురు వాటిని నిజ జీవితంలో అనుకరించాలని చూస్తున్నారు. దీనికి తోడు స్మార్ట్ఫోన్లలో లభించే పరిమితులు లేని కంటెంట్, రీల్స్, షార్ట్ వీడియోలు పిల్లల మెదడును మొద్దుబార్చుతున్నాయి. వర్చువల్ ప్రపంచమే నిజమని నమ్మి, అందులోని విలాసవంతమైన జీవితం కోసం కన్న వారిని కూడా వదులుకోవడానికి సిద్ధపడుతున్నారు. మరో వైపు తల్లిదండ్రులు పిల్లల చదువుపై పెట్టే శ్రద్ధను వారి మానసిక స్థితిపై, ప్రవర్తనపై పెట్టడం లేదనేది చేదునిజం. "అదర్ యావగేషన్స్" (ఇతర వ్యాపకాలు) మానుకోమన్నందుకు తల్లిపై కక్ష పెంచుకోవడం వెనుక, బాలుడి స్నేహాలు ఎటు దారితీస్తున్నాయో కుటుంబం గమనించలేకపోయిందనే భావన వ్యక్తమవుతోంది. ఇలాంటి నేరాల్లో నేటి తరం యువత 'మత్తు పదార్థాలు' లేదా సైబర్ గేమ్స్ వంటి వ్యసనాలకు బానిసలవుతున్నారు. డబ్బు కోసం, జల్సాల కోసం ఎంతటి దారుణానికైనా వెనకాడటం లేదు. రాజాం ఘటన ఒక వ్యక్తిగత నేరం కాదు, వ్యవస్థాగత వైఫల్యం. కేవలం మార్కులు వస్తే సరిపోదు, భావోద్వేగాలపై నియంత్రణ, మంచితనం కూడా ముఖ్యమని పిల్లలకు నేర్పాలి. పాఠశాలల్లో కేవలం సిలబస్ బోధన మాత్రమే కాకుండా మానసిక కౌన్సిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. తల్లి దండ్రులు పిల్లలతో నాణ్యమైన సమయాన్ని గడుపుతూ, వారి డిజిటల్ అలవాట్లను, స్నేహితులను నిరంతరం గమనించాలి. స్మార్ట్‌యుగంలో పిల్లలు సాంకేతికతకు బానిసలై, మనసులేని వారిగా, క్రూర స్వభావులుగా మారకుండా చూసుకోవడం నేటి తల్లిదండ్రులు, సమాజం ముందున్న అతిపెద్ద సవాలు. ●

# భద్రత ఎక్కువైతే బాధ్యత తగ్గుతుందా?

ఫిరోజ్ ఖాన్

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగంగా మారుతున్న ఈ కాలంలో సాధారణ పౌరుడి జీవితంలో 'జీవన భద్రత' అనే భావన క్రమంగా అనిశ్చితికి లోనవుతోంది. ఒకవైపు వ్యవసాయ రంగంలో పంట చేతికొస్తుందనే నమ్మకం తగ్గుతుండగా, మరోవైపు అడ్డా కూలీలకు నిరంతర ఉపాధి దొరకని పరిస్థితి కనిపిస్తోంది. ఒకప్పుడు అత్యంత సురక్షితమైనదిగా భావించిన ఐటీ రంగంలో కూడా 'లేఆఫ్స్' ఉద్యోగుల స్థిరత్వాన్ని దెబ్బతీస్తున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక నివేదికల ప్రకారం, 2023 నుండి 2026 మధ్య కొన్ని గ్లోబల్ టెక్ సంస్థలు వేలాది ఉద్యోగాలను తగ్గించాయి. కేవలం 2026 తొలి ఐదు నెలల్లోనే అమెరికా టెక్ రంగంలో 92 వేలకు పైగా ఉద్యోగాల కోతలు నమోదైనట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో, ప్రభుత్వ ఉద్యోగ భద్రత, పౌర సేవల నాణ్యతపై కొత్త చర్చ మొదలైంది. ఉపాధి రక్షణ అవసరమే అయినప్పటికీ, జవాబుదారీతనం తగ్గితే ప్రజాస్వామ్య పరిపాలనపై ప్రభావం పడుతుందా అనే ప్రశ్న ఇప్పుడు వినిపిస్తోంది. భారత రాజ్యాంగ నిర్మాతలు దేశ పరిపాలనా యంత్రాంగం రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా స్వతంత్రంగా పనిచేయాలని ఆకాంక్షించారు. అందుకే రాజ్యాంగంలోని ఆర్టికల్ 311 ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక రక్షణ కల్పించారు. చట్టబద్ధమైన విచారణ లేకుండా ఏ ఉద్యోగిని నిరంకుశంగా తొలగించకుండా ఉండటం ఈ నిబంధన ప్రధాన ఉద్దేశం. పరిపాలన స్థిరంగా సాగాలన్నా, నిజాయితీ గల అధికారులు కక్షసాధింపు చర్యలకు బలికాకూడదన్నా ఆలోచనతో రక్షణ అవసరమని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. కేంద్ర సిబ్బంది శిక్షణ శాఖ, రెండో పరిపాలనా సంస్కరణల కమిషన్ నివేదికలు కూడా పారదర్శకత, పనితీరు అంచనా, సేవల నాణ్యతను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వ వ్యవస్థలను ఆధునీకరించేందుకు పలు దేశాలు సంస్కరణలు చేపట్టాయి. అర్జెంటీనాలో అధ్యక్షుడు హావియర్ మిలే ప్రభుత్వం వేలాది ప్రభుత్వ ఉద్యోగాలను తగ్గించినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. అమెరికా, బ్రిటన్, కెనడా వంటి దేశాలు కూడా పోస్టుల పునర్వ్యవస్థీకరణ, ఖర్చుల నియంత్రణ, డిజిటల్ పరిపాలనపై దృష్టి పెంచుతున్నాయి. ప్రపంచ బ్యాంక్, ఓఈసీడీ వంటి సంస్థల అధ్యయనాల ప్రకారం, సేవలపంపిణీలో పారదర్శకత పెరిగిన దేశాల్లో ప్రజా విశ్వాసం కూడా మెరుగుపడింది. అందువల్ల ఉద్యోగ భద్రతతో పాటు బాధ్యత నిర్ధారణ, సమయపాలన, డిజిటల్ పర్యవేక్షణ వంటి అంశాలను సమతుల్యంగా అమలు చేయాల్సిన అవసరం పెరుగుతోందని పరిపాలనా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అనేక దేశాలు ఇదే




దిశగా అడుగులు వేస్తున్నాయి. గ్లోబల్ టెక్ సంస్థలు భారీ స్థాయిలో ఉద్యోగాల కోతలను ప్రకటిస్తూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విస్తరణ, వ్యయ నియంత్రణ, లాభదాయకత ఆధారంగా పునర్వ్యవస్థీకరణలను వేగవంతం చేస్తున్నాయి. ఈ అంతర్జాతీయ ధోరణుల నేపథ్యంలో, ప్రజలు పన్నుల రూపంలో పెద్దమొత్తంలో చెల్లిస్తున్నప్పటికీ రెవెన్యూ కార్యాలయాలు, మున్సిపల్ విభాగాలు, భూముల రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ సేవా కేంద్రాలలో కొన్ని సందర్భాల్లో కనిపిస్తున్న ఆలస్యం, మధ్యవర్తుల జోక్యం వ్యవస్థాగత లోపాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ విశ్లేషణల ప్రకారం, సేవలలో ఆలస్యం, బాధ్యత నిర్ధారణలో బలహీనతలు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రధాన సవాళ్లుగా గుర్తించబడ్డాయి. అయితే, ఈ పరిస్థితులకు కేవలం ఉద్యోగ భద్రత మాత్రమే కారణం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సిబ్బంది కొరత, మౌలిక వసతుల లోపం, మితిమీరిన పనిభారం, ఖాళీ పోస్టులు భర్తీ కాకపోవడం వంటి అంశాలు కూడా సేవల నాణ్యతపై ప్రభావం చూపుతున్నాయి. అదే సమయంలో, ఎన్నికల నిర్వహణ, గ్రామీణ విద్యావైద్య విస్తరణ, విపత్తుల నిర్వహణ వంటి కీలక రంగాలు ఇప్పటికీ ప్రభుత్వ సిబ్బంది నిరంతర శ్రమపైనే ఆధారపడి నడుస్తున్నాయనే వాస్తవాన్ని విస్మరించలేం. కోవిడ్ మహమ్మారి, వరదలు, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం అందించిన సేవలను పలు అంతర్జాతీయ సంస్థలు కూడా ప్రశంసించాయి. అందువల్ల పరిపాలనా వ్యవస్థలోని లోపాలను చర్చించే సమయంలో, ప్రజలకు సేవలందిస్తున్న నిజాయితీ గల ఉద్యోగుల కృషిని సమానంగా గుర్తించడం కూడా అవసరమనే అభిప్రాయం బలపడుతోంది. నేడు ఈ సమతుల్యతే సమర్థవంతమైన ప్రజాస్వామ్య పరిపాలనకు కీలకంగా మారుతోంది. సమస్య 'ఉద్యోగ భద్రత' కల్పించడంలో లేదు. ఆ భద్రతతో పాటు సమర్థవంతమైన జవాబుదారీతనాన్ని నిర్ధారించడంలోఉంది. ప్రజల పన్నులతో నడిచే పరిపాలనలో ప్రతి విభాగం పనితీరు పారదర్శకంగా ఉండాలి. సింగపూర్, ఎస్టోనియా వంటి దేశాలు డిజిటల్ గవర్నెన్స్, పౌర ఫీడ్‌బ్యాక్ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ సేవలపై ప్రజా విశ్వాసాన్ని పెంచాయి. భారతదేశంలో కూడా డిజిటల్ ఇండియా, బయోమెట్రిక్ హాజరు, ఆన్‌లైన్ సేవా వ్యవస్థలు కొంత మేర ఫలితాలను ఇస్తున్నాయి. అయినప్పటికీ, సామాన్యుడు ఇంకా కొన్ని చోట్ల సిఫార్సులు, మధ్యవర్తులపైనే ఆధారపడాల్సి వస్తేఅది ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని బలహీనపరుస్తుంది. మరోవైపు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి తగిన ఆర్థిక భద్రత లేకపోవడం సామాజిక అసమానతలకు దారితీస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అందువల్ల భవిష్యత్తు పరిపాలన భద్రతతో జవాబుదారీతనం' అనే ద్వంద్వ సూత్రంపైనే సాగాలి. ఎందుకంటే, చివరికి వ్యవస్థలను నిలబెట్టేది అధికారపు రక్షణ కాదు ప్రజల విశ్వాసమే. ప్రజాస్వామ్యంలో ప్రజలే అసలైన యజమానులైనప్పుడు, వారి సమయం, పన్నుల ధనం, ఆత్మగౌరవం గౌరవించబడాలి. చట్టం ఇచ్చే రక్షణలు కొంతకాలం వ్యవస్థలను నిలబెట్టవచ్చేమో గానీ ప్రజల్లో పెరిగే అసంతృప్తిని ఎలాంటి పరిపాలన కూడా నిరంతరం అడ్డుకోలేదు. ●



## వచ్చే నెల ఫ్రాన్స్‌లో జి-7 శిఖరాగ్ర సదస్సు
# భేటీ కానున్న అగ్రనేతలు ట్రంప్, మోడీ

**న్యూఢిల్లీ, మే 20:** ప్రపంచ రాజకీయాల్లో తీవ్ర ఆసక్తి రేకెత్తించే అతికొద్ది సమావేశాల్లో భారత ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ల భేటీ ఒకటి. గతేడాది వారిద్దరి మధ్య తలెత్తిన విభేదాల తర్వాత ఇప్పుడు మళ్లీ వారిద్దరూ ముఖాముఖి కలుసుకుంటారని సమాచారం వెలుగులోకి వచ్చింది. ఫ్రాన్స్‌లో వచ్చే నెలలో జరగనున్న జీ7 శిఖరాగ్ర సదస్సు ఈ కలయికకు వేదిక కానుంది. ఈ భేటీతో ఇరు దేశాల మధ్య నెలకొన్న వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు తగ్గుతాయో లేదోనని సర్వత్రా చర్చకు దారితీసింది.ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ప్రధాని మోడీ ఈ సదస్సుకు హాజరుకానున్నారు. జూన్ 15 నుంచి 17 వరకు ఎవియన్‌లెస్‌బెయిన్స్‌లో జరిగే ఈ సదస్సులో జీ7 సభ్య దేశాలు కాకపోయినా, ప్రత్యేక ఆహ్వానిత దేశంగా భారత్ పాలుపంచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సదస్సు సందర్భంగా మోడీ, ట్రంప్‌ల మధ్య అధికారికంగా కాకపోయినా, కనీసం అనధికారికంగానైనా ఒక చిన్న సమావేశం జరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ అనూహ్య శైలిని బట్టి చూస్తే, ఈ భేటీని కొట్టిపారేయలేమని నిపుణులు చెపుతున్నారు. మోడీ, ట్రంప్ చివరిసారిగా 2025 ఫిబ్రవరిలో వైట్‌హౌస్‌లో సమావేశమయ్యారు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైన తర్వాత ఆయన్ను కలిసిన తొలి ప్రపంచ నేతల్లో మోడీఒకరు. ఆ సమయంలో మోడీని తన "గొప్ప స్నేహితుడు" అని అభివర్ణించిన ట్రంప్, 2030 నాటికి ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా ఉన్నట్లు చెప్పారు.

ఆ తర్వాత కొద్ది నెలలకే మే నెలలో భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకున్నప్పుడు సంబంధాలు బెడిసికొట్టాయి. ఆ సమయంలో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో తానే కీలక పాత్ర పోషించానని ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించుకున్నారు. నోబెల్ శాంతి బహుమతిని ఆశించి, తాను వాణిజ్యపరమైన బెదిరింపులతోనే అణ్వాయుధ దేశాల మధ్య యుద్ధాన్ని ఆపానని ప్రతిచోటా ప్రచారం చేసుకున్నారు. ట్రంప్ వ్యాఖ్యలకు పాకిస్థాన్ వంత పాడగా, భారత్ మాత్రం తీవ్రంగా స్పందించింది. కాల్పుల విరమణ ఇస్లామాబాద్‌తో నేరుగా జరిపిన చర్చల ఫలితమేనని, ఇందులో మూడో వ్యక్తి ప్రమేయం లేదని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఏడాది తర్వాత జరగబోయే ఈ భేటీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# మోడీ, అమిత్‌షా దేశ ద్రోహులు

- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు
- అరాచక మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుంది: బిజెపి మండిపాటు
- ప్రజా ఆగ్రహానికి ప్రతిబింబం: సమర్థించుకున్న కాంగ్రెస్

**రాయ్‌బరేలీ, మే 20:** దేశ ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందంటూ కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షాలపైనా అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి కొత్త వివాదాన్ని రేకెత్తించారు. తాను ప్రాతినిథ్యం వహిస్తున్న రాయ్‌బరేలీ లోక్‌సభ నియోజకవర్గంలో బుధవారం నిర్వహించిన బహుజన్ స్వాభిమాన్ సభలో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ, ప్రధానమంత్రి, హోం మంత్రి ఇద్దరినీ "దేశద్రోహులు"గా అభివర్ణించారు. వారు దేశాన్ని అమ్ముకున్నారని ఆరోపించారు. "ఆప్కే ప్రధానమంత్రి ఔర్ గృహ మంత్రి గద్దర్ హై (మీ ప్రధానమంత్రి, హోం మంత్రి దేశద్రోహులు)" అని అన్నారు. అలాగే 'రాబోయే ఆర్థిక తుఫాను' గురించి ప్రజలను హెచ్చరిస్తూ, కేంద్ర ప్రభుత్వ లోపభూయిష్టమైన విధానాల కారణంగా దేశం ఆర్థిక సంక్షోభం వైపు పయనిస్తోందని పేర్కొన్నారు. అంతేకాకుండా, కేంద్రం రాజ్యాంగ మౌలిక స్ఫూర్తిని దెబ్బతీస్తోందని ఆరోపించారు. "కొద్ది నెలల్లోనే ద్రవ్యోల్బణం పెరగడం, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటడం, ఎల్పీజీ గ్యాస్ కనుమరుగవడం మీరు చూస్తారు" అని ఆయన అన్నారు. ప్రధానమంత్రి ఖర్చుల కోతకు పిలుపునిస్తూ, తానే ఐదు దేశాల పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో, ప్రజలు తమ గళం విప్పాలని రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి ప్రజలకు బంగారం కొనవద్దని, విదేశాలకు వెళ్లవద్దని సలహా ఇస్తూనే, తాను మాత్రం విలాసవంతమైన విమానాల్లో విదేశీ పర్యటనలకు వెళ్తున్నారని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో రైతులు ఎరువుల వంటి నిత్యావసర వస్తువులను పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆయన హెచ్చరించారు.





### అరాచక మనస్తత్వాన్ని, స్వభావాన్ని ప్రతిబింబిస్తుంది: నితిన్ నబిన్

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై అధికార భారతీయ జనతా పార్టీ (బిజెపి) తీవ్రంగా విరుచుకుపడింది. ఆయన వ్యాఖ్యలు దేశాన్ని అవమానించడమేనని పేర్కొంటూ, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్ తీవ్రంగా స్పందిస్తూ, 'ఆయన చేసిన వ్యాఖ్యలు ఆయన అరాచక మనస్తత్వాన్ని, స్వభావాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. ఎన్నికలలో తన పార్టీ ఓటమి పాలవ్వడం పట్ల ఆయనకున్న నిరాశ, నిస్పృహలను కూడా ఆ వ్యాఖ్యలు ప్రతి బింబిస్తున్నాయి" అని అన్నారు. "ఆయన మానసిక సమతుల్యతను కోల్పోతున్నారని కూడా తాను నమ్ముతున్నాను,' అని పేర్కొన్నారు. బిజెపి జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి, మాట్లాడుతూ, 'రాహుల్ గాంధీ ఆలోచనా విధానం అరాచకమైనది. రాహుల్ గాంధీ అచ్చం పట్టణ నక్సల్స్ లాగే మాట్లాడతారు. రాహుల్ గాంధీ 140 కోట్ల మంది దేశ ప్రజలను దేశద్రోహులుగా పిలిచారు. ఇవన్నీ రాహుల్ గాంధీ విధానం, ఉద్దేశం... తుక్డేతుక్డే గ్యాంగ్‌ను పోలి ఉన్నాయని స్పష్టం చేస్తున్నాయి. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలన్న, జెన్‌జెడ్‌ను రెచ్చగొట్టాలన్న తన ఉద్దేశం విఫలమవడంతో ఆయన నిరాశ చెందారు' అని అన్నారు.

### ప్రజా ఆగ్రహానికి ప్రతిబింబం: సమర్థించుకున్న కాంగ్రెస్

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు రాజకీయ చర్చకు దారితీయగా, కాంగ్రెస్ పార్టీ గాంధీ ప్రకటనలను సమర్థించుకుంటూ, దేశవ్యాప్తంగా ప్రజలు అనుభవిస్తున్న ఆగ్రహానికి, అసహనానికి అవి ప్రతిబింబమని నొక్కి చెప్పింది. న్యూఢిల్లీలో కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరా మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వానికి ఓటు వేసినవారితో సహా పౌరులందరిలోనూ విస్తృతమైన అసంతృప్తి నెలకొని ఉందని పేర్కొన్నారు. "సమాజంలోని ప్రతి వర్గంలోనూ దేశం పట్ల ఒక గాఢమైన ఆందోళన నెలకొని ఉంది. ప్రజలు, ముఖ్యంగా ఈ ప్రభుత్వానికి ఓటు వేసినవారు, తాము తీవ్రంగా మోసపోయామనే భావనతో ఉన్నారు. వారిలో తీవ్రమైన నిరాశ, విచారం, ఆగ్రహం అలుముకున్నాయి. ఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పార్టీగా, ఆ ఆగ్రహాన్ని తాము తప్పక వెలిబుచ్చాల్సి ఉంటుంది. ప్రభుత్వం గురించి వీధుల్లో ప్రజలు మాట్లాడుకుంటున్న మాటలతో పోలిస్తే, గాంధీ చెప్పిన మాటలు చాలా తక్కువ" అని ఖేరా అన్నారు. కాగా, ఇండియా బ్లాక్‌లో కాంగ్రెస్‌కు మిత్రపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ, రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై ఆచితూచి స్పందించింది. రాజకీయ ప్రసంగంలో అటువంటి భాషను తాము ఆమోదించబోమని స్పష్టం చేసింది. సమాజ్‌వాదీ పార్టీ ఎంపి అవధేష్ ప్రసాద్ మాట్లాడుతూ, 'అది ఆయన సిద్ధాంతం. తాము అటువంటి భాషను ఉపయోగించలేము' అని అన్నారు.

# టివికె కూటమి ప్రభుత్వంలో తెరపైకి లుకలుకలు



- అన్నాడిఎంకెను కేబినెట్‌లోకి తీసుకుంటే మేం బయటకు వెళతాం:సిపిఎం
- విశ్వాసపరీక్షలో వారిచ్చిన మద్దతును మాత్రమే స్వీకరించామన్న టివికె
- అవినీతి ప్రక్షాళనపై విజయ్‌ఫోకస్.. లంచం అడిగిన విడియో అందిస్తే లక్ష బహుమతి

**చెన్నై, మే 20:** తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడి పట్టుమని పది రోజులు కూడా కాకముందే, దాని స్థిరత్వంపై ఆందోళనలు మొదలయ్యాయి. అధికార కూటమిలోని కీలక మిత్రపక్షమైన సీపీఎం చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత బలాన్నిచ్చాయి. అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను కూటమిలో చేర్చుకుంటే తమ మద్దతుపై పునరాలోచించాల్సి వస్తుందని సీపీఎం స్పష్టంగా హెచ్చరించింది. బుధవారం మీడియాతో మాట్లాడిన సీపీఎం నేతలు, అన్నాడీఎంకే వర్గాన్ని ప్రభుత్వంలో భాగం చేయడం ప్రజాతీర్పునకు విరుద్ధమని అన్నారు. ఇటీవలి ఎన్నికల్లో ప్రజలు డీఎంకే, అన్నాడీఎంకే రెండు పార్టీలనూ తిరస్కరించారని గుర్తుచేశారు. అన్నాడీఎంకేను చేర్చుకోవడం విజయ్ ఇచ్చిన క్లీన్ గవర్నెన్స్ హామీకి కూడా వ్యతిరేకమని తెలిపారు. తమిళనాడు మరో ఎన్నికను ఎదుర్కోకూడదని, గవర్నర్ పాలన ద్వారా బీజేపీ వెనుక దారిలో అధికారంలోకి రాకూడదనే ఉద్దేశంతోనే మేము టీవీకేకు మద్దతిస్తున్నామని సీపీఎం వివరించింది. ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు మే 4న వెలువడగా విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం 234 స్థానాలకు గానూ 108 స్థానాలు గెలుచుకుంది. మెజారిటీకి 10 సీట్లు తక్కువయ్యాయి. ఆ తర్వాత కాంగ్రెస్ 5, లెఫ్ట్ ఫ్రంట్, వీసీకే, ఐయూఎంఎల్ (8) పార్టీల మద్దతుతో విజయ్ ప్రభుత్వం ఏర్పడింది. ఈనెల 13న జరిగిన విశ్వాస పరీక్షలో విజయ్‌కు 144 మంది ఎమ్మెల్యేల మద్దతు లభించింది. ఇందులో పార్టీ అధినేత పళనిస్వామి విప్‌ను ధిక్కరించి 24 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు విజయ్‌కు ఓటు వేశారు. వారిపై అనర్హత వేటు వేయాలని అన్నాడీఎంకే చర్యలు చేపట్టింది. విశ్వాస పరీక్షకు ముందు విజయ్ ఈ రెబల్ ఎమ్మెల్యేలతో సమావేశం కావడం గమనార్హం. ఇప్పుడు వారి మద్దతే అధికార కూటమిలో సీపీఎం రూపంలో కొత్త తలనొప్పికి కారణమైంది.

**అన్నాడిఎంకెను ప్రభుత్వంలోకి తీసుకురావడంలేదు!**

విశ్వాసపరీక్షలో టివికెకు మద్దతు పలికిన అన్నాడిఎంకె ఎమ్మెల్యేలను కేబినెట్‌లోకి తీసుకోవడం లేదని విజయ్ పార్టీ టివికెప్రకటించింది. ఇందుకు సంబంధించి మంత్రి అధవ్ అర్జున్ స్పష్టత ఇచ్చారు. ఇప్పటికిప్పుడు అప్రతిపాదన ఏదీలేదని, ముందుగా మద్దతు ప్రకటించిన పార్టీలతోనే తమ అధినేత ముందుకు వెళతారని, ఇదే తమ పార్టీ నిర్ణమని అధవ్ అర్జున్ ప్రకటించారు.

**అవినీతిపై ఫిర్యాదుచేస్తే రూ.1లక్ష బహుమతి..**

ఇదిలా ఉంటే విజయ్ తన సరికొత్తపంథాలో ముందుకు పోతున్నారు. అవినీతిని సమూలంగా ప్రక్షాళనచేసే లక్ష్యంతో ఎవ్వరైనా సరే ప్రభుత్వశాఖల్లో కనీసం రూ.1000 లంచం అడిగినా ఫిర్యాదు చేయాలని కోరారు. ఇలా ఫిర్యాదుచేసిన వారికి విచారణలో లంచం రుజువైతే వారికి లక్ష రూపా యలు బహుమతి ఇస్తామని ప్రకటించడంతో ఇపుడు ప్రభుత్వశాఖల్లో వణుకు ప్రారంభం అయింది. ప్రభుత్వ అధికారి కనీసం వెయ్యి రూపాయల లంచం డిమాండ్ చేసినా సరే, బాధితులు ఫిర్యాదు చేయవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. బాధితులు చేయాల్సిందల్లా లంచం అడుగుతున్న అధికారి వీడియోను రహస్యంగా చిత్రీకరించి, దానిని ఆధారంగా చూపిస్తూ అవినీతి నిరోధక శాఖకు (ఏసీబీ) రిపోర్ట్ చేయడమే. ఫిర్యాదులో నిజానిజాలు నిర్ధారించుకున్న తర్వాత సమాచారం అందించిన వారికి లక్ష రూపాయల బహుమతిని అందజేస్తారు.

# మంత్రులకు శాఖలు కేటాయించిన సిఎం సతీశన్!



**తిరువనంతపురం,మే 20:** కేరళంలో కొత్తగా ఏర్పాటైన యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం క్యాబినెట్ మంత్రులకు శాఖలను కేటాయించింది. ముఖ్యమంత్రి వి.డి.సతీశన్ ఆర్థిక, న్యాయ, సాధారణ పరిపాలన, ఓడరేవుల వంటి ప్రధాన శాఖలను తన వద్దే ఉంచుకున్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రమేశ్ చెన్నితాలకు కీలకమైన హోంశాఖ, విజిలెన్స్ శాఖలతో పాటు మరో మూడు శాఖలను కేటాయించారు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్)కు చెందిన పి.కె.కున్హాలికుట్టికి పరిశ్రమలు, సమాచార సాంకేతికత, వస్త్ర పరిశ్రమలు సహా ఏడు శాఖలను అప్పగించారు. కేరళం కాంగ్రెస్ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌కు విద్యుత్, పర్యావరణ శాఖలను కేటాయించగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కె.మురళీధరన్‌కు ఆరోగ్య, దేవస్వం శాఖలను ఇచ్చారు. రోజి ఎం.జాన్‌కు ఉన్నత విద్యా శాఖను అప్పగించగా ఎ.పి.అనిల్ కుమార్‌కు ల్యాండ్, రెవెన్యూ శాఖలను అప్పగించారు. రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ ఎమ్మెల్యే శిబు బేబీ జాన్‌కు అటవీ, వన్యప్రాణుల సంరక్షణ, నైపుణ్యాభివృద్ధి శాఖలను కేటాయించారు. నీటిపారుదల, భూగర్భ జలాలు, నీటి సరఫరా, పారిశుద్ధం, గృహనిర్మాణ శాఖలను కేరళ కాంగ్రెస్ (జోసెఫ్) శాసనసభ్యుడు మోన్స్ జోసెఫ్‌కు అప్పగించారు. ఈ నెల 18న కేరళం కొత్త ముఖ్యమంత్రిగా వి.డి.సతీశన్ ప్రమాణస్వీకారం చేయగా ఆయనతోపాటు మరో 20 మంది మంత్రులుగా ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే.

# మైనార్టీలు, చిరువ్యాపారులను టార్గెట్‌చేస్తున్న బిజెపి

### మాజీ సిఎం మమతా బెనర్జీ

**కోల్‌కత్తా, మే 20:** బీజేపీపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీ త్వరలోనే కేంద్రంలో అధికారం కోల్పోవడం ఖాయమని ఆమె జోస్యం చెప్పారు. మంగళవారం తన నివాసంలో టీఎంసీ ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా ఏర్పడిన సువేందు అధికారి నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం మైనారిటీలు, వీధి వ్యాపారులను లక్ష్యంగా చేసుకుంటోందని మమత ఆరోపించారు. మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయి. వీధి వ్యాపారుల దుకాణాలను బుల్డోజర్లతో కూల్చివేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం మన రాజ్యాంగ విలువలను కాలరాస్తోందని ఆమె విమర్శించారు. ఇదే సమావేశంలో పాల్గొన్న టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అభిషేక్ బెనర్జీ కూడా బీజేపీకి సవాల్ విసిరారు. తన ఇంటిలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలంటూ కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ ఇచ్చిన నోటీసులపై ఆయన ఘాటుగా స్పందించారు. వారు నా ఇల్లు కూల్చినా సరే ఇలాంటి బెదిరింపులకు నేను తలొగ్గేది లేదు. ఏదేమైనా బీజేపీపై నా పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ నోటీసులు జారీ చేసిన కేఎంసీ ఇప్పటికీ టీఎంసీ నియంత్రణలోనే ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా సీఎం సువేందు అధికారిపై అభిషేక్ పరోక్షంగా విమర్శలు చేశారు. కెమెరా ముందు డబ్బులు తీసుకుంటూ పట్టుబడిన వ్యక్తి ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యారని 2014 నాటి నారద స్టింగ్ ఆపరేషన్‌ను ప్రస్తావిస్తూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం సృష్టిస్తున్న బుల్డోజర్ వ్యతిరేకంగా భారీ నిరసన.

# జమిలి ఎన్నికలతో రూ.7లక్షల కోట్ల ప్రజాధనం ఆదా :జెపిసి ఛైర్మన్ ఎంపి పిపి చౌదరి!

**గాంధీనగర్, మే 20:** దేశంలో ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని అమలు చేస్తే సుమారు రూ.7 లక్షల కోట్ల ప్రజాధనం ఆదా అవుతుందని పార్లమెంటరీ సంయుక్త కమిటీ (జేపీసీ) ఛైర్‌పర్సన్, లోక్‌సభ ఎంపీ పీపీ చౌదరి తెలిపారు. ఈ విధానం వల్ల దేశ జీడీపీ వృద్ధి రేటు 1.5 శాతం నుంచి 1.6 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. మంగళవారం గాంధీనగర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.దేశంలో నిరంతరం ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతుండటంతో దేశం ఖఎన్నికల మోడ్ఖలోనే ఉంటోందని, దీనివల్ల పాలన, అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని చౌదరి అన్నారు. 1967 వరకు లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు జరిగేవని, కానీ కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలు ముందుగా రద్దు కావడంతో ఈ క్రమం తప్పిందని గుర్తుచేశారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించి, ఆ తర్వాత 100 రోజుల్లోగా పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికలను పూర్తి చేయాలని తమ కమిటీ సిఫార్సు చేస్తోందని వివరించారు. తరచూ ఎన్నికల వల్ల ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులను ఎన్నికల విధులకు కేటాయించాల్సి వస్తోందని, దీనివల్ల పాలనాపరమైన పనులు, విద్యార్థుల చదువులు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యాటకంపై ఆధారపడిన ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ ఎన్నికల వల్ల నష్టపోతోందని పేర్కొన్నారు. జమిలి ఎన్నికల ప్రతిపాదన రాజ్యాంగ మౌలిక స్వరూపానికి గానీ, సమాఖ్య వ్యవస్థకు గానీ విరుద్ధం కాదని మాజీ ప్రధాన న్యాయమూర్తులు, సీనియర్ న్యాయ నిపుణులు అభిప్రాయపడినట్లు చౌదరి తెలిపారు. దేశవ్యాప్తంగా విస్తృత సంప్రదింపుల తర్వాత 18వేల పేజీలకు పైగా నివేదికను సిద్ధం చేస్తున్నామని, పార్టీ రాజకీయాలకు అతీతంగా జాతీయ ప్రయోజనాలే లక్ష్యంగా ఈ ప్రయత్నం చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

# ఈశాన్యంలోని 'చికెన్‌నెక్' భూమి కేంద్రానికి బదలీ!

### పశ్చిమబెంగాల్ ప్రభుత్వం సంచలన నిర్ణయం




**కోల్‌కత్తా, మే 20:** పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం చికెన్స్ నెక్‌గా పిలిచే సిలిగురి కారిడార్‌లోని 120 ఎకరాల భూమిని కేంద్రానికి బదిలీ చేయాలని నిర్ణయించింది. దేశంలోని మిగిలిన ప్రాంతాలను ఈశాన్య భారత్‌తో కలిపే ఏకైక భూమార్గం సిలిగురి కారిడార్. సంఘర్షణ లేదా సంక్షోభ సమయాల్లో భారతదేశానికి కాకుండా బంగ్లాదేశ్‌కు ఇది మద్దతుగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో సీఎం సువేంద్ అధికారి నేతృత్వంలోని బెంగాల్ ప్రభుత్వం ఏడు జాతీయ రహదారులను నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా,నేషనల్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు అప్పగించాలని నిర్ణయించింది. క్యాబినెట్ సూత్రప్రాయంగా ఆమోదం తెలపడంతో పలు జాతీయ రహదారి ప్రాజెక్టులపై దీర్ఘకాలంగా నెలకొన్న ప్రతిష్టంభన తొలగిపోయింది. హైవే 31,32,32తో సహా కీలక రహదారుల బాధ్యత ఇకపై హైవే అథారిటీ పరిధిలోకి వెళ్తాయి. సేవక్-కరోనేషన్ బ్రిడ్జ్ మార్గం, హసిమారా-జైగావ్ మార్గం, చాంగ్రాబంధా కారిడార్ వంటి ప్రాజెక్టులను హైవే అథారిటీ పర్యవేక్షిస్తుంది. ఈ ప్రాజెక్టులు దాదాపు ఏడాదిగా రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాయని సమాచారం. ఇప్పుడు అనుమతి లభించడంతో కేంద్ర సంస్థలు రహదారి అభివృద్ధి పనులను వేగవంతం చేయగలవు.



# బ్రిటన్ రాయల్ సొసైటీలో సౌమ్యస్వామినాథన్‌కు అరుదైన గౌరవం

**బ్రిటన్, మే 20:** భారత రత్న ఎంఎస్ స్వామినాథన్ అడుగుజాడల్లోనే ఆయన కూతురు సౌమ్య స్వామినాథన్ వెళుతున్నారు. తండ్రికి తగ్గ తనయగా అవతరించారు. బ్రిటన్‌కు చెందిన ద రాయల్ సొసైటీలో ఆమె అత్యంత అరుదైన గౌరవం దక్కింది. ఫెలో ఇన్ రాయల్ సొసైటీగా సౌమ్య స్వామినాథన్ ఎంపికయి భారతీయ ప్రఖ్యాత శాస్త్రవేత్తల్లో ఆమె నిలిచారు. రాయల్ సొసైటీ ఫెలోగా ఆమెను మంగళవారం ఎంపిక చేశారు. రాయల్ సొసైటీ ప్రపంచంలోనే ఓల్డెస్ట్ సైంటిఫిక్ అకాడమీ. అత్యంత ప్రతిభావంతులైన సైంటిస్టులకు మాత్రమే ఆ సొసైటీలో ఫెల్లోగా ఎంపికయ్యే అవకాశం దక్కుతుంది. రాయల్ సొసైటీలో సౌమ్య తండ్రి ఎంఎస్ స్వామినాథన్ కూడా ఫెలోషిప్ అర్హత సాధించారు. ఐజాక్ న్యూటన్ లాంటి శాస్త్రవేత్తలు ఉన్న రాయల్ సొసైటీ లీగ్‌లో సౌమ్య చేరారు. రాయల్ సొసైటీ ఫెలోషిప్‌కు సౌమ్య ఎంపికైన విషయాన్ని సీఎస్ఐఆర్ మాజీ అధ్యక్షుడు రఘునాత్ మస్లేకర్ ప్రకటించారు. ఎఫ్ఆర్ఎస్‌గా డాక్టర్ సౌమ్య స్వామినాథన్ ఎంపికైనట్లు ఆయన తెలిపారు. శాస్త్రవేత్తలకు లభించే అత్యంత ఉన్నత గౌరవం ఇదే అని ఆయన అన్నారు. సౌమ్య తండ్రి భారత రత్న ఎంఎస్ స్వామినాథన్ కూడా ఎఫ్ఆర్ఎస్‌గా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. భారత్‌కు చెందిన తండ్రీకూతుళ్లు రాయల్ సొసైటీ ఫెలోషిప్ సాధించడం ఇదే మొదటిసారి అన్నారు. రాయల్ సొసైటీ 1660లో స్థాపించారు. శాస్త్రవేత్తలను గుర్తించడం, సైన్స్‌ను ప్రమోట్ చేయడం, ఆ రంగంలోని నిష్ణాతులను గౌరవించడం లాంటి కార్యక్రమాలను రాయల్ సొసైటీ చేస్తోంది. మానవాళికి ఉపయోగపడే సైన్స్‌ను వృద్ధి చేస్తోంది. సుమారు 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఆ సొసైటీలో అర్హత సాధించిన భారతీయ రెండో మహిళా శాస్త్రవేత్తగా సౌమ్యా స్వామినాథన్ నిలిచారు. ఎఫ్ఆర్ఎస్ పొందిన తొలి మహిళా శాస్త్రవేత్తగా ప్రొఫెసర్ గగన్‌దీప్ కంగ్‌కు ఉంది. 2019లో ఆమె ఆ సొసైటీకి ఎంపికయ్యారు. ప్రఖ్యాత సైంటిస్టులు, ఇంజినీర్లు, టెక్నాలజిస్టులకు రాయల్ సొసైటీలో ఫెలోషిప్ కల్పిస్తారు.

# సంక్షిప్తంగా..

## విజయవంతంగా 'సూర్యాస్త్ర' పరీక్ష



**న్యూఢిల్లీ, మే20:** స్వదేశీ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా భారత్ మరో ముందడుగు వేసింది. ప్రైవేట్ రంగ రక్షణ సంస్థ అయిన నిబే లిమిటెడ్ తన సుదూర రాకెట్ వ్యవస్థ సూర్యాస్త్ర ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఒడిశాలోని చాందీపుర్ టెస్టింగ్ రేంజ్ నుంచి ఈ పరీక్షను చేపట్టింది. 150-300 కి.మీ. దూరంలోని లక్ష్యా లపై దాడి చేయగల రెండు రకాల సూర్యాస్త్ర రాకెట్ వేరియంట్లను పరీక్షించింది. 1.5 మీటర్ల నుంచి 2 మీటర్ల కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేధించినట్లు అధికారులు వెల్లడించారు. దీనిని కొనుగోలు చేయడానికి భారత సైన్యం ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. సూర్యాస్త్ర అనేది సుదూర గైడెడ్ రాకెట్ ఫిరంగి వ్యవస్థ. శత్రు భూభాగంలోని స్థావరాలు, కమాండ్ సెంటర్లు, రాడార్ కేంద్రాలు లాజిస్టిక్స్ హాబ్‌లపై దాడులు చేయడానికి దీనిని రూపొందించారు.

## డ్రోన్ ద్వారా యుఎల్‌పిజిఎం-వి3 క్షిపణి పరీక్ష



**న్యూఢిల్లీ, మే 20:** డిఆర్డీవో కీలక పరీక్ష చేపట్టింది. యుఎల్‌పిజిఎం-వి3 క్షిపణిని విజయవంతంగా టెస్ట్ చేసింది. గగనతలం నుంచి భూమిపై, గగనతలం నుంచి గగనతలంలో ఉన్న టార్గెట్లను ఆ డ్రోన్ మిస్సైల్ ద్వారా పేల్చేశారు. కర్నూలు జిల్లాలోని డిఆర్‌డీవో రేంజ్ సెంటర్‌లో ఈ పరీక్ష చేపట్టారు. ఇంటిగ్రేటెడ్ గ్రౌండ్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా ఈ పరీక్ష నిర్వహించారు. యుఎల్‌పిజిఎం వెపన్ సిస్టమ్‌ను జీసిఎస్ కమాండ్, కంట్రోల్ ద్వారా వినియోగించనున్నట్లు రక్షణశాఖ ప్రతినిధి తెలిపారు. జిసిఎస్ టెక్నాలజీతో లాంచ్ ఆపరేషన్స్ నిర్వహించారు. హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్, అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ అండ్ టెక్నాలజీ లిమిటెడ్ కంపెనీలతో కలిసి డిఆర్డీవో పనిచేసింది.

## పాక్ రాజకీయాలు అక్కడి ప్రజలకు సంబంధించినవే: అమెరికా

**న్యూఢిల్లీ, మే 20:** పాకిస్థాన్ ప్రధాని పదవి నుంచి ఇమ్రాన్ ఖాన్‌ను తొలగించడం వెనుక అమెరికా హస్తం ఉందంటూ ఇటీవల వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే వీటిపై తాజాగా అమెరికా విదేశాంగశాఖ స్పందించింది. ఇమ్రాన్‌ను పదవి నుంచి తొలగించిన విషయంలో తమకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొంది. పాక్ దౌత్యవేత్త అసద్ మజీద్‌ఖాన్, అమెరికా నాటి అసిస్టెంట్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ డొనాల్డ్ లూ మధ్య జరిగిన సంభాషణను పాక్ ఇన్వెస్టిగేటివ్ పత్రిక ప్రచురించింది. దీనిపై అమెరికా విదేశాంగ ప్రతినిధి ఒకరిని మీడియా ప్రశ్నించగా ఇమ్రాన్ తొలగింపు వెనుక అమెరికా హస్తం ఉందనే వార్తలను ఆయన తోసిపుచ్చారు. పాక్ రాజకీయాలు అక్కడి ప్రజలకు సంబంధించివేనని స్పష్టం చేశారు.

## పార్లే ఇండస్ట్రీ షేర్లు పెంచేసిన మోడీ 'మెలోడి' గిఫ్ట్!

**న్యూఢిల్లీ, మే 20:** ప్రధాని నరేంద్ర మోడీ ఇటలీ ప్రధాని మెలోనికి పార్లే మెలోడీ చాక్లెట్ గిఫ్ట్ ఇచ్చిన వీడియో సోషల్ మీడియాను కుదిపేసింది. అయితే ఈ వైరల్ వీడియో స్టాక్ మార్కెట్‌లో ఊహించని అలజడి సృష్టించింది. ఒకేలా ఉన్న పేరును చూసి ఇన్వెస్టర్లు తొందరపడి తప్పుడు కంపెనీ షేర్లను కొనేశారు. మోడీ చాక్లెట్ ప్యాకెట్ ఇచ్చిన వీడియో బయటకు వచ్చిన కొన్ని గంటల్లోనే దలాల్ స్ట్రీట్‌లో హాల్‌చల్ మొదలైంది. పార్లే ఇండస్ట్రీస్ అనే కంపెనీ షేర్లు ఇంట్రాడేలో దాదాపు 5 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. గత వారం రోజులుగా ఈ పెన్నీ స్టాక్ ఏకంగా ఏడు శాతం లాభపడింది. అంతా బానే ఉన్నా ఇక్కడే ఒక పెద్ద ట్విస్ట్ ఉంది. కంపెనీ వేరు చాక్లెట్ వేరు, మనందరికీ తెలిసిన ఫేమస్ మెలోడీ చాక్లెట్‌ను తయారు చేసేది పార్లే ప్రొడక్ట్స్ అనే ఎఫ్ఎమ్‌సీజీ సంస్థ.

## ట్రంప్ అధికారాలకు కత్తెరవేసే తీర్మానానికి ఆమోదం!

**వాషింగ్టన్, మే 20:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సొంత పార్టీలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై సైనిక చర్యలకు దిగే విషయంలో అధ్యక్షుడి అధికారాలను నియంత్రించేందుకు ఉద్దేశించిన వార్ పవర్స్ తీర్మానాన్ని అమెరికా సెనేట్ ఆమోదించింది. ముందురోజు జరిగిన ఓటింగ్‌లో 55-45 ఓట్ల తేడాతో ఈ తీర్మానం నెగ్గింది. అధికార రిపబ్లికన్ పార్టీకి చెందిన 8 మంది సెనేటర్లు డెమోక్రాట్లతో కలిసి ఈ తీర్మానానికి మద్దతు పలకడం అధ్యక్షుడికి పెద్ద షాక్‌గా మారింది. ఇరాన్ టాప్ జనరల్ ఖాసీం సులేమానీపై డ్రోన్ దాడికి ట్రంప్ ఏకపక్షంగా ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ అనుమతి లేకుండా ఇరాన్‌తో యుద్ధానికి దిగకుండా అధ్యక్షుడిని నిరోధించాలనే లక్ష్యంతో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

# రాష్ట్రంలో మద్యం ధరల పెంపు

## త్వరలో ఆదేశాలు వెలువడే అవకాశం

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** మద్యం ప్రియుల జేబులకు భారీ చిల్లు పడనుంది. మద్యం ధరలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. జూన్ 2వ తేదీ (తెలంగాణ అవతరణ దినోత్సవం) తర్వాత పెరిగిన ధరలను అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోబోతున్నట్లు సమాచారం. రాష్ట్రంలో విక్రయించే అన్ని రకాల మద్యం బ్రాండ్లపై కనీసం 10 శాతం నుండి 15 శాతం మేర ధరలను పెంచే యోచనలో ప్రభుత్వం ఉంది. దీనివల్ల సాధారణ, మీడియం బ్రాండ్లతో పాటు ప్రీమియం బ్రాండ్ల ధరలు కూడా గణనీయంగా పెరగనున్నాయి. పెరిగిన ధరల ద్వారా ప్రభుత్వ ఖజానాకు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ఆర్థిక, అబ్కారీ శాఖలు భావిస్తున్నాయి. మద్యం ధరల మార్పులు, ఆదాయ వనరుల పెంపుపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం గతంలోనే ఒక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇప్పటికే ప్రభుత్వానికి తన కీలక ప్రతిపాదనలను (రిపోర్టును) అందజేసింది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, పొరుగు రాష్ట్రాల్లోని ధరలను బట్టి తెలంగాణలో మద్యం రేట్లను ఏకంగా 25 శాతం నుండి 30 శాతం వరకు పెంచవచ్చని ఈ కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. త్రిసభ్య కమిటీ 25 నుంచి 30శాతం పెంపును ప్రతిపాదించినప్పటికీ, ప్రజల నుంచి వచ్చే వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మాత్రం 10 నుండి 15శాతం మధ్యలోనే ధరల పెంపును పరిమితం చేసే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ధీరత్వానికి నిదర్శనం ప్రకాశం పంతులు



ప్రకాశం పంతులు విగ్రహానికి పుష్పాంజలితో ఘననివాళులర్పిస్తున్న వెంకయ్యనాయుడు, ప్రసాద్‌కుమార్, హనుమంతరావు, పద్మరాజు, శ్రీరామ్, మోహన్‌రావు తదితర ప్రముఖులు

**రవీంద్రభారతి, మే 20 ప్రభాతవార్త :** టంగుటూరి ప్రకాశం పంతులు పట్టుదల, త్యాగనిరతి, ధీరత్వానికి నిలువెత్తు నిదర్శనం, తెలుగు ప్రజలు ఎన్నటికీ మర్చి పోలేరని, ఆయన ముందుతరాలకు ఆదర్శమనిపూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు అన్నారు. ప్రకాశం పంతులు 69వ వర్ధంతిని పురస్క రించుకొని రవీంద్రభారతి కూడలి వద్దనున్న ఆయన విగ్రహానికి వెంకయ్య నాయుడు, తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, తెలంగాణ ప్రభుత్వ బిసి సంక్షేమశాఖ సలహాదారు వి.హనుమంతరావు, ప్రభుత్వ మాజీవిప్ రుద్రరాజు పద్మరాజు, సిడబ్ల్యుఎస్ సభ్యుడు రుద్రరాజు, ప్రకాశం పంతులు అభివృద్ధి అధ్యయన సంస్థ సభ్యులు ఛైర్మన్ సి.మోహన్‌రావు, వైస్‌ఛైర్మన్ ఎం.పి. నరసింహారావు, సిబిఎస్.రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీరామ్, కార్యదర్శి నిరంజన్ దేశాయ్, కోశాధికారి హనుమంతరావు, రాధాకృష్ణరావు, రాజశేఖర్, రంగనాథ్, రామ్మోహన్‌రెడ్డి, టీ.వి.రావు, డి.వి.సుబ్బారావు, సుబ్రహ్మణ్య ప్రసాద్, కె.చంద్రశేఖర్ తదితరులతో కలిసి పూలమాలవేసి ఘననివాళులర్పించారు. ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ నేటితరానికి ప్రకాశం పంతులు ఎంతో ఆదర్శమని, అలాంటి మహనీయుల ఆశయాలకు అనుగుణంగా ప్రతీఒక్కరూ పనిచేయాలన్నారు. పంతులు ధైర్యానికి, సేవాతత్వగుణం, మానవత్వానికి నిదర్శ నమని వి.హనుమంతరావు కొనియాడారు.



సమావేశంలో పాల్గొన్న వి హెచ్, ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు

# మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

## బిసి సంక్షేమ శాఖ సలహాదారుడు వి.హనుమంతరావు

**హైదరాబాద్, మే 20 ప్రభాతవార్త:** మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని, మహిళా కాంగ్రెస్ విభాగం ద్వారానే మహిళా సాధికారత సాధ్యమవుతుందని బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు వి. హనుమంతరావు అన్నారు. బుధవారం అంబర్‌పేట్ నియోజకవర్గంలోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో ఖైరతాబాద్‌జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమంతరావుతో పాటు తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిత్ ముఖ్య అతిథులుగా హాజ రయ్యారు. ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మహిళా విభాగం మరింత చురుగ్గా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మహిళా కాంగ్రెస్ పాత్ర అత్యంత కీలకమన్నారు. ఖైరతాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యేవిజయారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని విమర్శించారు. జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా, సామాజికంగా ఎదగాలనే ఉద్దేశంతోనే 1984సెప్టెంబర్ 15న నాటి ప్రధాని ఇందిరా గాంధీ మహిళా కాంగ్రెస్ విభాగాన్ని అధికారికంగా ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి, కార్వాన్, ఆసిఫ్ నగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యేలు ఫెరోస్ భాయ్, ఉస్మాన్ భాయ్, వినోద్, కల్లుగీత కార్మిక కార్పొరేషన్ వైస్ ఛైర్మన్ కేశం నాగరాజు గౌడ్, బోయిన్‌పల్లి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దుర్గేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ మహిళా ప్రతినిధులు సుగుణ, అంజలి, వెంకట సుబ్బమ్మ, రజిత, నర్మదా సింగ్, అస్మా, నీలం పద్మ, లక్ష్మి ౹ౣ, జ్యోతి, కవిత, పీసీసీ ప్రతినిధులు ఆర్. లక్ష్మణ్ యాదవ్, శంభుల శ్రీకాంత్ గౌడ్, రాజేష్ అగర్వాల్, రషీద్ ఖాన్, మాజీ కార్పొరేటర్లు దిండి రాంబాబు, గడిగంటి రమేష్, పులి జగన్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట దేవస్థాన వేదపండితుడు వేణుగోపాలాచార్యులు గుండెపోటుతో మృతి



**యాదగిరిగుట్ట,మే 20ప్రభాతవార్త:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర సింహస్వామి దేవస్థానంలో గత 30 సంవత్సరాలుగా వేదపండితులుగా విధులు నిర్వహిస్తున్న కొడకండ్ల వేణుగోపాల ఆచార్యులు(58) బుధవారం గుండె పోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన యధా విధిగా బుధ వారం ఉదయం విధులు యధా విధిగా నిర్వహించి ఇంటికి వెళ్ళగానే చాతిలో నొప్పి వచ్చినట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. వెంటనే భువనగిరి ఆసుపత్రికి చేరుకునే లోపు దారి మధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈయన మరణం దేవస్థానానికి తీరనిలోటు అని దేవస్థానానికి ఈవో భవాని శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు.

# పిఎసిఎస్‌లకు నామినేటెడ్ పద్ధతిలో నూతన కమిటీలు

# 12మందితో పాలకవర్గం ఏర్పాటు

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పిఎసిఎస్)లలో ఇప్పటి వరకు ఎన్నికల విధానం ఉండగా ఇక నుంచి నామినేటెడ్ పద్ధతిలో ఖాళీలను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో సహకార సంఘాల భర్తీపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకున్నది. ఆయా జిల్లాలకు చెందిన మంత్రులు, అర్హులైన వారి జాబితాలను ఈ నెలాఖరులోగా అందించాలని ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా 906 సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘానికి చైర్మన్‌తోపాటు 12 మంది సభ్యులతో పాలకవర్గాన్ని నియమించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పొరుగు రాష్ట్రం ఏపీలో అమలులో ఉన్న విధానాన్నే ఇక్కడ పరిగణనలోకి తీసుకున్నట్టు ప్రచారం జరుగుతున్నది. పాలకవర్గంలో ఒక ఎస్సి మహిళ, ఒక ఎస్టి మహిళ, ఇద్దరు బిసి జనరల్, ఒక ఒసి మహిళ, మరో ఏడుగురు జనరల్ సభ్యులు ఉంటారు. పదవుల్లో నియమితులయ్యే వారు ఆయా సంఘాల్లో సభ్యులై ఉండాలి. గతంలో రుణాలు తీసుకుని చెల్లించకుంటే అర్హులు కాదు. ప్రభుత్వ ఉద్యోగులు, పంచాయతీ రాజ్ సంఘాల్లో, ఇప్పటికే ఎన్నికైన ప్రజాప్రతినిధులకు అవకాశం లేదు.

**రెండు విడతల్లో భర్తీ:** పాలకవర్గాలను రెండు దశల్లో భర్తీ చేయనున్నట్లు తెలిసింది. ముందుగా పాత సంఘాలకు పాలకవర్గాలను ఏర్పాటు చేసి, రెండో విడతలో కొత్తవాటికి నియమించనున్నారు. గతంలో ఏర్పాటు చేసిన సంఘాల విస్తరణలో తీవ్రమైన అసమానతలు నెలకొన్నాయి. కొన్ని చోట్ల రెండుగ్రామాలకు ఒక సంఘం ఉంటే మరికొన్ని చోట్ల 30గ్రామాలకు కలిపి ఒకటే సంఘం ఉంది. సభ్యత్వ పరంగా ఒక సంఘంలో 500 మంది ఉంటే, మరికొన్నింటిలో 2,500 మంది రైతులు ఉన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 81 మండలాల్లో ఒక్క సహకార సంఘం లేదు. ఈ వ్యత్యాసాలను గమనించిన ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి 31 జిల్లాల నుంచి వచ్చిన 215 ప్రతిపాదనలను పరిశీలించి, 131 మండలాలకు సహకారశాఖ జాబితా సిద్ధం చేసింది. కొత్త సంఘాలు ఏర్పాటు చేస్తే రైతులు బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే పంట రుణాలు పొందే అవకాశముంది. రాష్ట్రంలో మొన్నటి వరకు పిఎసిఎస్ కేంద్రాలకు పర్సన్ ఇన్‌చార్జీలు ఉండడంతో రైతులకు అరకొరగా సేవలందాయి. కొత్త పాలకవర్గం కొలువుదీరితే రైతులకు సకాలంలో వ్యవసాయ రుణాలు ఇవ్వడంతోపాటు ఎరువుల విక్రయాలు, ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరుగుతాయి. డిసిసిబి నుంచి వ్యవసాయ భూములపై మార్ట్‌గేజ్, వ్యవసాయ యాంత్రీకరణ, పశుపోషణ, బంగారంపై రుణాలు అందుతాయి.

పిఎసిఎస్‌ల ఆధ్వర్యంలో ఎరువుల విక్రయాలు సాగుతున్నాయి. ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా, కాంప్లెక్స్ ఎరువుల ధరలు అధికంగా ఉండడంతో రైతులు ప్రాథమిక సహకార సంఘాల్లో కొనుగోలు పెరుగుతుంది. యూరియా 80 శాతం మేర సొసైటీల నుంచే రైతులకు అందుతుంది. పీఏసీఎస్ కేంద్రాలు ఏటా 5 వేల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు కూడా నిర్వహిస్తున్నాయి. రాయితీపై వరి, కంది, పెసర, మినుము, జనుము, జీలుగవిత్తనాలను కూడా విక్రయిస్తున్నాయి. పలు రకాల సేవలందిస్తుండటంతో త్వరగా భర్తీ చేసేందుకు సహకారం ఇప్పటికే నామినేటెడ్ విధానానికి సంబంధించిన నివేదికను అందజేసింది.

# కులగణనపై సుప్రీం తీర్పుతో కాంగ్రెస్ సంబురాలు

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం: పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్

కులగణనతో బలహీన వర్గాలకు న్యాయం : మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

జస్టిస్ సూర్యకాంత్‌కు 60కోట్ల బలహీనవర్గాల ప్రజలు రుణపడి ఉంటారు: ప్రభుత్వ సలహాదారు విహెచ్





**హైదరాబాద్,మే20,ప్రభాతవార్త:** జనగణనలో కుల గణన చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో హర్షం వ్యక్తంచేస్తూ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు ఆధ్వర్యంలో గాంధీ భవన్ లో బుధవారం సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గాంధీభవన్‌లో బాణసంచా కాల్చి, స్వీట్స్ పంచారు. గాంధీభవన్ ఎదురుగా రోడ్డుపై కూడా ప్రజలకు స్వీట్లు పంచుతూ "జ్యూడిషరీ జిందాబాద్" అంటూ నినాదాలు చేస్తూ అంబరాన్ని అంటే ఆనందం వ్యక్తంచేశారు. జనగణన ప్రక్రియలో కుల గణన కూడా చేపట్టాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఒక పత్రికా ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దేశంలోని సామాజిక, ఆర్థిక అసమానతలను సరిచేయడానికి కుల గణన అత్యంత అవసరమని కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశవ్యాప్తంగా కుల గణన అవసరాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారని, సామాజిక న్యాయం సాధనకు కుల గణన కీలకమని స్పష్టం చేశారని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలకు వారి జనాభా ప్రాతిపదికన న్యాయం జరగాలంటే సమగ్ర కుల గణన తప్పనిసరి అని కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతోందన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో చేపట్టిన కుల సర్వే విజయవంతమైందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించిన ఈ సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సంక్షేమ ఫలాల సరైన పంపిణీ కోసం కుల గణన ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో చేపట్టిన కుల సర్వే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా సమగ్ర కుల గణన నిర్వహించాలని టిపిసిసి అధ్యక్షులు డిమాండ్ చేశారు. కుల గణనతో బలహీనవర్గాలకు న్యాయం జరుగుతోందని బిసి సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సుప్రీం తీర్పును స్వాగతిస్తూ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కుల గణన నిర్వహించి ఎవరెంతో వారికంతా అనే సామాజిక న్యాయం తో ముందుకు పోతుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా దేశవ్యాప్తంగా తెలంగాణ తరహాలో కులగణ చేయాలని ఎప్పటి నుంచో కోరుతున్నారనీ సుప్రీం కోర్టు కూడా అదే అంశాన్ని ధృవీకరించిందని పొన్నం పేర్కొన్నారు. జన గణనలో కుల గణన చేస్తామని గతంలో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చి తరువాత కాలమ్ 13 లో బిసి ల అంశం చేర్చలేదని ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ గారి హైదరాబాద్ పర్యటన లో కాలమ్ 13 లో ఎస్‌సి ఎస్‌టి లతో పాటు బిసి గణన లెక్కించాలని కోరామని గుర్తు చేశారు. కుల గణన వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్ సుప్రీం కోర్టు కొట్టివేయడం సామాజి న్యాయానికి బలాన్నిచేదిగా ఉందన్నారు. కుల గణన నిర్వహించి బిసి లకు 42 శాతం రిజర్వేషన్ల చేయడానికి చట్టం చేశామని ఆ బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉందని కేంద్ర ప్రభుత్వం బిల్లు ఆమోదింప చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు జస్టిస్ సూర్యకాంత్‌కు దేశంలోని 60కోట్ల వెనుకబడిన వర్గాల ప్రజలు రుణపడి ఉంటామనీ తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు వి..హనుమంతరావు అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడతూ జ్యుడిషియరీ జిందాబాద్ అని నినదించారు. సుప్రీం కోర్టు తీర్పు చారిత్రాత్మకమైనది న్యాయ వ్యవస్థకు మా ధన్యవాదాలు అని హర్షం ప్రకటించారు. కులగణన చేయాలని రాహుల్ గాంధీ ఆలోచన చేశారనీ దానికి అనుగుణంగా రేవంత్ ప్రభుత్వం కులగణన చేసిందనీ వివరించారు. బిసిలు ఎదగడం మోదీ ప్రభుత్వానికి ఇష్టం ఉండదు మోదీ మాకు సలహాలు ఇవ్వాల్సిన అవసరం లేదని అన్నారు.

# సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం: జాజుల శ్రీనివాస్ గౌడ్



**హైదరాబాద్, మే 20,ప్రభాత వార్త:** జనగణనలో బీసీ కులగణన చేపట్టవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, సుప్రీంకోర్టు తీర్పు కులగనన వ్యతిరేకులకు చెంపపెట్టు లాంటిదని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా బీసీ జనాభాను లెక్కించాలని, జనాభాలో సగ భాగానికి పైగా ఉన్న బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు దక్కాలని తాము దశబ్దాలుగా, చేసిన పోరాట ఫలితమే ఈరోజు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అని ఆయన తెలిపారు. కులగణన చేస్తామని హామీ ఇచ్చి కేంద్ర ప్రభుత్వం బీసీలను మోసం చేయాలని చూసిందని, సుప్రీంకోర్టు తీర్పుతో నైనా కేంద్ర ప్రభుత్వం తమ మనసు మార్చుకుని ప్రస్తుతం మొదటి దప జరుగుతున్న కుటుంబాల లెక్కింపులో బీసీ కుటుంబాల లెక్కింపు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ జనాభా లెక్కలను సుప్రీంకోర్టు సమర్థించినందుకు సుప్రీంకోర్టుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# తీర్పు చరిత్రాత్మకం: ఎం.పి ఆర్.కృష్ణయ్య



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, మే 20 ప్రభాతవార్త :** జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా దాఖలైన రిట్ పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేయడం పట్ల రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ తీర్పు చరిత్రాత్మకమైనదని, ఇది కేంద్ర ప్రభుత్వానికి దక్కిన భారీ విజయమని ఆయన కొనియాడారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం జరగబోయే జనగణనలో కులగణనను వ్యతిరేకిస్తూ కొందరు అగ్రకులాల వారు వేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు ధర్మాసనం తప్పుపట్టిందని గుర్తుచేశారు. కులగణన అనేది కేంద్ర ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఇందులో కోర్టులు జోక్యం చేసుకోలేవని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. భారతీయ సమాజం కులం పునాదులపై నిర్మించబడిందని, ప్రజల సామాజిక, ఆర్థిక, జీవన విధానాలపై కుల ప్రభావం ఎంతైనా ఉందని సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం గట్టిగా వాదించిందని కృష్ణయ్య పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టడం లేదంటూ కొందరు ప్రతిపక్ష నాయకులు అనవసరంగా దుమ్మెత్తిపోశారని, తాజా తీర్పుతో వారి దుష్ప్ర చారానికి తెరపడిందని ఆర్.కృష్ణయ్య విమర్శిం చారు. ఈ సమావేశంలో బీసీనేతలు పర్లగోర్ల మోడీ రాందేవ్, భీమరాజు,నిఖిల్ పటేల్ పాల్గొన్నారు.

# మహిళల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం: మంత్రి కోమటిరెడ్డి



బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

**హైదరాబాద్,మే20,ప్రభాతవార్త:** మహిళ హక్కుల పరిరక్షణ కాంగ్రెస్ ప్రభుత్వంకు అత్యంత ప్రాధాన్యత అంశమని హక్కులతో పాటు ఆర్థికంగా మహిళ స్వాలంభన చెందాలనీ ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా ఇటీవల నియామకమైన గద్వాల విజయలక్ష్మి బుధవారం రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మహిళా కమిషన్ చైర్ పర్సన్, సభ్యులు గురువారం బాధ్యతల స్వీకరణ కార్యక్రమా నిర్వహిస్తున్నామని దానికి మంత్రిని గౌరవ అథితులుగా హాజరుకావాలని ఆమె ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహిళా కమిషన్ నూతన చైర్ పర్సన్,సభ్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రితోపాటు కొత్తగూడెం ఎమ్మెల్యే, కూనంనేని సాంబశివరావు, ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం,మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ మహిళా కమిషన్ అన్ని వర్గాల మహిళలపై ఏలాంటి వివక్ష లేకుండా ఉండేలా ముఖ్యంగా జండర్ సెన్సిటైజేషన్ చేయాలని ఆయన కోరారు.

# బిసి గురుకులాల్లో విద్యా ప్రమాణాల పెంపుపై నేడు కీలక సమావేశం

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** రానున్న విద్యా సంవత్సరంలో మహాత్మా జ్యోతిబాపూలే బిసి సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెరుగైన విద్యా ప్రమాణాలు, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఈ నెల 21న హైదరాబాద్‌లో సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బాల మాయాదేవి, కార్యదర్శి సైదులుతో కలిసి బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లకు సన్మానం చేయనున్నారు. వచ్చే విద్యా సంవత్సరం మరింత మెరుగైన ఫలితాలు సాధించడానికి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తీసుకోవాల్సిన అనేక చర్యలపై సమావేశంలో చర్చిస్తారు. ముఖ్యంగా పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలపై సమగ్ర విశ్లేషణ చేస్తూ తక్కువ ఫలితాలు సాధించిన పాఠశాలల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తారు. బిసి గురుకుల విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు, ఆహార నాణ్యత, విద్యా ప్రమాణాలు పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి పొన్నం దిశానిర్దేశం చేయనున్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపు, పోటీ పరీక్షలకు సన్నద్ధత, బోధనా విధానాల్లో మార్పులు వంటి అంశాలు చర్చకు రానున్నాయి. 5వ తరగతి ప్రవేశాలు, బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ, ఇంటర్మీడియట్, డిగ్రీ అడ్మిషన్‌ల అడ్మిషన్‌ల పరిస్థితిపై కూడా ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఈ సమావేశంలో చర్చకు రానున్న మరో ముఖ్యమైన అంశం మౌలిక సదుపాయల కల్పన, పాఠశాలల భవనాల పరిస్థితి. సొంత భవనాల్లో నడుస్తున్న పాఠశాలలు, అద్దె భవనాల్లో కొనసాగుతున్న విద్యాసంస్థల వివరాలను పరిశీలించనున్నారు. భవనాల మరమ్మతులు, భద్రతా ప్రమాణాలు, విద్యార్థుల వసతులపై సమీక్ష జరగనుంది. ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ పురోగతిపై అధికారులు ప్రత్యేకంగా చర్చించనున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పోషకాలతో కూడిన ఆహారం అందించేందుకు వీలుగా అమలు చేస్తున్న కామన్ డైట్ మెను అమలు కోసం తీసుకోవల్సిన జాగ్ర త్తలను సమీక్షిస్తారు. ఆహారం అందించడంలో ఎలాంటి సమస్యలు రాకుండా కిచెన్ ఆధునీకరణ, తాగునీటి కోసం వాటర్ ప్లాంట్లు గురించి తీసుకుంటున్న చర్యలను చర్చిస్తారు. ఆహార నాణ్యత, పోషకాహార ప్రమాణాలు, వంటశాలల నిర్వహణ వంటి అంశాలపై చర్చ జరగనుంది. విద్యార్థుల భద్రత కోసం సిసి కెమెరాలు, తరగతి గదుల్లో ఫర్నిచర్ తదితర అంశాలు సమీక్షిస్తారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు పదోతరగతి, ఇంటర్, డిగ్రీలో, పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిం చడంపై చర్చిస్తారు. విద్యార్థుల భద్రత, హాస్టళ్ల నిర్వహణ, క్రమశిక్షణ, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు.


# రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు: మహేష్ గౌడ్

**హైదరాబాద్,మే20,ప్రభాతవార్త:** భారత రత్న,మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఘన నివాళులు అర్పించారు. రాజీవ్ గాంధీ దేశ రాజకీ యాల్లో యువతకు కొత్త దిశా నిర్దేశం చేసిన దూరదృష్టి కలిగిన నాయకుడని కొనియాడారు. దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లాలన్న మహత్తర సంకల్పంతో సమాచార సాంకేతిక రంగానికి పునాది వేసిన నాయకుడు రాజీవ్‌గాంధీ అని పేర్కొన్నారు. టెలికాం విప్లవం, కంప్యూటరీకరణ, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, యువతకు ఓటు హక్కు వయస్సును 18 సంవత్సరాలకు తగ్గించడం వంటి ఎన్నో సంస్కరణలు ఆయన నాయకత్వంలో అమలయ్యాయని గుర్తుచేశారు. గ్రామీణాభివృద్ధి, విద్య, మహిళా సాధికారత, శాస్త్ర సాంకేతిక రంగాల పురోగతికి రాజీవ్ గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. దేశ సమగ్రత, లౌకికవాద పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం ఆయన జీవితాంతం కృషి చేశారని తెలిపారు.

# కొడుకుపై ఆరోపణలు వస్తే నేనే పోలీసులకు అప్పగించా

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**హైదరాబాద్, మే 20 ప్రభాతవార్త:** ఉరిశిక్ష వేసే ముందు మీ చివరి కోరిక ఏమిటని బిజెపిలో కమిట్ మెంట్‌తో పనిచేసే ఏ కార్యకర్తను అడిగితే చెప్పేది ఒక్కటే నేను చచ్చిపోయాక నా శవంపై కాషాయ జెండా కప్పాలని అడుగుతానని, నాది అదే చివరి కోరిక అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. బండి సంజయ్ కొత్త పార్టీ పెడుతున్నారంటూ కొందరు ఫాల్తుగాళ్లు ప్రచారం చేస్తున్నారని, అట్లాంటి వాటికి స్పందించాల్సిన అవసరమే లేదని చెప్పారు. బుధవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ బిజెపి రాష్ట్ర కార్యాలయానికి విచ్చేశారు. బండి సంజయ్ వస్తున్నారని సమాచారం అందుకున్న కార్యకర్తలు భారీ ఎత్తున పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా 2 గంటలపాటు పార్టీ కార్యకర్తలతో గడిపిన బండి సంజయ్ అనంతరం ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సీనియర్ నేతలు డాక్టర్ మనోహర్ రెడ్డి, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ తదితరులతో కలిసి మీడియా అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. మీరు కొత్త పార్టీ పెట్టబోతున్నారని కూడా వార్తలొస్తున్నాయి కదా? అని ప్రశ్నిస్తే..బండి సంజయ్ అంటే ఏమిటో మీకు తెలుసు. రాష్ట్ర ప్రజలకు తెలుసు. కార్యకర్తలందరికీ తెలుసు. దుష్ప్రచారానికి స్పందించాల్సిన అవసరమే లేదు. బిజెపి అంతర్గత శిక్షణా శిబిరాల్లో ఎంతో మంది కార్యకర్తలను తయారు చేసిన వ్యక్తులం మేం. ఎవరికైనా ఉరి తీయబోయే ముందు చివరి కోరిక అడుగుతారు. బిజెపిలో కమిట్ మెంట్ ఉన్న కార్యకర్తలను ఇదే విషయాన్ని అడిగితే చెప్పేది ఒక్కటే నేను చచ్చిపోయాక నా శవంపై కాషాయ జెండా కప్పాలి, నాది అదే చివరి కోరిక అన్నారు.



బుధవారం మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్

మిమ్ముల్ని కేబినెట్ నుండి బర్తరఫ్ చేయబోతున్నారని పలు డిజిటల్ మీడియాలో వార్తలొస్తున్నాయి కదా? అని ప్రశ్నిస్తే తెలంగాణలో బిఆర్‌ఎస్‌కు 17 ఎంపీ సీట్లున్నాయి కదా? ఆయన భాగస్వామ్యంతోనే కేంద్రంలోని ఎన్డీఏ నడుస్తోంది కదా? బహుశా నన్ను బర్త్ రఫ్ చేయాలనే నిర్ణయం కెసిఆర్, ఆయన కొడుకే తీసుకున్నట్లున్నారు, ఇంకా ఏమేం చేయబోతున్నారో వాళ్లనే అడగండి అంటూ సమాధానం ఇచ్చారు. త్వరలోనే అరెస్ట్ చేయబోతున్నారనే వార్తలు కూడా వస్తున్నాయన్న వాటిపై తీవ్రంగా స్పందించారు. వాళ్ల దృష్టితో చూస్తే నన్ను అరెస్ట్ చేయాల్సిందేమో. ఎందుకంటే. 10 ఏళ్ల బిఆర్‌ఎస్ గడీల పాలనను బద్దలు కొట్టినం కదా? పదేళ్ల కెసిఆర్ కుటుంబ అవినీతి అరాచక పాలనను బొందపెట్టినం కదా? అధికారం పోయిందనే కోపం వాళ్లకుంటది కదా? అందుకే నన్ను అరెస్ట్ చేయించాలని చూస్తున్నరేమో అంటూ సమాధానం ఇచ్చారు. బండి భగీరథ్ విషయంలో మీరు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అరెస్ట్ కాకుండా జాప్యం చేశారనే ఆరోపణలపై మాట్లాడుతూ కోర్టు పరిధిలో ఉంది. కానీ ఒక్క విషయం గుర్తుంచుకోండి. కన్న కొడుకును ఒక తండ్రి నేరుగా పోలీసులకు అప్పగించిన సందర్భం ఉందా? కానీ నేను విచారణ జరపాలని పోలీసులు కోరితే నేనే మా అబ్బాయిని పోలీసు విచారణ కోసం అప్పగించా. నేను ప్రజల మధ్య ఉన్నాను కాబట్టే, ప్రజలు బిజెపితో ఉన్నారు కాబట్టే నన్ను, నా పార్టీని బదనాం చేసేందుకు కెసిఆర్ కొడుకు సోషల్ మీడియాలో ఫేక్ మీడియా ఫ్యాక్టరీ ద్వారా నాపైన ఇట్లాంటి విష ప్రచారం చేయిస్తున్నాడు. ఎన్ని వండి వార్చినా జనం బిజెపితోనే ఉన్నారు. ఫేక్ వార్తలను, ఫేక్ స్టోరీలను చూసి జనం నవ్వుకుంటున్నారని పేర్కొన్నారు.

### ఐదేళ్లలో భారత్ ఇటలీ ద్వైపాక్షిక వాణిజ్యం

# 20 బిలియన్ యూరోల లక్ష్యం

### రెండుదేశాలమధ్య పెరుగుతున్న వాణిజ్య,ద్వైపాక్షిక బంధం
### భేటీ తర్వాత మెలోనీతో కలిసి మీడియాతో మాట్లాడిన ప్రధాని మోడీ



ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో జరిగిన విస్తృతస్థాయి చర్చల అనంతరం ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత్ ఇటలీ సంయుక్త వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళిక 2025–29 గురించి మోడీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలకు ఒక ఆచరణాత్మక, భవిష్యత్ ఆధారిత నిర్మాణక్రమంఅందిస్తుందని పేర్కొన్నారు. ఇరుదేశాల నాయకుల మధ్య పెరుగుతున్న నిరంతర చర్చలు, సమావేశాలు ఇరుపక్షాల మధ్య బలపడుతున్న సహకారానికి, పరస్పర నమ్మకానికి నిదర్శనమని మోడీ అన్నారు. సాంకేతికత, ఆవిష్క రణలు మా భాగస్వామ్యానికి చోదక శక్తులని కృత్రిమ మేధ, క్వాంటం, పౌర అణు ఇంధనం, అంతరిక్ష రం గాల్లో మా భాగస్వామ్యానికి అపరిమితమైన అవకాశాలు ఉన్నాయి. ఇరుదేశాల్లోని స్టార్టప్‌లు, పరిశోధనా కేంద్రాలు, వ్యాపారాలను అనుసంధానిం చడానికి మేము భారత్‌ఇటలీ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుపై పనిచేస్తున్నామని ప్రధాని మోడీ పేర్కొన్నారు. గడచిన మూడున్నర ఏళ్లలో తనకు, ఇటలీ ప్రధాని మెలోనీతో పలుమార్లు సమావేశం అయ్యే అవకాశం వచ్చిందని మోడీపేర్కొన్నారు. ఇది భారత్‌ఇటలీ మధ్య ఉన్న సన్నిహిత సహకారానికి, సయోధ్యకు ప్రతిబింబం. ఆమె నాయకత్వంలో మన ఇరుదేశాల సంబంధాలు సరికొత్త వేగాన్ని, నూతన దిశను, ఆత్మవిశ్వాసాన్ని సంతరిం చుకున్నాయి. మా సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తూ, ఈ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించడం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందని ప్రధానిఅన్నారు. భారత్ ఇటలీ మధ్య ఉన్న నాగరికతా సంబంధాలను కూడా మోదీ హైలెట్ చేశారు. ఇరుదేశాల మధ్య ఉన్న సంబంధాలు కేవలం ఇప్పటివి కావని అన్నారు. ఇటలీ రాజధాని రోమ్ నగరానికి, తన పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాశికి మధ్య ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రధాని మోడీగుర్తుచేశారు. నాకు, నా ప్రతినిధి బృందానికి ఘన స్వాగతం పలికినందుకు నేను ప్రధాని మెలోనీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రపంచంలో రోమ్ నగరాన్ని శాశ్వత నగరం అని పిలుస్తారు. భారతదేశంలో నా లోక్‌సభ నియోజకవ ర్గమైన కాశీ కూడా శాశ్వత నగరమే. ఈ రెండు గొప్ప నాగరికతలు కలిసినప్పుడు, చర్చలు కేవలం ఒక ఎజెండాకే పరిమితం కావు. అందులో లోతైన చరిత్ర, భవిష్యత్తు వీక్షణం, నిరాండర స్నేహం స్పష్టంగా కనిపిస్తాయని మోడీ పేర్కొన్నారు.ఇటలీ చేరుకున్న ప్రధాని మోడీకి రోమ్‌లో సైనిక వందనం చేస్తూ ఘన స్వాగతం పలికారు. రోమ్ చేరుకున్న వెంటనే ఆయన ఇటలీ ప్రధాని జార్జియా మెలోనితో ప్రత్యేక విందులో పాల్గొన్నారు. అనంతరం ఇరువురు నేతలు రోమ్‌లోని ప్రఖ్యాత చారిత్రక కట్టడం కొలోసియంను సందర్శించారు.

**రోమ్, మే 20:** భారత్‌ఇటలీ ద్వైపాక్షిక వాణిజ్యం 2029 నాటికి 20 బిలియన్‌యూరోల స్థాయికి చేర్చాలన్న లక్ష్యంతో ఉన్నట్లు ప్రధానిమోడీ పేర్కొన్నారు. ప్రస్తుతం ఇటలీ భారత్‌లమధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 14.25 బిలియన్ డాలర్లుగా ఉందని, భారత్‌నుంచిఎగుమతులు 8.55 బిలియన్ల యూరోలవరకూ ఉన్నట్లు ప్రధాని తెలిపారు. అలాగే ఇటలీనుంచి భారత్‌కు దిగుమతులు కూడా 5.70 బిలియన్ యూరోలు స్థాయికి చేరాయని, 9.42శాతంపెరిగినట్లు తెలిపారు. రెండుదేశాలమధ్య ద్వైపాక్షిక వాణిజ్య,దౌత్య సంబంధాలు సరికొత్త శిఖరాలకు చేరాయన్న మోడీ వాణిజ్యం, రక్షణ, క్లీన్ ఎనర్జీ, సాంకేతిక రంగాలపై ద్వైపాక్షిక చర్చలు జరిపారు.



### భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు
### మొక్కులు చెల్లించుకున్న మంత్రి కొండా సురేఖ
### ప్రత్యేక పూజలు నిర్వహించిన కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

**వరంగల్,మే 20 ప్రభాతవార్త:** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన భద్రకాళీ అమ్మవారిని బుధవారం పుర్రప్రముఖులు దర్శించు కున్నారు. తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు అనంతరం కంచి పీఠాధిపతులు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ మహాస్వామి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ప్రముఖులను ఈఓ శ్రీమతి రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషులు ఆలయ చైర్మన్ డా బి. శివసుబ్ర హ్మణ్యం పూర్ణకుంభం మంగళ వాద్యాలతో ఘనస్వాగతం పలికారు. ఆదిశం కరాచార్యులు, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలో అమ్మవా రికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం ఆలయ మహామండపంలో ఆలయ ప్రధానార్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ మహా మండపంలో భక్తులను ఉద్దేశ్శించి తమ అనుగ్రహ భాషణం తెలిపారు. అనంతరం భక్తులకు స్వామివారు ప్రసాద వితరణ జరిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు శ్రీయుతులు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఒరుగంటి పూర్ణచందర్, మయూరి రామేశ్వర్రావు, గాండ్ల స్రవంతి. నార్ల సుగుణ, బింగి సతీష్, జారతి వెంకటేశ్వర్లు పాలడుగుట ఆంజనేయులు, అనంతుల శ్రీనివాస్, తొగరు క్రాంతి, సిరివోలు శ్రీధర్ రావు మూగా శ్రీనివాసరావు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్: ముగ్గురు మృతి

**మహబూబాబాద్ రూరల్,ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు మృతిచెందిన విషాదకర సంఘటన మంగళవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా తొర్రూరు శివారులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే దంతాలపల్లి మండలం బొడ్లాడ గ్రామానికి చెందిన అల్లి సంపత్(25), లింగమల్ల సతీష్(28), పొట్లకర్ల వంశీ(22) ద్విచక్ర వాహనంపై వరంగల్ వెళ్తున్నారు. ఈ క్రమంలో తొర్రూరు మండలం వెలికట్ట శివారులో ధాన్యం లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుండి బలంగా ఢీకొట్టడంతో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను తరలించారు. ఈ గ్రామానికి చెందిన ముగ్గురు రోడ్డుప్రమాదంలో మరణించడంతో ఆ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

## ఇరాన్‌యుద్ధంలో 42 అమెరికా జెట్‌లు ధ్వంసం

**వాషింగ్టన్, మే 20:** అమెరికాఇరాన్ యుద్ధం ఇప్పటికీ విధ్వంసం నుంచి మాటల యుద్ధంగా కొనసాగుతోంది. మరోవైపు, యూఎస్‌ఇజ్రాయిల్ కలిసి ఇరాన్‌పై విరుచుకుపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే, ఇప్పటి వరకు యుద్ధంలో ఎంత నష్టం సంభవించిందో అమెరికా అధికా రికంగా బయటపెట్టలేదు. కానీ కొన్ని నివేదికల ప్రకారం, ఈ యుద్ధంలో అమెరికా తీవ్రంగా నష్టపోయినట్లు తెలుస్తోంది. కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ చెబుతున్న దాని ప్రకారం అమెరికాకు భారీ నష్టం జరిగినట్లు తెలుస్తోంది. యుద్ధంలో ఫైటర్ జెట్లు, డ్రోన్‌లతో సహా కనీసం 42 అమె రికా సైనిక విమానాలు ధ్వంసమైనట్లు సమాచారం. ఈ సైనిక చర్యకు ఇప్పటికే దాదాపుగా 29 బిలియన్ డాలర్లు ఖర్చు అయినట్లు పెంటగాన్ ప్రకటించింది. ధ్వంసమైన యుద్ధ విమానాల్లో అమెరికా అత్యాధునిక ఎఫ్15ని స్ట్రైక్ ఈగిల్ ఫైటర్ జెట్‌లు నాలుగు, ఒక ఎఫ్35ఎ లైట్నింగ్ ॥ ఫైటర్ విమానం, ఒక ఎఫ్ 10 థండర్‌బోల్ట్ ॥ గ్రౌండ్‌ఎటాక్ విమానం, ఏడు కెసి135 స్ట్రాటోట్యాంకర్ ఏరియల్ రీఫ్యూయలింగ్ విమానాలు, ఒక ఈ3 సెంటినల్ ఎయిర్‌బోర్న్ ఎర్లీ వార్నింగ్‌అండ్‌కంట్రోల్ సిస్టమ్ విమానం, రెండు ఎంసి 130 కమాండో స్పెషల్ ఆపరేషన్ విమానాలు, ఒక హెచ్60డబ్ల్యు జాలీ గ్రీన్‌వార్ రిసెర్చ్ రక్షణ హెలికాప్టర్, 24 ఎంక్యూ 9 రీపర్ డ్రోన్, ఒక ఎంక్యూ 4సి ట్రైటాన్ డ్రోన్‌లు ఉన్నాయి. ఇదిలా ఉంటే అమెరికా రక్షణ శాఖ ఇప్పటి వరకు యుద్ధ నష్టాలపై సమగ్ర అంచనాలను ప్రచురించలేదు. అమెరికా కాంగ్రెస్, కమిటీలు రక్షణశాఖ, అమెరికా సెంట్రల్ కమాండ్(సెంట్‌కామ్) వార్తలు, నివేదికల ఆధారంగా నష్టాలను అంచనా వేసింది. ఫిబ్రవరి 28న ప్రారం భమైన ఈ యుద్ధంలో మొదటి రోజు ఇరాన్ సుప్రీంలీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీని హతమార్చింది. ఆ తర్వాత ఇరాన్ యూఎస్‌కు వ్యతిరేకంగా బలంగా దాడులు చేసింది. ముఖ్యంగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలను టార్గెట్ చేసింది. ఇదే కాకుండా యూఏఈ, బహ్రెయిన్, ఖతార్, కువైట్ వంటి దేశాల్లోని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను దెబ్బతీసింది.

## ఇక ఇంగ్లీష్, తెలుగులో అసిస్టెంట్ సైంటిస్టు రాత పరీక్ష

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:**రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీపడే అభ్యర్థుల వయస్సు ను 34 ఏళ్ల నుండి 44 ఏళ్లకు పెంచిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక ప్రకటన విడుదల చేసింది. సర్కారీ ఉద్యోగాలకు వయోపరిమితిని 10 సంవత్సరాలు పెంచుతూ ప్రభుత్వం జీవో 86ను విడుదల చేసిన నేపథ్యంలో కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ సైంటిస్టు ఉద్యోగాలకు 44ఏళ్ల వయసులోపు ఉన్న నిరుద్యోగులనూ అర్హులుగా పేర్కొంది. అదే సమయంలో ఈ నియామకాల కోసం నిర్వహించే పరీక్షలు పేపర్–1, 2లను ఇంగ్లీష్‌తోపాటు తెలుగులో నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ మేరకు కమిషన్ అదనపు కార్యదర్శి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## ఉపాధి హామీ పనులు వేగవంతం చేయండి
### పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:**ఉపాధి హామీ పథకం కింద వేజ్(వేతనం) కంపోనెంట్, మెటీరియల్ కంపోనెంట్ పనులను వేగవంతం చేయాలని, అన్ని పనులను వెంటనే మొదలుపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్ అధికారులను ఆదేశించారు.పాత నిబంధనలతో ఉపాధిహామీ పథకం జూన్ 30 వరకు కొనసాగుతుందని, ఆతర్వాత జూలై 1 నుంచి కొత్తగా విబిజి రామ్‌జీ పథకం అమల్లోకి రానుం దని తెలిపారు. ఈ మేరకుబుధవారం సచివాలయం నుంచి సెర్ప్ సిఇఒ దివ్యతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నరేగాపనులు, చేయూత పెన్షన్ సర్వే పురోగతిని సమీక్షి ంచారు. ప్రస్తుతం రోజుకు 15లక్షల మంది కార్మికులు నరేగా పనుల్లో పాల్గొం టుండగా, వెంటనే ఆ సంఖ్యను 20 లక్షలకు

## అన్సారీ మృతిపై కూనంనేని సంతాపం

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:**ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మహమ్మద్ అన్సా రి మృతిపట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సంతాపం తెలియజేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రొఫెసర్ అన్సా రి చేసిన సేవలను కొనియాడారు. ఉస్మానియా వేదికగా జరిగిన అనేక ఉద్యమాలలో విద్యార్థులకు సహకారం అందించి, తాను కూడా పాల్గొన్నారని తెలిపారు.

## బాల్య వివాహాల్లో 8వ స్థానంలో తెలంగాణ

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా ఉన్న బాల్య వివాహాల ధోరణులు ఆందోళన కలిగిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో సహా దేశ వ్యాప్తంగా బాల్యవివాహాలు నానాటికీ పెరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. బాలికలు, బాలురు ఇద్దరిలోనూ బాల్య వివాహాలు పెరుగుతున్నాయని ఈ గణాంకాలు చెబుతున్నాయి. జాతీయ సర్వే 201921 నివేదిక ప్రకారం 23.3 మంది బాలికలు 18 ఏళ్లలోపు, 17.7 మంది బాలురు 21 ఏళ్లలోపు వివాహం చేసుకుంటున్నారు. తాజా గణాంకాల ప్రకారం బాల్య వివాహాల్లో 41.6 తో పశ్చిమ బెంగాల్, 40.8 తో బీహార్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ (29.3 ) 7వ స్థానంలో, తెలంగాణ (23.5 ) 8వ స్థానంలో నిలిచాయి. జమ్మూ కాశ్మీర్ 4.5 తో చివరి స్థానంలో ఉంది. అమ్మాయిలకు చట్టం నిర్దేశించిన కనీస వివాహ వయసు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు. అయితే దేశంలో సగటున అమ్మాయిలకు 23.3 శాతం, అబ్బాయిలకు 14.5 శాతం మంది పరిణతి వయసుకంటే ముందే వివాహ బంధంలోకి అడుగు పెడుతున్నారు. 21 ఏళ్ల దాటకుండా పెళ్లి చేసుకుంటున్న అబ్బాయిలు కేరళలో 1.4 శాతంగా ఉన్నట్లు కేంద్ర గణాంకాలు వెల్లడించాయి.

### బొగ్గు గ్యాసిఫికేషన్ దిశగా సింగరేణి

# విధానపరమైన సహకారమివ్వండి

### కిషన్‌రెడ్డిని కోరిన డిప్యూటీ సీఎం విక్రమార్క



బుధవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిన కలిసి డి.సిఎం భట్టి

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** దేశవ్యాప్తం గా బొగ్గు గ్యాసిఫికేషన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, సింగరేణి కూడా ఆ దిశగా ముందడుగు వేయడానికి సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఇందులో సింగరేణి భవిష్యత్ ప్రణాళికలు, బొగ్గు గ్యాసిఫికేషన్ అవకాశాలు, కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్–॥ మైనింగ్ లీజ్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా విక్రమార్క మాట్లాడుతూ, బొగ్గును కేవలం సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తికే పరిమితం చేయకుండా, భవిష్యత్ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విలువ ఆధారితంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. కోల్ ఇండియా చేపడుతున్న గ్యాసిఫికేషన్ కార్యక్రమాల తరహాలోనే, సింగరేణి కూడా బొగ్గు వనరులను ఆధునిక సాంకేతికతతో మరింత సమర్థవంతంగా వినియోగించే అవకాశాలను పరిశీలిస్తోందని చెప్పారు. బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గు వనరులకు అదనపు విలువ కల్పించడంతో పాటు, ఇంధన భద్రత, పారిశ్రామిక వినియోగాలు, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని అన్నారు. ఇందుకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం, విధాన పరమైన సహకారం, కేంద్ర పథకాల అనుసం ధానంలో బొగ్గు మంత్రిత్వ శాఖ సహకారం అందించాలని కోరారు. సింగరేణి దక్షి ణ భారతదేశ బొగ్గు సరఫరా, విద్యుత్ రంగ అవసరాల తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న సంస్థగా పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సింగరేణికి కొత్త బొగ్గు వనరుల సమీకరణ అత్యవసరమని తెలిపారు. గోదావరి వ్యాలీ కోల్ ఫీల్డ్స్ పరిధిలోని కొయ్యగూడెం బ్లాక్–॥। తెలంగాణ విద్యుత్ అవసరాలకు కీల కమని, దీన్ని సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాడిచెర్ల కోల్ బ్లాక్‌కు సంబంధించి సింగరేణి ఇప్పటికే ప్రీ మైనింగ్ కార్యకలాపాలు, అన్వేషణ పనులు చేపట్టిందని, మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తాడిచెర్ల కోల్ బ్లాక్–॥ అభివృద్ధి సింగరేణి భవిష్యత్ అవసరాలకు, తెలంగాణ విద్యుత్ భద్రతకు కీలకమని వెల్లడించారు.

తాడిచెర్ల కోల్ బ్లాక్–॥కు ముందస్తు అనుమతి మంజూరు చేసి, మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయా అంశాలపై సంబంధిత కేంద్ర, రాష్ట్ర అధికారులు, సింగరేణి ప్రతినిధులతో త్వరలో సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ డా. జ్యోతి బుద్ధ ప్రకాష్, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ఐపిఎల్ టికెట్ల మోసాలపై టిసిఎస్‌బి హెచ్చరిక

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** దేశంలో ఐపిఎల్ సీజన్ ముగింపుకు చేరుకున్న క్రమంలో దీనికి సంబంధించిన నకిలీ టికెట్ల మోసాలపై క్రీడాభిమానులను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిసిఎస్‌బి) హెచ్చరిం చింది. ఈ మేరకు టిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ బుధవారం ఒ క ప్రకటన విడుదల చేశారు. సైబర్ నేరగాళ్లు విఐపి. వివిఐపి పాస్‌లు, భారీ డిస్కౌంట్లు, చివరి నిమిషం టికెట్ ఆఫర్ల పేరిట అమాయకులను మోసం చేస్తున్నారని ఆమె తెలిపారు. దీంతో పాటు క్యూఆర్ కోడ్, యుపిఎల్, బ్యాంక్ ట్రాన్స్ ఫర్ ద్వారా డబ్బులు తీసుకుని ఆ తరువాత బి చాణా ఎత్తేస్తున్న మోసగాళ్ల జాబితా ఎక్కువగా వుందని ఆమె తెలిపారు. ఐపిఎల్ టికెట్ బుకింగ్‌లకు డిస్ట్రిట్ యాప్ అధికారిక టి టెకింట్ భా గస్వామిగా వుందని శిఖా గోయల్ తెలిపారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుకింగ్ చేసేవారు మరింత జాగ్రత్తగా వుం డాలని, ఈ విషయంలో క్రీడాభిమా నులు మరింత అప్రమత్తంగా వుండాలని ఆమె కోరారు. ఏదైనా అనుమానాలు వుంటే 1930 లేదా సమీప పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు.



## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే20:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డి భోది పెవిలియన్‌లో 2025 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి వైస్ చైర్మన్ శాంతి కుమారి,కోర్స్ డైరెక్టర్ కందుకూరి ఉషా రాణి ఉన్నారు. సీఎంని కలిసిన ట్రైనీ ఐఏఎస్ అధికారులలో ఎట్ట బోయిన సాయి శివాని, సచిన్ బసవరాజ్ గుత్తూర్, పోతరాజు హరి ప్రసాద్, పారస్ కుమార్, పి. సురేష్, నెలటూరు శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.

## సోలార్ పవర్ కమిషనింగ్ గడువు పెంపు

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** పీఎం కుసుమ్ (ప్రధాన్ మంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్) కింద చేపట్టిన సోలార్ పవర్ ప్రాజెక్టల కమిషనింగ్ గడువును వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు పొడిగించారు. ఈ మేరకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఈఆర్సీ) ఆర్డర్ పాస్ చేసింది. కమిషనింగ్ గడువు ఈ ఏడాది మార్చి 30తో ముగిసింది. అయినా ప్రాజెక్ట్‌లు పూర్తికాకపోవడంతో 2027, మార్చి 31 లోగా పూర్తిచేసి కమిష నింగ్ చేయాలని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ ఆదేశించింది. కాగా రైతులకు ఆర్థిక భద్రతను అందించడం, వ్యవసాయాన్ని డీజిల్ రహితంగా మార్చడం, అదనపు ఆదాయాన్ని సమకూర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పీఎం కుసుమ్ పథకాన్ని అమలు చేస్తోంది. దీని ద్వారా సోలార్ పంపుల ఏర్పాటుకు మరియు భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం భారీగా సబ్సిడీలను అందిస్తుంది. రైతులు తమ బీడు, వ్యవసాయ భూముల్లో (500కిలోవాట్ల నుండి 2 మెగావాట్ల సామర్థ్యం గల చిన్న సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటుచేసుకోవచ్చు. ఉత్పత్తి అయిన విద్యుత్తును డిస్కమ్ (విద్యుత్ పంపిణీ సంస్థలు) కొనుగోలు చేస్తాయి. దీని ద్వారా రైతులకు 25 సంవత్సరాల పాటు స్థిరమైన ఆదాయం లభిస్తుంది. అలాగే కాంపోనెంట్ బి కింద డీజిల్ పంపుల స్థానంలో కొత్తగా వ్యవసాయ సోలార్ పంపులనుఏర్పాటు చేసుకోవడానికి ఈ విభాగం నుండి సాయం అందుతుంది. దీనికి కేంద్ర ప్రభుత్వం 30శాతం, రాష్ట్ర ప్రభుత్వం మరో 30 శాతం చొప్పున సబ్సిడీని అందిస్తాయి. మిగిలిన 40 శాతం మొత్తాన్ని రైతు భరించాల్సి ఉంటుంది. ఇక కాంపోనెంట్ సిలో భాగంగా ఇప్పటికే ఉన్న గ్రిడ్ కనెక్టెడ్ వ్యవసాయ పంపులను సోలరైజ్ చేయడానికి (సౌరశక్తితో నడిచేలా చేయడానికి) ఈ భాగం ఉపయోగపడుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

## నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర న్యాయ విచారణ జరపాలి
### ఎన్టిఎను రద్దు చేయాలి: కూనంనేని, కోదండరాం,జాన్ వెస్లీ

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** నీట్ పేపర్ లీకేజీ ఘటన కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాల దారుణ వైఫల్యానికి నిదర్శనమని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు తీవ్రంగా విమర్శించారు. నీట్ పరీక్షను పూర్తిగా రద్దు చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ను రద్దు చేసి స్వతంత్ర, పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వాలకే ప్రవేశ పరీక్షల నిర్వహణ హక్కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సుందరయ్య విజ్ఞాన కేం ద్రంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ, పీడీఎస్ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు టి. నాగరాజు, పుట్టా లక్ష్మణ్, ఎస్. అనిల్, పొడపంగి నాగరాజు అధ్య క్షత వహించారు. సమావేశంలో విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లా డుతూ దేశంలో విద్యను పూర్తిగా కార్పొరేటీకరణ దిశగా నెట్టివేస్తున్న కేంద్ర ప్రభుత్వం, ప్రవేశ పరీక్షలను కేంద్రీకరించడం ద్వారా రాష్ట్రాల హక్కులను హరిస్తోందని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం నిరక్ష్యంగా వ్యవహారిస్తోం దన్నారు. నీట్ పరీక్షను పూర్తిగా స్వతంత్ర సంస్థతో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ భారత రాజ్యాంగం రాష్ట్రాలకు కల్పించిన విద్యా హక్కులను కేంద్రం క్రమంగా హరించేస్తోందన్నారు. గ్రామీణ, ప్రభుత్వ విద్యార్థులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటుండగా, కోచింగ్ మాఫియా మాత్రం వేల కోట్ల వ్యాపారం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలు పూర్తిగా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ దిశగా సాగుతున్నాయని అన్నారు. విద్యను ప్రజల హక్కుగా కాకుండా వ్యాపార వస్తువుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.

## ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్ష పదవికి నారంగ్ రాజీనామా
### థియేటర్ల పర్సంటేజ్ వివాదంలో ఒత్తిడే కారణం

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:**తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్ష పదవికి నిర్మాత, డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్, ఏషియన్ మల్టీప్లెక్స్ ల అధినేత సునీల్ నారంగ్ రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఈ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఫిల్మ్ ఛాంబర్‌కు ఈ మెయిల్ సం దేశం ద్వారా తెలియచేశారు. గత కొంత కాలంగా చిత్ర పరిశ్రమ లో థియేటర్లు, నిర్మాతల మధ్య పర్స ంటేజీ విధానంపై తీవ్ర స్థాయిలో వివాదం కొనసాగుతోంది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో కూడా పర్స ంటేజీ సిస్టమ్ అమలు చేయాలని ఎగ్జిబిటర్లు కోరగా అందుకు అగ్ర నిర్మాతలు మాత్రం అంగీకరించడం లేదు. ఈ వివాదం విషయంలో నిర్మాతల నుంచి సునీల్ నారంగ్ తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఛాంబర్ ప్రతినిధులకు పంపిన తన రాజీనామా లేఖలో, కొన్ని నిర్దిష్ట వర్గాలకు ప్రయోజనం చేకూర్చే నిర్ణయాలు తీసుకోవాలని కొందరు కార్యనిర్వాహకుల నుండి తాను తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు సునీల్ నారంగ్ పేర్కొన్నట్లు సమాచారం. అటువంటి పరిస్థితుల లో తాను ఇకపై కొనసాగలేనని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా అధ్యక్షుడిగా తన బాధ్యతల నుండి తక్షణమే ఉపశమనం కల్పించాలని అభ్యర్థించారు. తన నిర్ణయం వెనుక ఆరోగ్య సమస్యలు కూడా ఒక కారణమని నారంగ్ పేర్కొన్నారు. అటువంటి ఒత్తిడితో కూడిన వాతావరణంలో తన పరిస్థితి తనకు సహకరించడం లేదని ఆయన తెలిపారు. మరింత ముఖ్యంగా, ఛాంబర్ పనిచేస్తున్న తీరుపై ఆయన నిరాశ వ్యక్తం చేశారు. సంస్థలో నిర్ణ యాలు పరస్పర అవగాహన, ఏకాభిప్రాయంతో జరగాలి, కానీ ఆ వాతావరణం ఇప్పుడు లేదని ఆయన భావించారు. ఆసక్తికరంగా, తన నిష్క్ర మణ తర్వాత వెంటనే బాధ్యతలు స్వీకరించగల ప్రత్యామ్నాయాలుగా శేఖర్, విజేందర్ పేర్లను కూడా నారంగ్ సూచించారు. ఈ క్రమంలో తాజా గా ఆయన తన పదవికి రాజీనామా చేయడంతో రెండు రోజుల్లో తెలంగాణ స్టేట్ ఫిల్మ్ చాంబర్‌కు కొత్త అధ్యక్షుడి ఎన్నిక జరగనున్నట్లు తెలుస్తోంది.

## సహకార విద్యుత్ సరఫరా సంస్థ లైసెన్స్ సవరణ
### ఉత్తర తెలంగాణ విద్యుత్ డిస్కంకు బదలీ
### విద్యుత్ నియంత్రణ కమిషన్ గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక, ఏకైన సహకార విద్యుత్ సరఫరా సంఘాన్ని చేర్చడానికి గాను ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) లైసెన్సు ను సవరించుకోవడానికి రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ అనుమతి ఇచ్చింది. నియంత్రణ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ జస్టిస్ దేవరాజు నాగార్జున్‌తోకూడిన ధర్మాసనం, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పిటిషన్‌ను స్వీకరించింది. ఈ పిటీషన్‌పై జరిగిన విచారణ సందర్భంగా మార్చి 31న కంపెనీ జారీ చేసిన తాత్కాలిక టేకోవర్ ఉత్తర్వును ధృవీకరిస్తూ, ఏప్రిల్ 1 నుండి అమలులోకి వచ్చేలా ఉత్తర్వులను మంజూరు చేసింది. మెరుగైన సాంకేతిక నిర్వహణను ప్రస్తావించిన మద్దతుదారుల నుండి, సహకార విద్యుత్ పంపిణీ సంస్థ (సెస్) మినహాయింపు కొనసాగింపు, ఫోరెన్సి క్ ఆడిట్‌లు, సహకారహక్కుల పరిరక్షణ వరకు, 1,211 మంది సం స్థకు చెందిన వాటాదారుల అభిప్రాయాలను తాము పరిగణనలోకి తీసుకు న్నామని కమిషన్ తెలిపింది. ఈ సహకార విద్యుత్ పంపిణీ సంస్థ మినహా యింపు మార్చి 31తో ముగిసిందని, సరఫరా కొరతను నివారించడానికి లైసెన్స్ సవరణ అవసరమని కమిషన్ నిర్ధారించింది. దీంతో సెస్ ఆస్తులు, బకాయిలు, సహకార పాలనకు సంబంధించిన విషయాలు రాష్ట్ర ప్రభుత్వం, సహకార చట్టంపరిధిలోనే ఉంటాయి. జారీ చేసిన ఆదేశాలలో విశ్వసనీ యమైన సేవాసమానత్వాన్ని నిర్ధారించడం, 2026–27 ఆర్థిక సంవత్సరానికి ప్రస్తుత టారిఫ్ నిర్ధారణలను వర్తింపజేయడం, ప్రభుత్వం ద్వారా సబ్సిడీ ఏర్పాట్లను బదిలీ చేయడం మరియు పెండింగ్‌లో ఉన్న వినియోగదారుల ఫిర్యాదులను ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు బదిలీ చేయడం వంటివి ఉన్నాయని సంబంధిత అధికారవర్గాలు వెల్లడించాయి.

## దేశానికి ఉన్నతా విద్యా కేంద్రంగా తెలంగాణ: గవర్నర్ శుక్లా
### ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డితో ప్రత్యేక సమీక్ష

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ప్రముఖ ఉన్నత విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా సమగ్ర చర్యలు చేపట్టాలని తెలంగాణ ఉన్నత విద్యామండలితో పాటు విద్యాశాఖను రాష్ట్ర గవర్నర్ శివప్ర తాప్‌శుక్లా ఆదేశించారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాల యాలు విద్యా ప్రమాణాలు, పరిశోధన సామర్థ్యం, ఆవిష్కరణలు, పరిపాలనా సంస్కరణలు, విద్యార్థుల ఉపాధి సామర్థ్యం, సంస్థాగత బాధ్యత, అం తర్జాతీయ భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.

విశ్వవిద్యాలయాల పనితీరుపై సమగ్ర సమీక్షలో భాగంగా బుధవారం లోక్ భవన్‌లో తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డితో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్ర ఉన్నత విద్యారంగ బలోపేతానికి సంబంధించి అమలు చేస్తున్న కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

తెలంగాణ ఉన్నత విద్యామండలి చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు.

రాష్ట్రంలోని విశ్వవిద్యాల యాలు ఎదుర్కొంటున్న విద్యా, పరిపాలనా సమస్యలపై కూడా గవర్నర్ విపులంగా చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం తీసుకోవాల్సి న చర్యలతో కూడిన అంశాలపై సమగ్ర నివేదికను సమర్పించాలని తెలంగాణ ఉన్నత విద్యామండలిని ఆదేశించారు. అదేవిధంగా త్వరలో రాష్ట్ర విశ్వవిద్యాలయాల వైస్‌చాన్స లర్లు, తెలంగాణ ఉన్నత విద్యామండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించను న్నట్లు తెలిపారు.

సమీక్షలో భాగంగా తెలంగాణ ఉన్నత విద్యామండలి, రాష్ట్ర విశ్వవిద్యాలయాలు అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి అవకాశాల పెంపు చర్యలు, డిజిటల్ లెర్నింగ్ కార్యక్రమాలు, పాఠ్య ప్రణాళికల ఆధునీకరణ,ఆవిష్కరణల ప్రోత్సా హం, పరిశ్రమల అనుసంధానిత కోర్సు లు తదితర అంశాలను గవర్నర్ సమీక్షి ంచారు. రైజింగ్ తెలంగాణ విజన్–2047, వికసిత భారత్–2047 లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ ఉన్నత విద్యను అభివృద్ధి చేసే దిశగా పలు అంశాలపై చర్చిం చారు.

విశ్వవిద్యాలయాల విద్యా, పరిపాలనా, మౌలిక వసతులు, అధ్యాపకుల నియామకాలు, పరీక్షల నిర్వహణ, గుర్తింపు (అక్రెడిటేషన్), పరిశోధన, ఆర్థిక వ్యవహారాలు, విద్యార్థి సంక్షేమం తదితర అంశాలపై ఒక్కో యూనివర్సిటీ వారీగా సమీక్ష జరిపి అవసరమైన విధాన నిర్ణయాలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

# పోలీస్ శాఖలో బాధ్యత పెరగాలి

- శాంతి భద్రతలపై అలసత్వం సహించను - కొత్త సవాళ్లకు అనుగుణంగా సిద్ధం కావాలి - ఆహారకల్తీపై ఉక్కుపాదం, కల్తీపైన ప్రత్యేక చట్టం, - డ్రగ్స్ బాధితుల కోసం డీఅడిక్షన్ సెంటర్లు ఏర్పాటు - స్కిల్స్ యూనివర్సిటీలో సైబర్ క్రైమ్ పై ప్రత్యేక కోర్సు - పోలీస్ సీనియర్ అధికారులతో సిఎం రేవంత్‌రెడ్డి సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే20:** పోలీస్ శాఖ లో రెస్పాన్సి బిలిటీ పెరగాలి, వ్యవస్థలో అందరూ భాగస్వాములు.. దాటి వెళ్తామంటే ఒప్పుకోం, అలాంటి అధికారులను ప్రభుత్వం ఒప్పుకోదు అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. బుధవారం రాత్రి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డి బోధి పెవిలియన్‌లో పోలీస్ సీనియర్ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ పభుత్వ ఆలోచన పంచుకోవాలన్నదే సమావేశ ఉద్దేశం. ఎవరైనా హెడ్ క్వాటర్స్ వదలాలంటే తప్పని సరి గా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు.క్రైమ్ రివ్యూ మీటింగ్స్ తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ లు నిరంతరం జిల్లా లో పర్యటించాలి,ఐజీ స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి అని చెప్పారు..రౌడీ షీటర్ల పైన నిరంతరం పర్యవేక్షణ ఉండాలి..క్రైమ్ అప్గ్రేడ్ అవుతుంది.. దానికి అనుగుణంగా పోలీసింగ్ కూడా అప్గ్రేడ్ కావాలి అని చెప్పారు. గంజాయి రవాణాను పూర్తిగా అరికట్టాలి..ప్రత్యేక నిఘా పెట్టాలని దిశానిర్దేశం చేశారు. పోలీస్ డిపార్ట్మెంట్‌లో అన్ని వాహనాలు ఈవీకి మారాలి..శాంతి భద్రతల విషయం లో నిర్లక్ష్యంగా ఉంటే సహించను..కాలం చెల్లిన ఆయుధాలను తొలగించాలి అని చెప్పారు. పెట్రోలింగ్ ను బలోపేతం చేయాలి విలేజ్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలి, రౌడీ షీట్,హిస్టరీ షీట్‌ల పైన రివ్యూ చేయాలని చెప్పారు. ఎఫ్ ఎస్ ఎల్ విభాగాన్ని బలోపేతం చేసుకోవాలి అని సూచించారు. వచ్చే 10 ఏళ్ల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి..కొత్త సవాళ్లకు అనుగుణంగా డిపార్ట్మెంట్ సిద్ధం కావాలి అని చెప్పారు. పోలీసుల సంక్షేమం పైన దృష్టి పెట్టాలి డ్రోన్ పోలీసింగ్ పెంచాలి..పోలీసింగ్‌లో సాంకేతికతను వినియోగించుకోవాలి.. సీసీ కెమెరాల ను పెంచుకోవాలి అని పేర్కొన్నారు.కమాండ్ కంట్రోల్ సెంటర్‌ని సమర్ధ వంతంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. నేరాల స్వరూపం మారుతుంది..దానికి అనుగుణంగా పోలీసింగ్ మారాలని స్పష్టం చేశారు. పోలీస్ డిపార్ట్మెంట్‌లో అవినీతిని సహించను అని హెచ్చరించారు. మెరిట్ ప్రకారం పోస్టింగ్స్ ఇవ్వాలి..పోలీస్ అధికారుల మధ్య సమన్వయం పెరగాలి అని చెప్పారు. డిపార్ట్మెంట్ బలోపేతం కోసం అన్ని విధాలుగా సహకరిస్తా.. ఐపీఎస్ ఆఫీసర్ల సంఖ్యను పెంచుకోవడానికి కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నాం అని చెప్పారు. అన్ని పోలీస్ స్టేషన్లలో పిర్యాదుల కోసం క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేయాలి..రోడ్ సేఫ్టీ,ట్రాఫిక్ ను ఒక యూనిట్ చేయాలి అని చెప్పారు. ఆహార కల్తీ పైన ఉక్కుపాదం మోపాలి..ఆహార కల్తీ పైన ప్రత్యేక చట్టం తీసుకురావాలని పేర్కొన్నారు. ఆహార కల్తీ వల్ల క్యాన్సర్ కేసు లు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని చెప్పారు.వీఐపీ లు,సెలబ్రిటీ ల కార్యక్రమాల అనుమతుల పైన జాగ్రతలు తీసుకోవాలని పేర్కొన్నారు. డ్రగ్స్ బాధితుల కోసం ప్రత్యేక డి అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. డిపోర్టమెంట్ లో ఎస్ ఐ నుంచి నాన్ క్యాడర్ ఐపీఎస్ వరకు ప్రమోషన్ తరవాత 2 ఏళ్ల పాటు ఇతర విభాగాల్లో పని చేయాలి,. దీనిపైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి,డీజీపీ అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలి అని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ నియంత్రణ పైన అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలి..ఫోరెన్సిక్ సెంటర్స్,డేటా సెంటర్లని పెంచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. పోలీస్ ట్రైనింగ్ లోనే సైబర్ క్రైమ్ విభాగం లో పని చేయడం కోసం సెలక్షన్ జరగాలని చెప్పారు. అన్ని విభాగాలు,ఉన్నతాధికారుల మధ్య సమన్వయం బాగా పెరగాలని చెప్పారు. స్కిల్స్ యూనివర్సిటీలో సైబర్ క్రైమ్ పైన పోలీస్ విభాగం కోసం ప్రత్యేక కోర్స్ ఏర్పాటు చేయాలి.. విజిలెన్స్ విభాగంలో సాంకేతికతను పెంచాలి అని చెప్పారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే వారి పైన విజిలెన్స్ దృష్టి పెట్టాలి.. డేటా అనాలిస్ ఆధారంగా ఆర్గనైజ్ క్రైమ్ పైన విజిలెన్స్ విభాగం దృష్టి సారించాలని చెప్పారు. విజిలెన్స్‌కు మరిన్ని అధికారాలు ఇచ్చే అంశం పైన అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ప్రమాదం జరిగిన తర్వాత కాకుండా అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ డిపార్ట్మెం ట్ చర్యలు తీసుకోవాలని చెప్పారు. మునిసిపల్ డిపార్ట్మెంట్ ,హైడ్రాతో సమన్వయం చేసుకొని ఫైర్ డిపోర్టమెంట్ పైన జూన్ 15 లోగా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని చెప్పారు. నాలా ల మెయింటెన్స్ లో మెట్రో వాటర్ వర్క్స్ విభాగం తో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. మ్యాన్ హోల్స్ నిర్వహణ పైన పోలీస్, ట్రాఫిక్ పోలీస్,హైడ్రా,మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు.



ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి బోధి పెవిలియన్‌లో పోలీస్ సీనియర్ అధికారులతో సమావేశమైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



## నేడు ప్రధానిమోడీ అధ్యక్షతన అత్యవసర కేబినెట్ భేటీ!

**న్యూఢిల్లీ, మే 20:** ప్రధాని మోడీ అధ్యక్షతన గురువారం అత్యవసర కేబినెట్ సమావేశం నిర్వహించనున్నట్లుమంత్రులందరికీ సమాచారం పంపించారు. మొత్తం కేబినెట్ మంత్రులందరూ దేశరాజధానిలోనే ఉండాలన్న సందేశాలు అందాయి. సేవాతీర్థ్ కాంప్లెక్స్‌లో ఈ సమావేశం ఉంటుందని ప్రస్తుత రాజకీయ పరిణామాలతోపాటు పశ్చిమాసియా ఉద్రిక్తతలు, మోడీ ఐదుదేశాల పర్యటన వివరాలు వంటివి ఇందులో చర్చకు రావచ్చని అంచనా. అలాగే జూన్‌లో కేబినెట్ విస్తరణ ఉండవచ్చన్న సంకేతాలు కూడా ఉన్నాయి. అలాగేప్రస్తుత మంత్రుల్లో కొందరికి మార్పులు,చేర్పులు కూడా తప్పవని చెపుతున్నారు. మోడీ 3.0 ప్రభుత్వం మొదటి వార్షికోత్సవం జూన్10వ తేదీ జరుగుతుంది. ఆ సందర్భంగానే కేబినెట్ విస్తరణ ఉంటుందని విస్తృతంగా చర్చనడుస్తోంది. ప్రధానంగా పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం, అమలులో ఉన్న పొదుపు కార్యాచరణ వంటి వాటిపై చర్చిస్తారని అంచనా. సరఫరా చెయిన్‌కు విఘాతం, ఇంధన సరఫరా సమస్యలు, ద్రవ్యోల్బణం ఇరాన్, ఇరాక్‌లమధ్య మళ్లీ మాటలయుద్ధం వంటివిచర్చకు రానున్నాయి. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రస్తుత సంక్షోభాన్ని అధిగమించాలన్నారు.

## విదేశీ పర్యటనలతో భారత్ ప్రతిష్ట ఇనుమడింపచేస్తున్న ప్రధాని మోడీ:ఎన్సీపి అధినేత శరద్‌పవార్



**ముంబయి, మే 20:** ప్రధాని మోడీ విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తున్న వేళ మిత్రపక్షమైన ఎన్‌సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ ప్రసంశల జల్లు కురింపించారు. రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నా దేశ గౌరవాన్ని కాపాడే విషయంలో రాజకీయాలను పక్కన పెట్టాలని సూచించారు. విదేశాల్లో భారత ప్రతిష్ఠను నిలబెట్టేందుకు ప్రధాని మోడీ పని చేస్తున్నారని శరద్ పవార్ ప్రశంసించారు. ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో శరద్ పవార్ మాట్లాడుతూ దేశ గౌరవాన్ని కాపాడే విషయంలో రాజకీయ విభేదాలను తీసుకురావద్దు. ప్రధాని మోడీ విదేశాల్లో భారత ప్రతిష్ఠను నిలబెట్టేందుకు పని చేస్తున్నారు. మనకు రాజకీయంగా భిన్న అభిప్రాయాలు ఉండొచ్చు. కానీ దేశ గౌరవం విషయంలో రాజకీయాలు అడ్డురాకూడదని వ్యాఖ్యానించారు. దేశ ప్రయోజనాల కోసం కలిసి పని చేసే అవకాశం వస్తే అందరూ ఒకే లక్ష్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, పీవీ.నరసింహారావు, మన్మోహన్ సింగ్ దేశ భవిష్యత్తు, ప్రతిష్ఠను ఎప్పుడూ ముందుంచుకుని నాయకత్వం వహించారని పేర్కొన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సోవియట్ యూనియన్ పర్యటన సందర్భంగా భారత గౌరవం విషయంలో ఎంత కఠినంగా వ్యవహరించారో కూడా శరద్ పవార్ వివరించారు. "నేను 40 కోట్ల భారతీయులను ప్రాతినిధ్యం వహిస్తున్నాను. వారి గౌరవానికి భంగం కలిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించనని ఇందిరాగాంధీ అప్పట్లో చెప్పినట్లు గుర్తుచేశారు.

## టెట్రా ప్యాక్‌లలో మద్యం విక్రయాలా?

### న- తక్షణమే నిషేధం విధించండి - దేశవ్యాప్తంగా ఏకరీతి విధానం రూపొందించాలి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, మే 20:** టెట్రా ప్యాక్‌లు, పిఇటి బాటిళ్లు, సాచెట్ల వంటి గుర్తించలేని ప్యాకేజింగ్‌లో మద్యం అమ్మకాలను సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. ఇటువంటి ప్యాకేజింగ్ మోసపూరితంగా సాధారణ పండ్ల రసాల ఉత్పత్తులను పోలి ఉంటుందని, దీనివల్ల మైనర్ల మద్యం సేవనం, తాగి వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి ప్రమాదాలు పెరుగుతాయని పిటిషనర్ ఆరోపించారు. పిటిషనర్ కమ్యూనిటీ ఎగైనెస్ట్ డ్రంకెన్ డ్రైవింగ్ (సిఎడిడి) తరఫున హాజరైన న్యాయవాది విపిన్ నాయర్, వాదనలు వినిపిస్తూ, పొగాకు ఉత్పత్తుల మాదిరిగా కాకుండా, ఇటువంటి ప్యాకేజింగ్‌లో విక్రయించే మద్య పానీయాలపై ప్రముఖమైన హెచ్చరికలు ఉండవని కోర్టుకు తెలిపారు. "పొగాకు మాదిరిగా కాకుండా, దీనిపై ఎలాంటి హెచ్చరిక ఉండదు. ఈ ప్యాక్‌లు పండ్ల రసాల మాదిరిగానే ఉంటాయి, కానీ వాటిలో ఆపిల్, మిరప, మామిడి వోడ్కా మొదలైన చిత్రాలతో వోడ్కా ఉంటుంది" అని నాయర్ వివరించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, "ఇది చాలా మోసపూరితమైనది" అని మౌఖికంగా వ్యాఖ్యానించారు. అనంతరం కోర్టు, ఈ పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వానికి, అన్ని రాష్ట్రాల ఎక్సైజ్ శాఖలకు నోటీసులు జారీ చేసింది. టెట్రా ప్యాక్‌లు, సాచెట్‌ల వంటి "గుర్తించలేని ప్యాకేజింగ్"లో మద్యం అమ్మకాలను నిషేధించే ఏకరీతి విధానాన్ని రూపొందించాలని, అలాగే బాటిలింగ్‌ను గాజు కంటైనర్లు లేదా స్పష్టంగా కనిపించే ఇతర పాత్రలకు పరిమితం చేసేలా ఎక్సైజ్ చట్టాలను సవరించాలని సూచించింది. మద్యం అమ్మకాలు రోజువారీ పానీయాలను పోలిన పోర్టబుల్ ప్యాకేజింగ్ రూపాల్లో పెరుగుతున్నాయి. దీనివల్ల పార్కులు, సినిమా హాళ్లు, విద్యాసంస్థలు, కదులుతున్న వాహనాల వంటి బహిరంగ ప్రదేశాలలో వీటిని సేవించడం సులభతరం అవుతోంది. "బంటీ ప్రీమియం వోడ్కా", "చెల్లీ మ్యాంగో వోడ్కా", "ప్రీమియం రోమనోవ్ వోడ్కా - ఆపిల్ థ్రిల్" వంటి పేర్లతో, ప్యాకేజింగ్‌పై పండ్ల చిత్రాలతో విక్రయించ బడుతున్న టెట్రా ప్యాక్‌లు వినియోగదారులను తప్పుదోవ పట్టించి, యువతను ఆకర్షించే విధంగా రూపొందించబడ్డాయని పిటిషనర్ వాదించారు. ఇటువంటి ప్యాకేజింగ్ ఉత్పత్తి వ్యయాలను తగ్గిస్తుందని, తద్వారా మద్యం చౌకగా, మరింత సులభంగా అందుబాటులోకి వస్తుందని, ఇందులో మైనర్ వినియోగదారులు, వాణిజ్య వాహన డ్రైవర్లు కూడా ఉన్నారని సిఎడిడి వాదించింది. టెట్రా ప్యాక్‌లు, సాచెట్‌లు తేలికగా, పగలనివిగా, దాచగలిగేవిగా ఉండటం రాష్ట్ర సరిహద్దుల గుండా స్మగ్లింగ్‌ను సులభతరం చేస్తుందని, బహిరంగ ప్రదేశాలలో గుర్తించడం కష్టతరం చేస్తుందన్నారు.



## రైళ్లలో జరిగే ప్రమాదాలు అసాంఘిక శక్తుల కుట్రలే!

**న్యూఢిల్లీ, మే 20:** రైళ్లలో ఇటీవలి కాలంలో వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాల వెనుక కుట్ర ఉన్నదని రైల్వే తెలిపింది. రైళ్లలో మంటలు ప్రమాదవశాత్తు జరిగినవి కావని, సంఘ విద్రోహ శక్తులు ఉద్దేశపూర్వకంగా చేసిన విధ్వంసమని ఆరోపించింది. రైళ్లలో జరిగిన పలు అగ్నిప్రమాద సంఘటనలపై క్షుణ్ణంగా విచారణ జరిపిన అనంతరం విధ్వంసానికి సంబంధించిన ఆధారాలు లభించాయని రైల్వే తెలిపింది. అనేక కేసులలో అసాంఘిక శక్తుల ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొంది. రాజస్థాన్‌లోని అమరపుర, కోట, బెంగాల్‌లోని హౌరా, బీహార్‌లోని ససారం రైల్వే స్టేషన్‌లో జరిగిన నాలుగు సంఘటనలను రైల్వే ప్రస్తావించింది. రాజస్థాన్‌లోని అమరపురా స్టేషన్ సమీపంలో ఒక వ్యక్తి రైలు సీటు లినెన్‌కు నిప్పంటించడానికి ప్రయత్నించగా మంటలు వ్యాపించాయని రైల్వే తెలిపింది. కోటా ఘటనలో రాజధాని ఎక్స్‌ప్రెస్ బాత్రూం నుంచి మంటలు కనిపించాయని పేర్కొంది. హౌరా కేసులో కోచ్‌లోని బాత్రూం నుంచి పెట్రోల్‌తో తడిపిన వస్త్రాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే తెలిపింది. ససారం కేసులో గుర్తుతెలియని వ్యక్తి మండుతున్న వస్తువును ఖాళీ కోచ్ లోపలకు విసిరినట్లు ఆరోపించింది. మరోవైపు సంఘ విద్రోహ శక్తుల చర్యలను చాలా తీవ్రంగా పరిగణిస్తున్నట్లు రైల్వే తెలిపింది. ప్రతి ఘటనను రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ద్వారా వివరణాత్మక దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొంది. ప్రయాణికుల భద్రతకు కట్టుబడి ఉన్నామని రైల్వే పునరుద్ఘాటించింది. ప్రయాణికులు అప్రమత్తంగా, సురక్షితంగా ఉండాలని రైల్వే శాఖ కోరింది.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

**భువనగిరి రూరల్ మే 20 ప్రభాతవా ర్త** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన రాయగిరి పరిధిలోని బైపాస్ రోడ్డుపై దీప్తి హోటల్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై ఎం అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం చందుపట్ల గ్రామానికి చెందిన జమ్ముల లక్ష్మి కాంత్ (24) సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలానికి చెందిన వనపర్తి ప్రమోద్ (23)తండ్రి శివయ్య రాయగిరి లోని యూనిటీ కళాశాలలో చదువుతున్నారు. ఇద్దరూ కలిసి మోటార్ సైకిల్ పై రాయగిరి నుంచి భువనగిరికి వెళ్తుండగా మార్గమధ్యంలో దీప్తి హోటల్ సమీపంలో వెనక నుండి అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఇద్దరు రోడ్డుపై ఎగిరి పడి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందడంతో స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మృతుని తండ్రి జమ్ముల పెంటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

## తెలంగాణ ఉద్యమ కారుల హక్కుల సాధనకు కృషి చేస్తా

### ఉద్యమకారుల కమిటీ సభ్యుడు రాములునాయక్ హామీ

**సైఫాబాద్, మే 20 ప్రభాతవార్త:** ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తెలంగాణ సాధన కోసం ఉద్యమించిన ఉద్యమకారుల హక్కుల సాధన కోసం కృషి చేస్తానని ప్రభుత్వం నియమించిన ఉద్యమకారుల కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాములునాయక్ ఉద్యమకారులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఉద్యమకారుల సమస్యలను పరిష్కారించేందుకు సిఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో సానుకూలంగా ఉన్నారని, అందుకే ప్రత్యేకంగా ఉద్యమకారుల కమిటిని వేయడం జరిగిందని, ఈ కమిటికి తాను సభ్యుడిగా ఉండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఉద్యమకారుల డిమాండ్లు ఇంటి స్థలం, పెన్షన్, గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు, ఉచిత రవాణా తదితర సమస్యలను సిఎం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి తనవంతు సహాయం, సహకారం అందిస్తానని రాములునాయక్ భరోసా ఇచ్చారు. ఉద్యమకారులకు మోసం చేసిన వారికి, ఉద్యమాన్ని, పాలనను అడ్డుపెట్టుకుని కోట్లాది రూపాయలు దండుకున్న వారికి ఉసురు తగులుతుందని ఆయన హెచ్చరించారు. కమిటికి చెందిన మరొక సభ్యుడు మోతే శోభన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారులవి న్యాయమైన డిమాండ అమోదం కోసం కృషి చేస్తామన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు వొరుగంటి ఆనంద్ మాట్లాడుతూ ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇవ్వాలని, పెన్షన్ ప్రతినెల 25 వేలు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు పంపిణిచేయాలని, ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఫోరం నాయకులు కొంతం యాదిరెడ్డి, విష్ణవర్ధన్, జానికిరెడ్డి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.రాములునాయక్

## ప్రమాదవశాత్తు కోనేరులో పడి ముగ్గురు చిన్నారులు మృతి

**మేడిపల్లి, ప్రభాతవార్త :** దైవ దర్శనానికి వెళ్లి దేవుని సన్నిధానంలో ఆనందంగా గడుపుదామన్న క్రమంలో విధి ఆడిన ఆటలో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. మేడిపల్లి మండలంలోని కొండపూర్ గ్రామంలో ఒక పాపతో పాటు ఇద్దరు చిన్నారులు ప్రమాదవశాత్తు కోనేరులో పడి ప్రాణాలు కోల్పోయారు. కొండాపూర్ గ్రామానికి చెందిన మనవిత్ (13), మనస్విని (11), షర్విండ్ (7) అనే ముగ్గురు చిన్నారులు కుటుంబ సభ్యులతో కలిసి గ్రామ శివారులోని శివగంగ ఆలయంకు చేరుకున్నారు. తల్లిదండ్రులు వారి పనిలో నిమగ్నమై ఉండగా ముగ్గురు పిల్లలు ఆలయం సమీపంలో గల కోనేరు పరిసర ప్రాంతంలో ఆడుకోవడానికి వెళ్లారు. ఈ క్రమంలో గ్రామంలోని కోనేరు సమీపంలోకి వెళ్లిన చిన్నారులు ప్రమాదవశాత్తు అందులో పడిపోయారు. లోతు ఎక్కువగా ఉండటంతో నీటి నుంచి బయటకు రాలేక ఊపిరాడక ముగ్గురూ నీటిలోనే ప్రాణాలు విడిచారు. చిన్నారులు కోనేరులో పడిపోయిన విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు గాలించి చిన్నారుల మృతదేహాలను వెలికితీశారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. ముక్కుపచ్చలారని చిన్నారులు మిగతా జీవులుగా మారడంతో ఆ కుటుంబాల తల్లిదండ్రులు, బంధువులు విలపించిన తీరుతో గ్రామస్తులు కంటతడిపెట్టారు.ప్రమాదవశాత్తు కోనేరులో పడి ప్రాణాలు కోల్పోయిన చిన్నారుల మరణం నిరక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. చిన్నారుల నవ్వులు ఒక్క క్షణంలో మూగబోగా ఆ బాధను మాటల్లో చెప్పలేకుండా పోయింది. జరిగిన ప్రమాదం ఒక క్షణం మాత్రమే అయినప్పటికీ ఆ చిన్నారుల తల్లిదండ్రుల కన్నీళ్లు జీవితాంతం ఆగవని, ఒక్క క్షణం జాగ్రత్త ఉంటే.. రెండు కుటుంబాల్లో ఈ రోజు విషాదం ఉండేది కాదని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



## వైమానిక దాడుల్లో 175 మందికిపైగా ఐసిస్ మిలిటెంట్లు హాతం!

**అబూజా, మే 20:** పశ్చిమాఫ్రికా దేశం నైజీరియాలో ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) ఉగ్రవాదులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. దేశ ఈశాన్య ప్రాంతంలో అమెరికా, నైజీరియా బలగాలు సంయుక్తంగా జరిపిన వైమానిక దాడుల్లో 175 మందికి పైగా ఐసిస్ ఫైటర్లు హతమయ్యారు. ఈ విషయాన్ని నైజీరియా సైన్యం అధికారికంగా ధ్రువీకరించింది. నైజీరియా ఆర్మీ అధికార ప్రతినిధి సమైలా ఉబా ప్రకటన విడుదలచేస్తూ యుద్ధ క్షేత్రంలో 175 మందికి పైగా ఐసిస్ మిలిటెంట్లు హతమయ్యారని తెలిపారు. ఈ దాడుల్లో ఉగ్రవాదుల చెక్‌పోస్టులు, ఆయుధ డిపోలు, లాజిస్టిక్స్ కేంద్రాలతో పాటు వారికి నిధులు సమకూర్చే నెట్‌వర్క్‌ల ప్రధాన కార్యాలయాలను కూడా ధ్వంసం చేసినట్లు వివరించారు. కొన్ని నెలలుగా నైజీరియా, అమెరికా మధ్య సైనిక సహకారం గణనీయంగా పెరిగింది.

గత వారం కూడా ఇరు దేశాల బలగాలు సంయుక్తంగా జరిపిన ఆపరేషన్‌లో ఐసిస్ గ్లోబల్ సెకండ్‌ఇన్‌కమాండ్ అబుబిలాల్ అల్ మినుకి హతమయ్యాడు.

## జూన్ 2లోగా ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలి




**ధర్నాచౌక్, మే 20, ప్రభాతవార్త:** రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, యువ వికాసం, విద్యార్థి భరోసా పేరుతో నిరుద్యోగులకు ఆశ చూపించి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నిండా ముంచిందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, జూన్ 2వ తేదీలోపు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిరుద్యోగుల ఆవేదన సభ పేరుతో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు నిరుద్యోగ జేఏసీ నేతలు అస్మా, కిరణ్ రాథోడ్, ఆజ్మీరా బాలకోటి నాయక్, కయ్యు వెంకటేష్, కుమార్ రాథోడ్, హరిష్, కాశీనాథ్, ధర్మారపు పవన్‌కుమార్, మోహన్ తదితరులు పాల్గొని ప్రసంగించగా బీఆర్ఎస్ విద్యార్థి నాయకులు గెల్లు శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ ఎన్నో ఆశలతో కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగం విలయ తాండవం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాలలో ఒక్క నోటిఫికేషన్‌కూడా లేదని, నోటిఫికేషన్లు విడుదల చేయాలంటే డీఎస్సీ నోటిఫికేషన్‌కు అడ్డంకిగా ఉన్న జీవో నెంబర్ 108, పోలీస్ నోటిఫికేషన్ కు 46, డిగ్రీ లెక్చరర్ నోటిఫికేషన్‌కు జీవో నెంబర్ 04, గురుకుల ఉద్యోగాలకు జీవో నెంబర్ 81, గ్రూప్స్ నోటిఫికేషన్‌కు జీవో నెంబర్ 29లను రద్దు చేసి, నోటిఫికేషన్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఓటీఆర్‌కు ఆఖరు తేదీ షరతు పెట్టకూడదని, సైట్ ఎప్పుడూ అందుబాటులో ఉండాలని కోరారు. జాబులు లేని జాబ్ క్యాలెండర్ రెండు సార్లు విడుదల చేసి, నిరుద్యోగుల మనోభావాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుకుందని, అధికారంలోకి వచ్చి రెండున్న సంవత్సరాలు గడిచినా ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, నోటిఫికేషన్లకు అడ్డుగా ఉన్న జీవోలను రద్దు చేసి, జూన్ 2వ తేదీ లోగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని, లేనిపక్షం తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని తలపిస్తూ నిరుద్యోగ ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించకపోతే జూన్ 3వ తేదీన నిరుద్యోగుల భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ ఆవేదన సభలో వేలాది మంది నిరుద్యోగులు పాల్గొన్నారు.

## వేగంగా ధాన్యం కొనుగోళ్లు

### ఇప్పటి వరకు 45.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ: రాష్ట్ర పౌరసరఫరాలశాఖ

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా యాసంగి/రబి సీజన్ ధాన్యం కొనుగోళ్లు అత్యంత వేగంగా, రికార్డు స్థాయిలో కొనసాగుతున్నాయని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ పేర్కొంది. ఈ విషయమై బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 45.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించింది. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ఇప్పటి వరకు 6.3లక్షల మంది రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి రూ.7,508 కోట్ల చెల్లింపులను నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసినట్లు పేర్కొంది. ఈ యాసంగిలో నిర్ణయించిన మేరకు 8575 కొనుగోలు కేంద్రాలకు అన్నింటిని తెరిచి పూరిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నట్లు వెల్లడించింది.

## 59 యేళ్ల తర్వాత తమిళనాడులో కేబినెట్‌లోకి కాంగ్రెస్

### నేడు ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం

**చెన్నై, మే 20:** తమిళనాడులో సీఎం విజయ్ పుణ్యమా అని కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులువచ్చాయి. ఆ రాష్ట్రంలో 59 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ మంత్రివర్గంలో చోటు దక్కించుకోనుంది. గురువారం ఏర్పడనున్న క్యాబినెట్‌లో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటు కల్పిస్తూ టీవీకే అధినేత, సీఎం విజయ్ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ప్రకటించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజేష్ కుమార్, పి.విశ్వనాథన్‌లు విజయ్ మంత్రివర్గంలో చేరబోతున్నట్లు వెల్లడించారు. తమిళనాడులో కాంగ్రెస్ పార్టీకి ఇది చారిత్రక సందర్భం అని, 59 ఏళ్ల తర్వాత ప్రభుత్వంలో చేరబోతున్నామని వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా తమ పార్టీ నుంచి మంత్రులుగా చేరనున్న ఎమ్మెల్యేలకు వేణుగోపాల్ శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ డీఎంకేతో కలిసి పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఫలితాల అనంతరం కాంగ్రెస్ పార్టీ డీఎంకే కూటమి నుంచి బయటకు వచ్చి టీవీకేతో చేరింది. టీవీకే ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించింది. 234 అసెంబ్లీ స్థానాలున్న తమిళనాడులో ఏ పార్టీకీ మెజారిటీ రాలేదు. టీవీకే అత్యధికంగా 107 సీట్లు సాధించింది.

అధికారం ఏర్పాటు చేసేందుకు 118 సీట్లు అవసరం. దీంతో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్, వీసీకే పార్టీలతో కలిసి కూటమిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఏఐఏడీఎంకే తిరుగుబాటు ఎమ్మెల్యేలు కూడా విజయ్ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారు. దీంతో విజయ్ ప్రభుత్వం అవిశ్వాసం నెగ్గింది. విజయ్ పార్టీకి మెజారిటీ రాకపోవడం అనుకోకుండా కాంగ్రెస్ పార్టీకి కలిసివచ్చింది. మంత్రివర్గంలో చేరేందుకు అవకాశం కల్పించింది.





# కుంకుమ పువ్వు తేజస్సు !

సూర్యరశ్మి వల్ల చర్మం సహజ నూనెలను కోల్పోయి కళావిహీనంగా కనిపిస్తుంది. వేసవిలో బయటకి వెళ్లినా చర్మాన్ని కాంతిమంతంగానూ, ఆరోగ్యంగానూ కనిపించేలా చేయడానికి కుంకుమపువ్వు చక్కని పరిష్కారం. కుంకుమపువ్వులో ఉండే క్రోసిన్, క్రోసెటిన్, యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని యూవీ కిరణాల నుంచి కాపాడతాయి. ఇందుకు మీరు రోజూ ఉపయోగించే సన్‌స్క్రీన్ లోషన్‌లో కాస్త కుంకుమపువ్వు కలిపి రాస్తే ఎండతాపం నుంచి చర్మం సురక్షితంగా ఉంటుంది. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు, సూర్యరశ్మి వల్ల ఏర్పడే పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తుంది. దీని కోసంకావాల్సినంత పెరుగు లేదా పాలు తీసుకుని చిటికెడు కుంకుమ పువ్వు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పావు గంటాగి చల్లటి నీటితో శుభ్రం చేస్తే సరి. చర్మం కాంతి వంతంగా అయి, డార్కస్పాట్స్ కూడా తగ్గుతాయి. కుంకుమ పువ్వు వాడటంవల్ల చర్మం సహజ తేమను కోల్పోకుండా ఉంటుంది. ఇందుకు గ్లాసు నీటిలో చిటికెడు కుంకుమపువ్వు వేసి రాత్రంతా నానబెట్టి మరుసటి రోజు ఉదయం తాగాలి. దీనివల్ల సహజ మెరుపు సంతరించు కుంటుంది. దీనిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు యూవీ కిరణాలతో పోరాడి అకాల వృద్ధాప్యఛాల్ని దరిచేరనీయ కుండా చేస్తాయి. కుంకుమపువ్వులో ఉండే కెరోటినాయిడ్స్ మెలనిన్ ఉత్పత్తిని తగ్గించి చర్మాన్ని ప్రకాశవంతంగా చేస్తాయి. అంతేకాదు విటమిన్, ఖనిజాలు పుష్కలంగా ఉండి రోగ నిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి.

# గురుభక్తి !

రాఘవేంద్ర స్వామి ఆధ్యాత్మిక భావనలో ప్రధానమైనది గురుభక్తి . ఆయన బోధనలు మనలో భక్తిని మాత్రమే కాదు, మానవత్వాన్ని కూడా పెంపొందిస్తాయి. గురువు అనుగ్రహం ఉంటే అసాధ్యం కూడా సాధ్య మవుతుంది” అనే విశ్వాసానికి శ్రీ రాఘవేంద్రస్వామి ప్రతీక. జీవితం మనిషి ఎలా భక్తి, వినయం, ధర్మంతో జీవించాలో చూపించిన మహోన్నత మార్గం. ఆయన చెప్పిన ఆధ్యాత్మిక సారం ఏమిటంటే : మనసు పవిత్రంగా ఉంటే దేవుడు మనలోనే ఉంటాడు. భక్తి అనేది కేవలం పూజలు కాదు; మంచితనం కూడా భక్తియే. ఇతరులకు సహాయం చేయడం దేవునికి చేసిన సేవతో సమానం. కష్టకాలంలో భయపడకుండా గురువును స్మరించాలి. అహంకారాన్ని విడిచిపెడితే దైవకృప లభిస్తుంది. ఇప్పటికీ ‘ గురు రాయరు’ను స్మరించి తమ జీవితాల్లో మార్పును అనుభవిస్తున్నారు. ‘శ్రీ గురు రాఘవేంద్రాయ నమః’.. అనే నామస్మరణ మనసుకు ప్రశాంతతను, జీవితానికి ధైర్యాన్ని అందిస్తుంది. కేవలం ఒక యతి మాత్రమే కాదు; కోట్లాది మందికి ఆధ్యాత్మిక మార్గదర్శి. ఆయన పేరు స్మరించినా భక్తుల హృదయాల్లో ధైర్యం, విశ్వాసం, ప్రశాంతత కలుగుతాయి. కలి యుగంలో దైవాను గ్రహానికిప్రతీక గురు రాఘవేంద్రస్వామి.



# పెంపకమే ఆలంబనగా.. !



పిల్లలకు మొదటి పాఠశాల ఇల్లే.. తల్లిదండ్రుల ప్రభావం, వారి పెంపకంలోనే వ్యక్తిత్వం తీర్చి దిద్దుకుంటారు. భవిష్యత్తులోకి అక్కడి నుంచే అడుగులేస్తారు. పెంపకానికి ఇంతటి ప్రాముఖ్యం ఉంది. అయితే దీని వెనక ఉన్న తల్లిదండ్రులు, వారు పెంచే విధానాలు పలు రకాలు. వీటిని బట్టి పిల్లలెలా ప్రభావితుల అవుతారు.

**దండించి చెబితే..** పిల్లలపట్ల తల్లిదండ్రులు నిరంకుశత్వాన్ని ప్రదర్శిస్తారు. క్రమశిక్షణ తప్పిందా.. దండిస్తారు. ప్రతి విషయం తమకు నచ్చేలా చేయాలని పిల్లలపై ఒత్తిడి తెస్తారు. నియమ నిబంధనలు పాటించేలా చేస్తారు. ఎదురు ప్రశ్నించే అవకాశాన్ని వ్వరు. ఈ పెంపక ప్రభావంతో పిల్లలు యుక్త వయసుకొచ్చేసరికి నలుగురితో కలవలేకపోవడం, కుంగుబాటు లాంటి మానసిక అనారోగ్యాలకు లోనవుతారు. యూనివర్సిటీ ఆఫ్ లూవెన్ అధ్యయనంలో ఇది వెల్లడైంది కూడా. కొరవడిన ఆత్మవిశ్వాసంతో, చిన్న వైఫల్యాన్ని కూడా అంగీకరించలేని స్థితిలో ఉంటారు.

**మీరే లక్ష్యాన్ని నిర్ణయిస్తే...** ఈ రకమైన పెంపకంలో పిల్లలు తమ అభిప్రాయాలను చెప్పడానికి తల్లిదండ్రులు స్వేచ్ఛనిస్తారు. పొర పాట్లు చేస్తే వాటి నుంచి పాఠాలు నేర్చుకోవడానికి అవకాశాలన్ని స్తారు. అయితే తమ లక్ష్యాలనే పిల్లలు సాధించాలని కోరుతారు. పిల్లలకంటూ ప్రత్యేక అభిప్రాయం ఉండటం వీరికి నచ్చదు. తప్పటడుగు వేసినా, అనుకున్న ఆశయాలను వారు చేరలేక పోయినా శిక్షిస్తారు. ఇలా పెరిగిన పిల్లల్లో క్రమశిక్షణ ఉన్నా.. నచ్చిన రీతిలో ఉండే స్వేచ్ఛ లేదనే వేదన ఉంటుంది. అందరికన్నా ముందు ఉండాలనీ, ఎదుటివారితో నిత్యం పోటీగా ఉంటూ.. అన్నింటిలో తామే నెగ్గాలనే ఆలోచన వీరిలో కనిపిస్తుంది. తల్లిదండ్రులకోసం నచ్చని లక్ష్యాన్ని చేరుకొని అసంతృప్తిగా జీవిస్తారు.

**స్నేహంగా ఉంటూ..** అరుదుగా పిల్లలను క్రమశిక్షణలో ఉంచుతారు. సంతానం నుంచి ఎక్కువగా ఆశించరు. పిల్లలతో స్నేహంగా ఉంటారు. వారి ఆశయాలు, లక్ష్యాలకు విలువనిచ్చి స్వేచ్ఛనిస్తారు. పిల్లలపట్ల బాధ్యతగా ఉంటారు తప్ప, అధికారాన్ని ప్రదర్శించరు. ఈ పెంపకంలో పిల్లలు అనుకున్నంత ఉన్నత స్థానాలు చేరుకోలేకపోయినా.. జీవితంలో ఎదురయ్యే సమస్యలను తేలికగా పరిష్కరించుకోగలుగుతారు.

**బాధ్యత లోపిస్తే..** పిల్లలపట్ల తల్లిదండ్రులు నిర్లక్ష్య ధోరణి ప్రదిర్శస్తారు. మాటామంతీ ఎక్కువ ఉండదు. కన్నందుకు బాధ్యత వహిస్తామనే ధోరణి కనిపిస్తుంది. అవసరాలన్నీ తీరుస్తారు తప్ప పిల్లల భవిష్యత్తును పరిగణనలోకి తీసుకోరు. సలహా సూచనల్వీరు. మరి కొందరైతే పిల్లల బాధ్యతను కొంచెం కూడా పట్టించుకోరు. అవసరాలు తీర్చాలనే ఆలోచనా ఉండదు. వేధింపులకూ గురి చేస్తుంటారు. ఇటువంటి తల్లిదండ్రుల వద్ద పెరిగిన పిల్లలు యుక్తవయసుకొచ్చేసరికి స్వీయ నియంత్రణ కోల్పోతారు. పెద్దగా సక్సెస్ కాలేక, కారణం ఎదుటివారే అనే భావనలో ఉంటారు.

# పోషకాలతో సాంత్వన !



పాలు పోషకాలతో నిండి ఉంటాయి చిన్నా, పెద్దా.. అందరూ క్రమం తప్పకుండా తీసుకుంటే అనారోగ్యం బారిన పడకుండా ఉంటాం. పాలలోని పోషకాలు మనకు శక్తితోపాటు రక్షణనూ ఇస్తాయి. మరి ఈ పాలలో ఉండే మరిన్ని సుగుణాలు ఉన్నాయి. పాలలో క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, జింక్, ఫాస్ఫరస్ పాంథోనిక్ యాసిడ్, సెలీనియమ్, నియాసిన్ లాంటి మూలకాలు, విటమిన్-ఎ, డి, బి6 లాంటి పోషకాలుంటాయి. వీటిలోని క్యాల్షియం దంతాలు, ఎముకలు దృఢంగా ఉండటానికి తోడ్పడుతుంది. ఆస్టియోపోరోసిస్ నుంచి కాపాడుతుంది. మాంసకృత్తులు కండరాలు బలపడటానికి దోహదపడతాయి. రోజూ రాత్రిపూట గ్లాసు పాలు తాగితే చక్కగా నిద్రపడు తుంది. కండరాలన్నీ సాంత్వన చెందుతాయి కూడా. బరువు తగ్గలనుకునే వారికి పాలు చక్కటి ఎంపిక. గోరువెచ్చని పాలలో కాస్తంత పసుపు వేసుకుని తాగితే గొంతు నొప్పి, జలుబు దూరమవుతాయి. పోషకాలుండే పాలను రోజూ రెండు పూటలా తాగితే చర్మం కాంతిమంతంగా తయార వుతుంది. పాలలోని విటమిన్లు, మినరల్స్ ఒత్తిడిని తగ్గిస్తాయి. . బడలికగా, అలసటగా అనిపించినప్పుడు ఓ గ్లాసు పాలు తాగి చూడండి. నిస్స త్తువ వెంటనే పోతుంది. క్రమం తప్పకుండా తాగుతూ ఉంటే శరీరం డీ హైడ్రేట్ అవదు.

# వ్యథ — కౌన్సెలింగ్ అవసరం

**ప్రశ్న:** 17 ఏళ్ల మా అమ్మాయి వయసుకు మించిన శృంగార ఆలోచనలతో సతమతం అవుతోంది. ఏ ఇద్దరిని చూసినా వారు ఒకరినొకరు కౌగిలించుకుని ముద్దు పెట్టుకుంటున్నట్టు స్ఫురిస్తుంది. ఆవిషయం వారికి చెప్పాలనిపించి చెప్పే స్తుంది. ఇది తప్పని ఆమెకు తెలిసినా ఊహలు వెంటాడు తున్నాయి. చిన్నప్పుడు ఒక సినిమాలో ముద్దు దృశ్యం చూసింది. ఆ తరువాత యూ ట్యూబ్ లో అలాంటివి చూసింది. ఇప్పుడు వద్దన్నా తన మనసును ముసురుకుంటున్న ఆలోచనలు కనిపిస్తున్న శృంగార దృశ్యాలు వల్ల ఒత్తిడికి గురవుతోంది. ఆత్మ హత్య చేసుకుని దేవుని వద్దకు వెళ్ళి మా ఇంటి సమస్యలు పరిష్కరించాలని కోరుతానంటోంది. ఈ సమస్య రెండు నెలల నుంచి ఉంది. గత రెండు వారాలుగా సైకియాట్రిస్ట్ ఇస్తున్న మందులు వాడుతున్నాము. అయినా ఎలాంటి మార్పు రాలేదు. మందుల వల్ల ఆకలి మందగించింది. ఒక్కో సారి చేతులు వణుకుతున్నాయి. ఈ నేపద్యంలో ఆమె త్వరగా కోలుకునే మార్గం చెప్పండి

**- ఒక సోదరి, చిత్తూరు**

**జవాబు:** అమ్మా ,మీ ఆవేదన అర్థం అయ్యింది. అయితే ఆమెపట్ల చెడుగా ఆలోచించద్దు. చిన్న వయసులో చూసిన శృంగార దృశ్యాలు, యూట్యూబ్ కంటెంట్, ఊహాశక్తి, భయం, అపరాధ భావన కలిసిపోవడం వల్ల కొందరు పిల్లల్లో ఇలాంటి అనవసర ఆలోచనలు పదేపదే మెదడులోకి వస్తుంటాయి. ఈ సమస్యను ‘ఇంట్రూసివ్ థాట్స్” లేదా అబ్సెసివ్ కంపల్సివ్ ఆలోచనలుగా పరిగణిస్తారు. ఆ ఆలోచనలు నచ్చకపోయినా, వాటిని ఆపాలని ప్రయత్నించిన కొద్దీ అవి మరింతగా గుర్తుకు రావడం జరుగుతుంది. దీనివల్ల ఒత్తిడి డిప్రెషన్ పెరిగి ఆత్మహత్య చేసుకుని దేవుడిని అడగాలి అన్న భావం కలిగింది. ఆమెను ఒంటరిగా వదలకుండా, ప్రేమతో దగ్గరగా ఉండండి. అలా ఆలోచవద్దు,, పాపం వస్తుంది వంటి మాటలు పరిస్థితిని మరింత తీవ్రం చేస్తాయి. ఆలోచనలు వచ్చినప్పుడు వాటిని బలవంతంగా ఆపాలని ప్రయత్నిస్తే అవే మరింత పెరుగుతాయి. దాని బదులు,సరే ఈ ఆలోచన వచ్చింది, కొద్దిసేపటికి పోతుంది అనే స్వీకరణ భావన నేర్పాలి. యూట్యూబ్, ఫోన్ వినియోగం నియంత్రించాలి. ఖాళీగా ఉండకుండా అభిరుచులు పెంచండి. నిద్ర, పోషకాహారం పట్ల శ్రద్ధ చూపండి. మందులు ద్వారా కేవలం రెండు వారాల్లోనే పూర్తి మార్పు కనిపించక పోవచ్చు. కొన్ని మందులు పనిచేయడానికి 4-6 వారాలు పడుతుంది. చేతులు వణకడం, ఆకలి తగ్గడం వంటి దుష్ప్రభావాలు ఉంటే చికిత్స చేస్తున్న సైకియాట్రిస్ట్‌కు తెలపండి. మోతాదు లేదా ఔషధం మార్చవచ్చు. సైకాలజిస్టు ద్వారా కౌన్సెలింగ్ చేయించండి, కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ, రిలాక్సేషన్ పద్ధతుల ద్వారా అపరాధ భావన, భయాన్ని తగ్గించి ఆత్మవిశ్వాసం పెంచుతారు. ఇది చికిత్సకు సహాయకారిగా పనిచేసింది. ఆమె పట్ల ప్రేమతో వ్యవహరించండి.



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

**చెలి** సామాజిక పరిణామ క్రమంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చాలంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని ‘వార్త’ సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు, ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం. ఈ మెయిల్:Cheli@vaartha.com

# తెర





## ‘రమణి కళ్యాణం’ చిత్రం ట్రైలర్.

ఈ మధ్యకాలంలో ప్రేక్షకులు భారీ యాక్షన్, హంగామా కంటే మనసుకు దగ్గరయ్యే కథలకే ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు. ముఖ్యంగా ఫ్యామిలీతో కలిసి చూసేలా ఉండే క్లీన్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్స్ కోసం ఆడియన్స్ ఎదురుచూస్తున్నారు. అలాంటి సమయంలో రమణీ కళ్యాణం మంచి ఫీల్‌గుడ్ సినిమాలా కనిపిస్తోంది. ఇప్పటికే టీజర్, టైటిల్ సాంగ్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా, ఇప్పుడు ట్రైలర్‌తో అంచనాలను మరింత పెంచేసింది. కోల్పోయిన ప్రతి వారి దగ్గర ఒక కథ ఉంటుంది” అనే డైలాగ్‌తో మొదలయ్యే ట్రైలర్ మొదటి క్షణం నుంచే కథలోకి తీసుకెళ్లింది. సంజన ఆర్‌జి అండ్ సింగర్. తనకి చుపులేదు.. మరోవైపు నడవలేని స్థితిలో ఉంటాడు రాజ్. ఈ రెండు పాత్రల మధ్య ప్రేమ కథని చాలా ఎంటర్టైనింగ్ అలాగే ఎమోషనల్‌గా చెప్పారు డైరెక్టర్ విజయ్ ఆదిరెడ్డిసూర్య వశిష్ట, దీప్షిక చంద్రన్ కెమిస్ట్రీ చాలా సహజంగా అనిపించింది. ఇద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు ట్రైలర్‌కు మంచి ఫీల్ తీసుకొచ్చాయి. కోర్ట్ ఫేం రామ్ జగదీష్ రాసిన డైలాగ్స్ ట్రైలర్‌కు మరో బలం. విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కైట్స్ క్రియేటివ్స్ బ్యానర్ ని నిర్మిస్తున్నారు. మే 22న విడుదల కానున్న రమణీ కళ్యాణం ప్రస్తుతం ట్రైలర్‌తో ఫ్యామిలీ ఆడియన్స్‌లో మంచి ఆసక్తిని పెంచుతోంది.

## ‘ఎన్టీఆర్ నీల్’ టైటిల్ ‘డ్రాగన్’ అదిరిపోయే పవర్‌ఫుల్ గ్లింప్స్



ప్రపంచ వ్యాప్తంగా మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్‌కు ఉన్న మాస్ క్రేజ్ గురించి అందరికీ తెలిసిందే. ఈయన తాజాగా సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్‌తో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ఈ డైరెక్టర్ తెరకెక్కించిన కెజియఫ్ సిరీస్, సలార్ పార్ట్ వన్ చిత్రాలు బ్లాక్ బస్టర్ విజయాలను సాధించాయి. ఇప్పుడు ఎన్టీఆర్ నీల్ కాంబోలో రూపొందుతోన్న హై ఎక్స్‌పెక్టెడ్ మూవీ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. భారీ అంచనాలున్న ఈ చిత్రం శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోంది. ఎన్టీఆర్‌నీల్ మూవీ అప్‌డేట్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ సినిమా టైటిల్‌ను ‘డ్రాగన్’గా ఖరారు చేస్తూ ఎన్టీఆర్ పాత్రను పరిచయం చేశారు. దీనికి సంబం ధించిన గ్లింప్స్ విడుదలైంది. 4 నిమిషాల 28 సెకన్ల ఈ గ్లింప్స్ 1967 నేపథ్యంలో నడిచే చీకటి ప్రపంచాన్ని చూపిస్తుంది. రుక్మిణి వసంత్ పాత్రను పరిచయం చేవారు. ఈ కథ ‘గోల్డెన్ ట్రయాంగిల్’ ప్రాంతంలోని అంతర్జాతీయ అఫీమ్ (ఓపియం) అక్రమ వ్యాపారం నేపథ్యంలో సాగుతుంది. ఎన్టీఆర్ ఇందులో లూగర్ అనే పాత్రలో.. అఫ్గాన్ ట్రేడింగ్ కంపెనీకి చెందిన అస్సాసిన్ఇన్‌చీఫ్ అనే భయంకరమైన కొత్త అవతారంలో కనిపిస్తారు. రుక్మిణి వసంత్ ఆయన్ని డెవిల్ అని సంబోధిస్తుంది. ఎన్టీఆర్ డైలాగ్ చెప్పే తీరు, స్క్రీన్‌పై ప్రెజెన్స్ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. సన్నగా, దృఢమైన ఫిజిక్‌తో పాటు డిఫరెంట్ లుక్‌లో ఎన్టీఆర్ కనిపించడంతో ఈ సినిమాపై ఉన్న హైప్ నెక్స్ట్ లెవల్‌కు చేరింది. బాలీవుడ్ నటుడు అనీల్ కపూర్ ఈ చిత్రంలో భారత నార్కోటిక్స్ బ్యూరో చీఫ్ రఘువీర్ రాథోడ్ పాత్రలో నటించారు. డ్రాగన్ మూవీపై ఆసక్తిని, ఉత్సాహాన్ని పెంచేలా చిత్రబృందం సినిమా విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రం 2027 జూన్ 11వ తేదీ ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. డ్రాగన్ మూవీ తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం తదితర భాషల్లో విశేష ప్రేక్షకాదరణతో విడుదల కానుంది. ఎన్టీఆర్ నీల్ మూవీగా ఈ ‘డ్రాగన్’ భారీ యాక్షన్‌తో పాటు ఆసక్తికరమైన కథను కలగలిపిన థ్రిల్లింగ్ అనుభూతిని అందించబోతోందని అందరూ భావిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై ఈ చిత్రాన్ని కళ్యాణ్‌రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు.

## ‘డోంట్ స్లీప్’ ఫస్ట్ లుక్ రిలీజ్




‘చౌర్య పాఠం’లో ఆకట్టుకున్న ఇంద్ర రామ్ హీరోగా, మమ్ముట్టి నటించిన ‘స్ట్రీట్ లైట్స్’కి దర్శకత్వం వహించిన సినిమాటో గ్రాఫర్ షామ్‌దత్ దర్శకత్వంలో సైకలాజికల్ థ్రిల్లర్ ‘డోంట్ స్లీప్’ రూపొందుతోంది. వి.చూడామణి ఈ చిత్రాన్ని వి డ్రీమ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం 2 గా నిర్మిస్తున్నారు. ఇప్పటికే రివిల్ చేసిన టైటిల్, ఫస్ట్ లుక్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రంలో ప్రముఖ నటుడు సునీల్ థాపా ఓ కీలక పాత్ర పోషిస్తు న్నారు. ఆయన జన్మదిన సందర్భంగా ప్రేమతో స్మరించుకుంటూ ఈ చిత్రంలో ఆయన ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఆయన పోషించిన ‘టాంజిన్’ పాత్ర పవర్‌ఫుల్‌గా, ప్రభావవంతంగా ఉండబోతోంది. తన ప్రత్యేకమైన స్క్రీన్ ప్రెజెన్స్, నటనతో సునీల్ థాపాప్రేక్షకు లను మెస్మరైజ్ చేయనున్నారు. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం పని చేస్తోంది. ‘పుష్ప: ది రైజ్’ చిత్రానికి పనిచేసిన మోనికారామకృష్ణ ప్రొడక్షన్ డిజైన్‌ను నిర్వహిస్తున్నారు.

## ‘మరీచిక’ ట్రైలర్ విడుదల..



నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ సతీష్ కాసెట్టి తన కొత్త థ్రిల్లర్ మూవీ ‘మరీచిక’తో మరోసారి తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి సిద్ధమయ్యారు. వైవిధ్యమైన , ఆలోచింపజేసే కథలను చూపడంలో ప్రత్యేక గుర్తింపు పొందిన డైరెక్టర్ మరోసారి తనదైన శైలిలో ఈసారి కూడా ఆసక్తికరమైన సినీ అనుభూతిని అందించినట్టు ట్రైలర్ చూస్తుంటే అనిపిస్తోంది. ఈ చిత్రంలో రెజీనా కసాండ్రా, అనుపమ పరమేశ్వరన్, విరాజ్ అశ్విన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సినిమా మే 29న భారీ స్థాయిలో థియేటర్లలో భారీ ఎత్తున విడుదలకు సిద్ధమవుతోంది. చిలక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక, మేఘా చిలక ఈ చిత్రాన్ని నిర్మిస్తు న్నారు. తాజాగా శనివారం విడుదలైన ఈ మూవీ ట్రైలర్ ప్రేక్షకుల్లో సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. ‘మరీచిక’ ట్రైలర్‌ను గమనిస్తే ఎమోషన్స్‌తో పాటు మిస్టరీ అంశాలతో ప్రారంభమైంది. ఇందులో వెంకట లక్ష్మి అనే పల్లె టూరి అమ్మాయి పాత్రలో అనుపమ పరమేశ్వరన్ కనిపించారు. సంజు పాత్రలో విరాజ్ అశ్విన్ కనిపించగా.. మరీచిక పాత్రలో రెజీనా కసాండ్రా కనిపించారు. సంజుని మరీచిక చంపేసిం దంటూ అనుపమ పరమేశ్వరన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటం.. కథ ముందుకు సాగేకొద్దీ పాత్రల మధ్య ఉన్న సంబంధాలు మారిపోతూ కనిపించాయి. అలాగే భావోద్వేగాలను చూపిస్తూనే సన్నివేశాలు అనుమానాల వైపు దారి తీస్తూ కనిపిం చాయి. ట్రైలర్ రెండో భాగంలో మరింత ఉత్కంఠ భరిత మైనదృశ్యాలు, హత్య దర్యాప్తు ఆసక్తిని పెంచు తున్నాయి. అసలు సంజూను ఎవరు హత్య చేశారు? మరీచిక ఎవరు? వారి జీవితాల్లో జరుగు తున్న పరిణామాలకు ద్రోహమే కారణమా? అనే ప్రశ్నలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తు న్నాయి. పోలీస్ దర్యాప్తు, భావోద్వేగ ఘర్షణలు, మిస్టరీ సన్నివేశాలు ఈ కథలో సైకలాజికల్, రివేంజ్ డ్రామా ఉండ బోతుందనే సంకేతాలు ఇస్తు న్నాయి. ప్రేక్షకులను ఉత్కంఠలో ఉంచే థ్రిల్లర్‌ను మన ముందుకు రాను న్నట్లు స్పష్టమవుతోంది. లెజెండ్రీ మ్యూజిక్ డైరెక్టర్ ఇళయరాజా అందించిన సంగీతం.. నేపథ్య సంగీతం ట్రైలర్ మొత్తం ఉత్కంఠను, భావోద్వేగ తీవ్రతను మరింత పెంచాయి.

## చిరు158 చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్‌గా అవినాశ్ కొల్లా



మెగాస్టార్ చిరంజీవి సెన్సేషనల్ సంక్రాంతి బ్లాక్‌బస్టర్ వాల్తేర్ వీరయ్య తర్వాత మరో మాస్ ఎంటర్‌టైనర్ కోసం సక్సెస్ ఫుల్ డైరెక్టర్ బాబీ కొల్లితో మరోసారి జతకడుతున్నారు. ఈ చిత్రాన్ని సుప్రసిద్ధ బ్యానర్ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్నారు. చిరుబాబీ2 / చిరు158 మే 21న అధి కారికంగా ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తిక్ కన్నన్ ఈ చిత్రానికి డీవోపీగా వ్యవహరిస్తు న్నారు. తాజాగా మేకర్స్ మరో టాప్ టాలెంట్‌ను టీమ్‌లోకి ఆహ్వానించారు. ప్రముఖ ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా టీంలో చేరారు. మెగాస్టార్ చిరంజీవిని ఇప్పటి వరకు ఎప్పుడూ చూడని అత్యంత ఫెరోషియస్ అవతార్‌లో ప్రజెంట్ చేయడానికి, భారీ స్థాయి సినిమాటిక్ వరల్డ్‌ను తన విజన్, ఎక్స్‌పర్టైజ్‌తో అవినాష్ కొల్లా అద్భుతంగా ఆవిష్కరించనున్నారు. ఇప్పటికే విడుదలైన లుక్ టెస్ట్ ఇమేజెస్, అనౌన్స్‌మెంట్ పోస్టర్, అలాగే చిరంజీవి జిమ్ ట్రాన్స్‌ఫర్మేషన్ వీడియో ఆయన కొత్త స్టైలిష్ అవతార్‌పై భారీ ఆసక్తిని పెంచాయి. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌ను గ్రాండ్‌గా తెరకెక్కించడంలో ప్రత్యేక గుర్తింపు ఉన్న బాబీ కొల్లి, ఈసారి చిరంజీవిని ఇప్పటివరకు చూడని అత్యంత పవర్‌ఫుల్ అవతార్‌లో చూపించబోతు న్నారు. మెగాస్టార్ స్క్రీన్ ప్రెజెన్స్‌ను మరింత ఎలివేట్ చేసేలా రూపొం దుతున్న ఈ చిత్రం పవర్‌ఫుల్ యాక్షన్ ఎపిసోడ్స్, హై వోల్టేజ్ ఎలివేషన్స్, థియేటర్లను షేక్ చేసే మాస్ మూమెంట్స్‌తో ఉండబోతోంది.

## ఎంజాయ్ చేసే చిత్రం ‘పురుష’: బత్తుల కోటేశ్వరరావు



కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల సరస్వతి సమర్పణలో బత్తుల కోటేశ్వరరావు నిర్మించిన చిత్రం పురుష ఈ మూవీతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాను మే 22న రిలీజ్ చేయబోతోన్నారు.

**మీ నేపథ్యం చెప్పండి?..**

నా పేరు బత్తుల కోటేశ్వరరావు. మాది గుంటూరు జిల్లాలోని కారంపూడి. నాకు సినిమా ఫీల్డుతో ఎలాంటి సంబంధం లేదు. కానీ ఇక్కడకు వచ్చాక అందరూ ఎంతో సపోర్ట్ చేస్తున్నారు.

**మీ అబ్బాయికి పవన్ కళ్యాణ్ అని పేరు పెట్టారు.. ఎందుకలా?..**

‘గోకులంలో సీత’ చూసిన తరువాత పవన్ కళ్యాణ్ గొప్ప స్థాయికి వెళ్తారని అనిపించింది. ఆ వయసులో నన్ను నేను ఆయన లో చూసుకున్నాను. ఆయన అభిమానిగా మారిపోయాను. నాకు కొడుకు పుడితే ఆయన పేరే పెట్టుకోవాలని అనుకున్నాను.

**సినిమాల్లోకి రావాలన్న ఆలోచన ఎవరిది?..**

సినిమా ఫీల్డ్ అంటే నాకు చాలా ఇష్టం. మా అబ్బాయికి సిగ్గు, బిడియం ఎక్కువ. హీరో అవ్వాలన్న నా కలని మా అబ్బాయి ద్వారా నెరవేర్చుకున్నాను.

**దర్శకుడితో ఉన్న పరిచయం చెప్పండి?..**

వీరుతో సినిమా కంటే ముందు ఓ దర్శకు డితో సినిమా చేయాల్సి ఉంది. కానీ అది కుదరలేదు. ఆ తరువాత సతీష్ ముత్యాల వీరుని పరిచయం చేశారు. కథ చెప్పారు. నాకు బాగా నచ్చింది. మా కన్‌స్ట్రక్షన్ ఆఫీస్‌నే సినిమా ఆఫీస్‌గా మార్చాం.

**‘పురుష’లో మీకు నచ్చిన పాయింట్స్ ఏంటండి?..**

‘పురుష’ కథ చాలా బాగుంటుంది. ఆయన నెరేషన్ ఇచ్చిన తీరు కూడా డిఫరెంట్‌గా ఉంది. ఇందులోని లవ్ స్టోరీ నాకు చాలా నచ్చింది. ఈ మూవీ అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉంటుంది.

**‘పురుష’లోని పాత్రల గురించి చెప్పండి?..** వీటీవీ గణేష్‌పాత్ర అందరినీ నవ్విస్తుంది. ఆయన మాకు ఎంతో సహకరించారు. డేట్స్ విషయంలో ఎంతో హెల్ప్ చేశారు. వెన్నెల కిషోర్ వల్లే కథలో సంఘర్షణ వస్తుంది. సప్తగిరి అద్భుతంగా నటించారు.

**‘పురుష’ మ్యూజిక్ గురించి చెప్పండి?..** మాకు శ్రవణ్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. మా కోసం కీరవాణి కూడా ఓ పాట పాడారు. అది మా అదృష్టం. ఇప్పటికే మా సినిమాలోని పాటలకు మంచి స్పందన లభించింది.

**‘పురుష’ను ఎన్ని థియేటర్లలో విడుదల చేస్తున్నారు?..** ‘పురుష’ సినిమాని మొత్తంగా మూడు వందల థియేటర్లలో రిలీజ్ చేస్తున్నాం.




## ఫ్రెంచ్ ఓపెన్‌లో..
# కర్మన్ కౌర్ ఔట్

**న్యూఢిల్లీ:** భారత మాజీ నంబర్ 1 కర్మన్ కౌర్ థండి, ఫ్రెంచ్ ఓపెన్ 2026 మహిళల టెన్నిస్ సింగిల్స్ క్వాలిఫైయర్స్ నుండి ఓటమితో నిష్క్రమించింది. దీంతో గ్రాండ్ స్లామ్ మెయిన్ డ్రాకు అర్హత సాధించాలన్న ఆమె ఆశలు ఆవిరయ్యాయి. ప్రొటెక్టెడ్ ర్యాంకింగ్‌ను ఉపయోగించి తిరిగి వచ్చిన 27 ఏళ్ల క్రీడాకారిణి, క్వాలిఫైయర్స్ ప్రారంభ రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన హార్మొనీ టాన్‌తో జరిగిన ఏకపక్ష పోరులో 1-6, 0-6 తేడాతో ఓడిపోయింది. ప్రస్తుతం డబ్ల్యూటిఎ ర్యాంకింగ్స్‌లో 1488వ స్థానంలో ఉన్న కర్మాన్, తన 238వ ప్రొటెక్టెడ్ ర్యాంకింగ్ (పిఆర్) కారణంగా ఎలైట్ క్వాలిఫికేషన్ డ్రాలో తన స్థానాన్ని దక్కించుకుంది. ఇది ఆమెను అధికారిక ఎంట్రీ జాబితాలో చేర్చింది. గాయం విరామం తర్వాత తన మొదటి పోటీ మ్యాచ్ ఆడుతున్న కర్మన్‌ను, ఆమె ఫ్రెంచ్ ప్రత్యర్థి ఏమాత్రం కుదురుకోనివ్వలేదు. ఆ తర్వాత భారత క్రీడాకారిణి రిటర్న్స్‌తో పాటు,
సర్వింగ్‌లో కూడా చాలా ఇబ్బంది పడింది. కర్మన్ తనకు లభించిన ఏకైక బ్రేక్‌పాయింట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది, కాగా టాన్ తనకు లభించిన ఎనిమిది అవకాశాలలో ఐదింటిని సద్వినియోగం చేసుకుంది. మూడేళ్లలో కర్మన్‌కు ఇది తొలి గ్రాండ్‌స్లామ్ కాగా, 2024 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అంకితా రైనా తర్వాత రెండేళ్లలో గ్రాండ్‌స్లామ్‌లో పోటీపడిన తొలి భారత మహిళ కూడా ఈమెనే. ఈ ఫ్రెంచ్ ఓపెన్ ఎడిషన్‌లో ఆమె ఒక్కతే భారతీయ క్రీడాకారిణి కావడంతో, సింగిల్స్ విభాగంలో భారత్ ప్రయాణం కూడా ముగిసింది.

# హాకీ సిరీస్‌లో భారత్ మహిళల జట్టు విజయం

### 4-1 తేడాతో ఆస్ట్రేలియా ఓటమి



**న్యూఢిల్లీ:** హాకీ సిరీస్‌లోని నాల్గవ చివరి మ్యాచ్‌లో భారత అండర్ 18 మహిళల జట్టు ఆస్ట్రేలియాను 4-1 తేడాతో ఓడించి ఆధిపత్య ప్రదర్శన కనబరిచింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో మొదటి క్వార్టర్ ప్రారంభంలోనే అరోరా కోవసెవిచ్ 8వ నిముషం ద్వారా ఆస్ట్రేలియా ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే, భారత్ వెంటనే స్పందించి, కెప్టెన్ స్వీటీ కుజుర్ (13) తొలి క్వార్టర్ ముగిసేలోపే స్కోరును సమం చేసింది.
రెండవ క్వార్టర్‌లో కూడా ఆతిథ్య జట్టు తమ జోరును కొనసాగించింది. దియా (25వ నిమిషంలో) గోల్ చేయడంతో, విరామ సమయానికి భారత్ 2-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. భారత్ రెండవ అర్ధభాగంలో కూడా పట్టు నిలుపుకొని, మూడవ క్వార్టర్‌లో ప్రియాంక మింజ్ (44) ద్వారా తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. ఆ తర్వాత చివరి క్వార్టర్‌లో నౌషీన్ నాజ్ (50) మరో గోల్ జోడించడంతో, ఆతిథ్య జట్టు ఘన విజయం సాధించింది. ఈ విజయంతో హోరాహోరీగా సాగిన సిరీస్‌లో భారత జట్టు ఘనంగా ముగించి, ఈ నెల చివరలో జపాన్‌లో ప్రారంభమయ్యే అండర్18 ఆసియా కప్‌కుసిద్ధమైంది.

## మలేసియా మాస్టర్స్‌లో
# మల్వికా విజయం

### తొలి రౌండ్‌లోనే లక్ష్య, ప్రణయ్ నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** మలేసియామాస్టర్స్ సూపర్500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మహిళల విభాగంలో భారత్ అగ్రశ్రేణి షట్లర్లు మాల్విక బన్సోద్ విజయం సాధించగా, పురుషుల విభాగంలో హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్ తొలిదశలోనే నిష్క్రమించారు. కౌలాలంపూంలో బుధవారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో ఆల్ ఇంగ్లాండ్ ఫైనలిస్ట్ లక్ష్య, ఇండోనేషియాకు చెందిన 18 ఏళ్ల వర్ధమాన ఆటగాడు జాకీ ఉబైదిల్లా చేతిలో 17-21, 11-21 తేడాతో వరుస గేమ్‌లలో ఓటమి పాలయ్యాడు. రెండుసార్లు జూనియర్ ప్రపంచ పతక విజేత అయిన జాకీ, తనకంటే చాలా ఉన్నత ర్యాంకులో ఉన్న ప్రత్యర్థిని మొదటి రౌండ్‌లో 43 నిమిషాల్లో సునాయాసంగా ఓడించాడు. మరోవైపు, ప్రణయ్ జపాన్‌కు చెందిన ప్రపంచ 9వ ర్యాంకర్ కోడై నరవోకాతో హోరాహోరీగా పోరాడినా, చివరి క్షణాల్లో సంయమనం కోల్పోవడంతో మ్యాచ్‌ను కోల్పోయాడు. నిర్ణయాత్మక



సెట్‌లో 20-16 ఆధిక్యంలో ఉన్న 33 ఏళ్ల ఆటగాడికి ఐదు మ్యాచ్ పాయింట్లు లభించినప్పటికీ, అతను దానిని ముగించలేక 17-21, 22-20, 22-24 స్కోరుతో మూడు గేమ్‌లలో ఓడిపోయాడు. మరోవైపు, మాల్విక బన్సోద్ జర్మనీకి చెందిన యవోన్ లీని మూడు గేమ్‌లలో 21-17, 16-21, 21-9 తేడాతో ఓడించి, భారత్‌కు మొదటి విజయాన్ని నమోదు చేసింది. ఆమె తదుపరి డెన్మార్క్‌కు చెందిన లైన్ జేర్స్‌ఫెల్డ్‌తో తలపడనుంది, ఆమె మొదటి రౌండ్ మ్యాచ్‌లో మరో యువ భారత షట్లర్ అన్మోల్ ఖర్బ్‌ను 13-21, 21-16, 21-19 తేడాతో ఓడించింది.



# చివరి దశకు ఐపిఎల్ లీగ్

### నేడు చెన్నైకి చావో రేవో.. టాప్ 2పైనే గిల్ సేన గురి

**న్యూఢిల్లీ:** ఐపీఎల్-2026 లీగ్ దశ ముగింపునకు వస్తున్న వేళ క్రికెట్ సమరం రసవత్తరంగా మారింది. క్వాలిఫైయర్1 ఆడేందుకు టాప్2 స్థానమే లక్ష్యంగా గుజరాత్ టైటాన్స్ గురిపెట్టగా, వరుస ఓటములతో కుదేలైన ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ పరువు నిలుపుకోవాలని చూస్తోంది. ఇందుకు ఈ నెల 21వ తేదీన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఈ ఇరు జట్లు తలపడనున్నాయి. ఐపీఎల్ లీగ్ పట్టికలో అగ్రస్థానాల్లో నిలిచే జట్లకు ఫైనల్ చేరడానికి రెండు అవకాశాలు (క్వాలిఫైయర్ 1, క్వాలిఫైయర్ 2) లభిస్తాయి. ప్రస్తుతం 16 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్న గుజరాత్ టైటాన్స్, టేబుల్ టాపర్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (18 పాయింట్లు), సన్‌రైజర్స్ హైదరాబాద్ (16 పాయింట్లు) జట్లతో తీవ్ర పోటీని ఎదుర్కొంటోంది. ఈ మ్యాచ్‌లో చెన్నైపై భారీ తేడాతో విజయం సాధిస్తే, గుజరాత్ జట్టు రన్ రేట్ పరంగా మరింత బలాన్ని పుంజుకుంటుంది. ప్రస్తుతం గుజరాత్ నెట్ రన్ రేట్ (+0.400) హైదరాబాద్ (+0.350) కంటే మెరుగ్గా ఉండటం గిల్ సేనకు కలిసివచ్చే అంశం. మరోవైపు, సన్‌రైజర్స్ చేతిలో తృటిలో ఓడిపోయిన చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్ ఆశలు దాదాపు గల్లంతయ్యాయి. రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలోని చెన్నై జట్టు టోర్నీలో నిలవాలంటే ఈ మ్యాచ్‌లో గెలవడంతో పాటు, ఇతర జట్ల ఓటములపై ఆధారపడాల్సి ఉంటుంది. దీంతో ఎలాగైనా ఈ మ్యాచ్‌లో గెలిచి తమ పరువు నిలుపుకోవాలని సీఎస్‌కే భావిస్తోంది. బ్యాటింగ్‌కు అనుకూలించే అహ్మదాబాద్ పిచ్‌పై గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఓపెనర్ సాయి సుదర్శన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. పవర్‌ప్లేలో చెన్నై బౌలింగ్‌ను ఎదుర్కొని నిలబడితే గుజరాత్‌కు భారీ స్కోరు ఖాయం. అయితే, గుజరాత్ మిడిలార్డర్ నిలకడలేమితో సతమతమవుతోంది. దీన్ని ఆసరాగా చేసుకుని చెన్నై ఎడమచేతి వాటం స్పిన్నర్ అకీల్ హుసేన్‌తో గిల్‌ను కట్టడి చేయాలని చూస్తోంది. గతంలో హుసేన్ ట్వంటీ20ల్లో గిల్‌ను రెండుసార్లు అవుట్ చేయడం ఇక్కడ గమనార్హం. మిడిల్ ఓవర్లలో గుజరాత్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్‌ను ఎదుర్కోవడం చెన్నై బ్యాటర్లకు పెద్ద సవాలు కానుంది. ఈ స్పిన్ ఉచ్చును ఛేదించడానికి చెన్నై వైపు నుంచి సంజూ శాంసన్ అత్యంత కీలకమైన ఆటగాడిగా మారనున్నాడు. రషీద్ అద్భుతమైన రిస్ట్ స్పిన్‌ను సంజూ ఎంతవరకు సమర్థవంతంగా ఎదుర్కొంటాడనే దానిపైనే చెన్నై విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

# పాక్ ఘోర ఓటమి

### వైట్‌వాష్ చేసిన బంగ్లాదేశ్

**న్యూఢిల్లీ:** టెస్టు చివరి రోజున బంగ్లాదేశ్ 78 పరుగుల తేడాతో విజయం సాధించడంతో, రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో పాకిస్థాన్‌ను వైట్‌వాష్ చేసింది. ఆఖరి రోజు బుధవారం సిల్హెట్‌లో 436 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో, పాకిస్థాన్‌ను 358 పరుగులకే ఆలౌట్ చేయడంలో ఆతిథ్య జట్టుకు సహాయపడిన తైజుల్, 6-120 నమోదు చేశాడు. మహమ్మద్ రిజ్వాన్, ఆల్‌రౌండర్ సాజిద్ ఖాన్ విలువైన పరుగులు జోడించి, 50కి పైగా కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి స్కోరు 350 దాటించారు. చివరకు తైజుల్ 36 బంతుల్లో 28 పరుగులు చేసిన సాజిద్ ఖాన్‌ను ఔట్ చేశాడు. షోరిఫుల్ ఇస్లాం మహమ్మద్ రిజ్వాన్‌ను (94) ఔట్ చేయడంతో పాక్ మరో వికెట్ కోల్పోయింది. తర్వాత తైజుల్ ఖుర్రం షెహజాద్‌ను డకౌట్‌తో మ్యాచ్‌ను ముగించాడు.



అంతకుముందు, భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, పాక్ ఓపెనర్లు అబ్దుల్లా ఫజల్, అజాన్ అవైస్ ఔటవడంతో ఆ జట్టు ఆరంభం తడబడింది. తర్వాత బాబర్ అజామ్, షాన్ మసూద్‌తో కలిసి 92 రన్స్ భాగస్వామ్యంతో ఇన్నింగ్స్ నిలబెట్టాడు. అయితే తైజుల్ బాబర్‌ను పెవిలియన్‌కు పంపాడు. సౌద్ షకీల్ కేవలం 6 రన్స్ మాత్రమే చేయడంతో, 154-4తో పాకిస్థాన్ ఒత్తిడిలోకి జారింది. తైజుల్ బౌలింగ్‌లో అవుటవడంతో పాకిస్థాన్ మరింత పతనమైంది. అయితే రిజ్వాన్, సల్మాన్‌లు ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించి, పాక్‌ను 200 మార్కు దాటించాడు. తైజుల్ మళ్ళీ 71 పరుగుల వద్ద సల్మాన్, హాసన్ అలీ కూడా ఔటవడంతో, నాల్గో రోజు ఆట ముగిసేనాటికి పాక్ 316/7 స్కోరును నమోదు చేసింది. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 278 రన్స్ చేసింది. పాక్ తరఫున ఖుర్రం షెహజాద్ 4 వికెట్లు పడగొట్టాడు. ప్రత్యుత్తరంగా పాకిస్థాన్ 57.4 ఓవర్లలో 232 పరుగులకే ఆలౌట్ కావడంతో, ఆతిథ్య జట్టు 46 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. బాబర్ అజమ్ 68 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలవగా, సాజిద్ 38 రన్స్ సాధించాడు. బంగ్లాదేశ్ నహిద్ రాణా, తైజుల్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. 46 పరుగుల ఆధిక్యంతో తమ రెండవ ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన బంగ్లాదేశ్, 137 రన్స్ చేసిన ముష్ఫికర్ రహీం సెంచరీతో మరో 390 పరుగులు జోడించి, 437 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. దీన్ని ఛేదించడంలో పాక్ జట్టు విఫలమైంది.

# సెన్సెక్స్ నిఫ్టీల్లో రికవరీ

### స్వల్ప లాభాలతో ముగిసిన మార్కెట్లు




**ముంబయి, మే 20:** రెండురోజులపాటు నష్టాలు చవిచూసిన స్టాక్ మార్కెట్లు బుధవారం రికవరీ అయ్యాయి. సెన్సెక్స్ ఒక్కసారిగా 800 పాయింట్లుపెరిగింది, నిఫ్టీ కూడా 23,650వద్దకు చేరింది. ఆయిల్ అండ్‌గ్యాస్ స్టాక్స్ రికవరీకి ఉపకరించాయి. ఎఫ్ఎంసిజి, ఐటి షేర్లు మాత్రం ఒత్తిడిలోనే కొనసాగాయి. దిగువస్థాయిలోనే కొనుగోళ్లు జరిగినట్లు అంచనా. ముడిచమురు ధరలు కొంతమేర దిగిరావడం, మధ్యప్రాచ్యం ఉద్రిక్తతలు చల్లబడుతుండటం కూడా పెరుగుదలకు దోహదంచేసింది. బిఎస్ఇ సెన్సెక్స్ 117.54 పాయింట్లుపెరిగి 75,318.39 పాయింట్లకు చేరింది. నిఫ్టీ 50 సూచీ కూడా 41 పాయింట్లుపెరిగి 23,659 పాయింట్లవద్దకు చేరింది.రిలయన్స్ ఇండస్ట్రీస్ 3.55శాతం, హిందాల్కో ఇండస్ట్రీస్ 2.80శాతం, యాక్సిస్‌బ్యాంకు 0.93శాతం వంటివిసూచీలకు మద్దతిచ్చాయి.
బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.51శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.09శాతంచొప్పునపెరిగాయి మార్కెట్లలో ఎన్ఎస్ఇలో 1720 షేర్లుపెరిగితే 1542 షేర్లుక్షీణించాయి. మరో 110 షేర్లుస్థిరంగా కొనసాగాయి. విదేశీ మార్కెట్‌లో భారత కరెన్సీ 96.90వద్దకు చేరింది.చివరకు ముగింపు దశలో 96.9575కు కూడా చేరింది. పదేళ్ల బెంచ్‌మార్కు బాండ్లు 0.21శాతం క్షీణించాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు జూలై సెటిల్‌మెంట్‌దరలు 2.30 డాలర్లు క్షీణించి బ్యారెల్‌కు 111.28 డాలర్లుగా కొనసాగింది. నిఫ్టీలో ఆయిల్‌గ్యాస్‌సూచీ 1.59శాతంపెరిగింది. గడచిన రెండు సెషన్లలోకూడా 1.76శాతం పెరిగింది. హిందాల్కో ఇండస్ట్రీస్ 3.55శాతంపెరిగింది.త్రైమాసిక ఫలితాలు ఊతం ఇచ్చాయి. జీ ఎంటర్‌టైన్‌మెంట్స్ మాత్రం 5.39శాతం క్షీణించాయి. బోరోసిల్ కూడా 2.25శాతం క్షీణించింది. డైనామాటిక్ టెక్నాలజీస్ 3.89శాతం దిగజారింది. ఎఎస్‌కె ఆటోమోటివ్స్ 2.48శాతం క్షీణిస్తే కర్ణాటక బ్యాంకు 6.48శాతం పెరిగింది. సియారామ్ సిల్క్ మిల్స్ 6.29శాతం వెనకబడింది. సిఇ ఇన్ఫోసిస్టమ్స్ 5.65శాతంపతనం అయితే అవలాన్ టెక్నాలజీస్ 7.94శాతం, బిఎల్ఎస్ ఇంటర్నేషనల్ సర్వీసెస్ 2.44శాతం పెరిగాయి. మొత్తంగాచూస్తే మార్కెట్లపై రూపాయి ఎఫెక్ట్‌కూడా తీవ్రస్థాయిలోనే ఉంది.ఆల్‌టైమ్ కనిష్టం 96.90వద్ద ముగిసిందంటే డాలర్ చెల్లింపులు పెరుగుతున్నట్లు స్పష్టం అవుతోంది. ఆర్‌బిఐ డాలర్ కౌంటర్ ప్రారంభించడవల్లనే ఈస్తాయిలో అయినా కొంతమేరకట్టడి అయింది.

# రికార్డుస్థాయికి పడిపోతున్న రూపాయి

## డాలర్ జోరుకు దేశీయ కరెన్సీ బేజారు




**ముంబయి,మే 20:** గ్లోబల్ కరెన్సీ మార్కెట్లో రూపాయి విలువ రికార్డు స్థాయిలో క్షీణిస్తోంది. పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండటంతో రూపాయి విలువ డాలరుకు 96.90కి పడిపోయింది. అతి త్వరలోనే 100కి పడిపోయే అవకాశం ఉంది. ఈ కరెన్సీ మార్పులు కేవలం స్టాక్ మార్కెట్లకు లేదా పెద్ద వ్యాపారవేత్తలకే పరిమితం కావు. ఇది దేశంలోని ప్రతి సామాన్యుడి జేబుపై, దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. భారతదేశం అనేక వస్తువుల కోసం ఇతర దేశాలపై ఆధారపడుతుంది. మనం దిగుమతి చేసుకునే వస్తువులకు అంతర్జాతీయంగా డాలర్లలోనే చెల్లింపులుచేయాలి. రూపాయి బలహీనపడటం వల్ల ఈ క్రింది నష్టాలు వస్తాయి. భారతదేశం తన దేశీయ అవసరాల కోసం దాదాపు 80 పైగా ముడి చమురును దిగుమతి చేసుకుంటుంది. డాలర్ బలపడితే, మనం చమురు కోసం ఎక్కువ రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. దీనివల్ల పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయి. రవాణా ఖర్చులు ఎక్కువై నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతాయి. స్మార్ట్‌ఫోన్లు, లాప్‌టాప్‌లు, ఆటో మొబైల్ విడిభాగాలు మరియు బంగారం దిగుమతి ఖర్చు పెరుగుతుంది. అమెరికా లేదా ఇతర దేశాలలో చదువుకునే భారతీయ విద్యార్థుల ఫీజులు భారీగా పెరుగుతాయి. రూపాయి విలువ తగ్గడం వల్ల వారు హాస్టల్ ఖర్చులు, ట్యూషన్ ఫీజుల కోసం ఎక్కువ మొత్తంలో రూపాయలను డాలర్లుగా మార్చాల్సి వస్తుంది. విదేశీ ప్రయాణాలు చేసే వారికి కూడా బడ్జెట్ దాటిపోతుంది. అనేక భారతీయ కంపెనీలు విదేశాల నుండి డాలర్ల రూపంలో అప్పులు తీసుకుంటాయి. రూపాయి పడిపోయినప్పుడు, ఆ అప్పులపై వడ్డీలు, అసలు తిరిగి చెల్లించడం కంపెనీలకు చాలా భారంగా మారుతుంది.
రూపాయి పతనం దేశానికి నష్టమే అయినప్పటికీ, కొన్ని రకాల రంగాలు, వ్యక్తులకు లాభదాయకంగా మారుతుంది భారతదేశం నుండి వస్తువులను లేదా సేవలను విదేశాలకు ఎగుమతి చేసే వారికి ఇది కలిసి వస్తుంది. ముఖ్యంగా ఐటీ, ఫార్మా, టెక్స్‌టైల్స్ రంగాలు తమ సేవలకు గానూ డాలర్లలో ఆదాయం పొందుతాయి. వారు ఆ డాలర్లను రూపాయిల్లోకి మార్చుకున్నప్పుడు భారీగా లాభాలు వస్తాయి. విదేశాల్లో ఉద్యోగాలు చేస్తూ భారత దేశంలో ఉన్న తమ కుటుంబాలకు డబ్బులు పంపే ప్రవాస భారతీయులు పంపే ప్రతి డాలరుకు గతం కంటే ఎక్కువ రూపాయలు వస్తాయి. విదేశీ వస్తువుల దిగుమతి ఖరీదైనదిగా మారడంతో, దేశీయంగా తయారయ్యే వస్తువులకు డిమాండ్ పెరుగుతుంది. రూపాయి మరీ ఘోరంగా పడిపోకుండా ఉండటానికి భారత రిజర్వ్ బ్యాంక్ తన వద్ద ఉన్న విదేశీ మారక నిల్వల నుండి డాలర్లను మార్కెట్లో విక్రయిస్తుంది. తద్వారా రూపాయి పతనానికి బ్రేకులు వేయడానికి ప్రయత్నిస్తుంది. అంతర్జాతీయ మార్కెట్ ఒత్తిడి తీవ్రంగా ఉన్నప్పుడు రూపాయి విలువ కొంతమేర తగ్గడం సహజం. భారతీయ రూపాయి వేగంగా పడిపోకుండా కాపాడటానికి భారతీయ రిజర్వ్ బ్యాంక్ మేనేజ్డ్ ఫ్లోట్ అనే విధానాన్ని ఉపయోగిస్తుంది. రూపాయి విలువను ఒకే నిర్దిష్ట సంఖ్య వద్ద నిలిపి ఉంచడం ఆర్బీఐ లక్ష్యం కాదు, కానీ మార్కెట్లో ఒక్కసారిగా వచ్చే తీవ్రమైన ఒడిదుడుకులను, భయాందోళనలను అరికట్టి రూపాయి పతనం నియంత్రణలో ఉండేలా చూడటమే దాని ప్రధాన బాధ్యత.
దీని కోసం ఆర్బీఐ మార్కెట్ జోక్యం, లిక్విడిటీ నియంత్రణలు మరియు నిబంధనల రూపంలో బహుముఖ వ్యూహాలను మరియు సాధనాలను ప్రయోగిస్తుంది. తన వద్దఉన్న విదేశీ మారక నిల్వల నుండి డాలర్లను మార్కెట్లో విక్రయించి రూపాయికి బ్రేకులు వేస్తుంది. మార్కెట్లో రూపాయి లభ్యతను తగ్గించి సట్టా వ్యాపారులకు అడ్డుకట్ట వేస్తుంది. విదేశీ పెట్టుబడులు మరియు, డిపాజిట్లను ఆకర్షించేలా నిబంధనలు సడలిస్తుంది. బ్యాంకులు రూపాయిపై ఊహాజనిత ట్రేడింగ్ చేయకుండా పరిమితులు విధిస్తుంది. రూపాయి 96.90 దాటి పడిపోకుండా కాపాడటానికి ఆర్బీఐ ఇటీవలి కాలంలో దాదాపు 30 నుండి 38 బిలియన్ల డాలర్ నిల్వలను మార్కెట్లోకి వదిలింది.

# ఎనిమిది కీలకరంగాల్లో గతనెల 1.7శాతమే వృద్ధి

**న్యూఢిల్లీ, మే 20:** భారత్‌లోని ఎనిమిది కీలక రంగాల వృద్ధి ఏప్రిల్‌నెలలో 1.7శాతంగా నమోదయింది. అదే మార్చినెలలో 0.4శాతం ప్రతికూల వృద్ధినుంచి మెరుగుపడిందని వాణిజ్య మంత్రిత్వశాఖ స్పష్టంచేసింది. ఎనిమిది పరిశ్రమల్లో ఐదు పరిశ్రమలకు ఏప్రిల్ నెలలో కొంతమేర హెచ్చుతగ్గులున్నాయి. అయితే భారత్ కోర్ సెక్టార్ ఉత్పత్తి మాత్రం మార్చినెలలో సవరించారు. 1.2 శాతంగా ఉందని తేలింది. సమిష్టివృద్ధి పరంగాచూస్తే 2025-26లో ఏప్రిల్‌నుంచి ఈ ఏడాది మార్చివరకూ 2.7శాతంగా ఉందని గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే వృద్ధి నమోదయినట్లు చెపుతోంది. ఎనిమిది కీలకపరిశ్రమల్లో వృద్ధివరుసగా ఆరు నెలలనుంచి మెరుగవుతూనే వచ్చిందని వాణిజ్యమంత్రిత్వశాఖ వివరించింది. ఎనిమిదింటిలో మూడు రరంగాలు ఏప్రిల్‌లో మరింత వృద్ధిరించాయి. సిమెంట్, స్టీల్, విద్యుత్‌రంగాల పరిశ్రమలు సానుకూల వృద్ధిని సాధించాయి. ఉక్కు ఉత్పత్తి 6.2శాతంగా ఉంది. అయితే బొగ్గురంగంలో 8.7శాతం దిగువకు చేరింది. ఎరువులరంగంలో ఉత్పత్తి ఏప్రిల్‌లో 8.6శాతంగా తగ్గింది. పెట్రోలియం శుద్ధి ఉత్పత్తులు 0.5శాతం క్షీణించాయి. ఐఐపి సూచీ ప్రకారం మార్చినెలలో 4.1శాతంగా నమోదయి సానుకూల వృద్ధిననమోదుచేస్తే కీలకరంగాల వృద్ధిమాత్రం స్థిరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇరాన్ అమెరికా యుద్ధం వల్ల ఇంధన సరఫరాను దెబ్బతీసింది. దీనితో ఉత్పత్తిరంగంపై కీలకప్రభావం పడింది. ఉత్పత్తి 5.9శాతంనుంచి 4.3శాతంగా ఉంది. విద్యుత్ ఉత్పత్తి కూడా 2.3శాతంనుంచి 0.8శాతానికి పడిపోయింది.

# సెబీ ఫండ్స్‌రంగంలో సంస్కరణలు

### నెలవారీ సమష్టి నివేదిక విధానం అమల్లోకి...




**ముంబయి, మే 20:** మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్ల ప్రయోజనాల కోసం సెబీ ప్రధాన నిర్ణయాలు ప్రకటించింది. మంత్లీ క్యుములేటివ్ రిపోర్ట్ విధానాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసింది. దీనివల్ల సిప్ రిపోర్టింగ్ ప్రమాణాల్లో పారదర్శకత మరింత పెరగనుంది. ఇకపై ప్రతి నెలా కొత్త సిప్ రిజిస్ట్రేషన్లు, ఫోలియోల వృద్ధికి సంబంధించిన లెక్కలు ఇన్వెస్టర్లకు స్పష్టంగా కనిపిస్తాయి. అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు మార్కెట్ నియంత్రణ సంస్థకు ఖచ్చితమైన గణాంకాలను అందించేలా ఈ కొత్త నిబంధనలు దోహదపడతాయి. పెట్టుబడిదారులు ఎంత కాలం పాటు తమ ఇన్వెస్ట్‌మెంట్‌లను కొనసాగిస్తున్నారో తెలుసుకునేందుకు సిప్ స్టాపేజ్ రేషియోపై సెబీ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. గతంలో కేవలం కొత్తగా వచ్చే పెట్టుబడుల వివరాలు మాత్రమే ఉండేవి, దీనివల్ల ఎంతమంది సిప్ ఆపేస్తున్నారో తెలిసేది కాదు. ఇప్పుడు కొత్త రిజిస్ట్రేషన్లతో పాటు రద్దయిన సిప్ వివరాలను కూడా ట్రాక్ చేయడం వల్ల అసలైన వెల్త్ క్రియేషన్ ట్రెండ్స్ బయటకు వస్తాయి. ఇది యువ ప్రొఫెషనల్స్ తమ పెట్టుబడి ప్రయాణాన్ని ప్రారంభించే ముందు ఫండ్ల స్థిరత్వాన్ని అంచనా వేయడానికి సహాయపడుతుంది. మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఇచ్చే డేటా, స్కీమ్‌లలోని వాస్తవ నగదు ప్రవాహానికి సరిగ్గా సరిపోలాలని ట్రస్టీలు ఇకపై నిర్ధారించాల్సి ఉంటుంది. ఈ ప్రామాణిక ఫార్మాట్లను ఉపయోగించి ఆంఫీ ప్రతి నెలా ఇండస్ట్రీ ట్రెండ్స్‌ను సామాన్య ప్రజల కోసం విడుదల చేస్తుంది. ఇందులో ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఇఎల్ఎస్ఎస్), రిటైర్మెంట్ ఫండ్ ఫోలియోల వివరాలు కూడా ఉంటాయి. క్రమశిక్షణతో కూడిన ఆర్థిక ప్రణాళిక కోసం ఇన్వెస్టర్లు ఈ ఫ్యాక్ట్‌షీట్లను గమనిస్తూ సరైన ఫండ్లను ఎంచుకోవాలి. సెబీ కొత్త నిబంధనల వల్ల ఇన్వెస్టర్లు రిస్క్ మరియు రిటర్న్ ప్రొఫైల్స్‌ను మరింత సమర్థవంతంగా పోల్చి చూడవచ్చు. ఫండ్ హౌస్‌లు ప్రతి నెలా 10వ తేదీ లోపు తమ నివేదికలను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది.

# కృత్రిమమేధలో గూగుల్ ఎఐ ఆధిపత్యం



**సియాటెల్, మే 20:** ఆల్ఫాబెట్ నేతృత్వంలోని గూగుల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) రంగంలో తమ ఆధిపత్యాన్ని చాటుతోంది. తమ ఎఐ మోడళ్లను ఉపయోగించి ప్రతి నెలా 85 లక్షల మందికి పైగా డెవలపర్లు యాప్స్, ఇతర సేవలను రూపొందిస్తున్నారని గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ వెల్లడించారు. ఎఐ మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు పెడుతున్నామని, ఈ ఏడాది మూలధన వ్యయం సుమారు 190 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని తెలిపారు. ఈ నిధులను ప్రధానంగా ఎఐ డేటా సెంటర్లు, కస్టమ్ సిలికాన్, మోడల్ ట్రైనింగ్ కోసం కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు. డెవలపర్లు, ఎంటర్‌ప్రైజెస్‌తో పాటు సాధారణ వినియోగదారుల నుంచి కూడా తమ ఎఐ సేవలకు డిమాండ్ వేగంగా పెరుగుతోందని పిచాయ్ వివరించారు. గూగుల్ జెమిని యాప్ నెలవారీ యాక్టివ్ యూజర్ల సంఖ్య గతేడాదితో పోలిస్తే రెట్టింపు అయి, ప్రస్తుతం 90 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ఎఐ ఓవర్‌వ్యూస్ ఫీచర్‌ను నెలకు 250 కోట్ల మంది, ఎఐ మోడ్‌ను 100 కోట్ల మందికి పైగా వినియోగిస్తున్నారని తెలిపారు. కొత్త ఎఐ టూల్స్‌ను, అప్‌గ్రేడ్లను కూడా గూగుల్ పరిచయం చేసింది. కోడింగ్, వర్క్‌ఫ్లోల కోసం వేగవంతమైన జెమిని 3.5 ఫ్లాష్ మోడల్, యూజర్ల తరఫున పనులు పూర్తిచేసే పర్సనల్ ఎఐ ఏజెంట్ జెమిని స్పార్క్ ఉన్నాయి. యూట్యూబ్‌లో సంభాషణల ద్వారా వీడియోల్లోని కీలకమైన క్షణాలను కనుగొనడానికి ఆస్క్ యూట్యూబ్ అనే కొత్త ఫీచర్‌ను, వాయిస్ కమాండ్స్‌తో డాక్యుమెంట్లు సృష్టించేందుకు డాక్స్ లైవ్‌ను కూడా ఆవిష్కరించింది. ఎఐ శిక్షణ, కార్యకలాపాలను వేగవంతం చేయడానికి తమ సరికొత్త తరం టెన్సర్ ప్రాసెసింగ్ యూనిట్లను (టిపియు) కూడా అందుబాటులోకి తెచ్చినట్లు గూగుల్ వెల్లడించింది. కంపెనీ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో ప్రపంచవ్యాప్తంగా ప్రజల జీవితాలను మెరుగుపరచడంలో ఏఐ అత్యంత కీలకమైన టెక్నాలజీ అని పిచాయ్ తెలిపారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.